మే '71

20


# నయా

ఆధునిక సాహిత్య వేదిక

ఎవరు హృదయాలం శ్రీశ్రీని ఇంకా మించిపోగలరు?

## LENIN AND THE NEW TRENDS IN MODERN TELUGU POETRY AND DRAMA

By: SRI SRI



...nd immediately after first World War. The present ...merican century. It was America this and America ...g. I remember reading a Telugu writer describe ...n earth (Doth not amara in sanskrit and Telugu ...n bubble was pricked. Deutschaland was no longer ...g to set on the British Empire. Japan's sun was ...un of the Russian revolution has already risen, not ...he source of radiation that is destined to illuminate ...hough there still nearly 30 more years to go, I am ...f history, to call this century Lenin's ceutury. His ...l pervasive, and his thought is sure to influence ...n I care to contenplate.

...dramatic, if I assert that this thought has pro... poetry and drama. I may also be accused of ...Lininist influence to the exclusion of all other influences including the American. I shall presently takeup the evil emanations from America of sex, crime, violence and other nenroses. Let me make it abundantly clear that I am a partisan and I am committed to the cause of Socialism. I consider all non-committed writing as irresponsible writing. Even a re-actionary poet is committed to sing the glories of the past. He re:writes the Ramayana in snorous verse, swears by the Varnasrama Dharma, composes worshipful hymns in praise of an obscurantist god, and fulminates against those who would deny him the Jnanapith award. ( It is immaterial for him that the award is all too material).

Such poets may be contemparary but never modern. I donot want to waste the valuable space at my disposal, denouncing these so called Neo-classical writers. They are, at the lowest estimate, a millennium behind our times If their works are prescribed as required reading in our Universities, I am sorry for the Universities. And yet Iam optimistic enough to hope that a thorough overhauling of our country's entire educational machinery is just around the corner.

Now, what is poetry and what is drama and what has Lenin got to do with either or both? Ha... written any ... the n...? Has he written at least a one-act p... The... are th... conv...nal critic conveniently asks and consid... that he... "saved" ...terate... ...er all, a politician. Poetry and Dra... are Art ... is abo... ...litics, or below according to the critics standi... class. Ah! ...ling class! and the ruined class and the clas... ...es! ... is prec...ely on th... ...tic that Marx drew in bold outlines th... ...print ... his ...ghty mansion. But then Marx was merely ... ...ming, mer... specu... ...made the dream a reality. (Even to this da... the ...mmu... Manisfest... ...fying nightmare to some). Marx, in the wo... of ...yak...y.

"...Caught the pilferers of surplus
with the pelf, red-handed."

Lenin put the creators of the surplus value at the helm of affairs, and overnight a new word was born.

"Maro Prapancham, Maro Prapancham
Maro Prapancham pilichindi" sang a Telugu poet who is none other than the one standing before you and it was at that movement when this Maro-Prapancham (another world) reckoned that modern Telugu poetry was born I am hesitingly attributing the author. ship of this poem to vladimir Ilyich Lenin, even though at that time I had not read John Reed's "Ten days that shook the world".

నిర్వహణ : 'సాహితీ మిత్రులు'

వెల: ఒకరూపాయి

# సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాస పత్రిక


**20**

మే 1971


నిర్వహణ

'సాహితీ మిత్రులు'


82 పేజీలు ఒక రూపాయి

సృజన చిరునామాలో మార్పు :
4/729
కుమార్‌పల్లి
హనుమకొండ.
వరంగల్ 1 (ఆం. ప్ర.)

సంవత్సర చందా : పది రూపాయలు
అర్ధ సంవత్సర చందా : ఆరు రూపాయలు
విడిప్రతి : ఒక రూపాయి

ముద్రణ :
వేంకటరమణ ముద్రణాలయము
జె. పి. ఎన్. రోడ్, వరంగల్-2

# సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మే 1971 మాసపత్రిక 20

# 'ఎన్ని హృదయాల్లోంచి శ్రీశ్రీని చించగలరు?'

విప్లవకవుల ఇండ్లపై దాడిచేసి మార్క్స్, లెనిన్ గ్రంథాలను పోలీసు వాళ్ళు ఎత్తుక పోయినపుడు ప్రధానమంత్రికి ఉత్తరం రాస్తూ చాల వ్యగ్రతతో కాని చాల అమాయకంగా, 'మార్క్స్‌నూ లెనిన్‌నూ చదవడం యీ దేశంలో ఎప్పటినుంచి నేరంగా పరిగణించ బడుతున్నది?' (Since when it has be come a crime to read Marx and Lenin in this country) అని అడిగారు ఎ. కె. గోపాలన్‌గారు.

మొదటినుంచీ నేరంగానే పరిగణింప బడుతున్నది. మార్క్స్‌నూ లెనిన్‌నూ పొగిడితే నేరంకాదుకాని చదివితే నేరమే. పొగడడానికి శతజయంతి చేసిందికాని ప్రభుత్వం, లెనిన్‌ను చదవడానికికాదు. ఆచరించడానికి అంతకన్నా కాదు. హిపొక్రిసీ దీని మారు పేరు.

ఈచెట్టుకాసినకాయే అయిన వరంగల్ మెడికల్ కాలెజ్ ప్రిన్సిపల్‌గారు శ్రీశ్రీ రచనవేసి, వేయడం గర్వంగా భావించి, స్వయంగా శ్రీశ్రీకి బహూకరించి, వెనుకనించి చించివేసి విద్యార్థులకు పంచాడంటే ఎప్పటినుంచి విద్యార్థులకు శ్రీశ్రీ నిషేధమో మేం అడుగదల్చుకోలేదు.

దోపిడీ వ్యవస్థ ద్వంద్వనీతి చరిత్రిలో ఇది ఇంకొక నిదర్శనంగా చేరిపోతుంది. కాని అదే చరిత్రిలోని నిషేధించబడ్డ చించివేయబడ్డ కాగితాల్లోంచి లెనిన్, శ్రీశ్రీ ప్రజా హృదయాల్లోకి ప్రవేశిస్తారు. ఏ భావం అయినా నిలిచేది అక్కడ, కదిలేది అక్కడ, కదిలించేది అక్కడ. నిజమైన చరిత్రి ప్రజా హృదయాల్లో-రచించబడి చెరిగిపోకుండా ఉంటుంది.

—సంపాదకుడు.

# ఎన్జీవో శూలం

— ముక్కంటి

ఆర్థికం
అన్నింటికి మూలం
అందుకేగా
ఉద్యోగుల సమ్మె
డబ్బులేని మాట
యథార్థమా? అయితే
ఎప్పటికి వస్తుంది డబ్బు?
ఎట్లా వస్తుంది?

ఆలుబిడ్డలకు
కూడుగుడ్డ లివ్వలేని మొనగాడు
నాటుసారా కైపులో
దుడ్డుకర్ర విసిరాడట!
అదరింపు-బెదరింపులు
ఆకలిని తీర్చలేవుగా
సుదీర్ఘ ప్రకటనలు
మంత్రుల మహోపన్యాసాలు
మా ఉపవాసాలను తీర్చవుగా!
అధిక ధరల్ని
అదుపులో పెట్టలేని
అధమాధమ పాలన
బూటక కబుర్ల లాలన
ఊరడించలేవు ఉద్యోగుల్ని.
ఆవుదూడ ఆర్జించిన
ఆదరాభిమానాల బిర్రుతో
బుర్రకు మత్తెక్కితే
బాధల మరుపుకు
బ్రాందీ పరిష్కారమార్గం కాదు.
ఔనన్న మాదన్న
డబ్బులేదన్న బ్రహ్మన్న
మాటలు నమ్మే నాగన్న వెర్రి
వెంగళప్ప మాపైన
బుర్ర కెక్కించుకొని
బురాక్రసీ
డెమాక్రసీ
సోషలిజం
బండారం-బట్టబయలయింది.

కాలం తీర్పుయిస్తుంది
ఆముదపు దీపం వెలుగులో
తోలుబొమ్మ బాగానేవుంది,
అభివృద్ధి పథకాల అమలుకు
అసలే డబ్బులేదనే సాకు
అత్యవసర సర్వీసు

ఆర్డినెన్సు చాకు.
మల్లెపూవు
జామపండు
కుళ్లిన శవం
దాచిపెట్టటం
యెవడబ్బతరం.

పరువుగలవాడెవ్వడూ
తన ఉద్యోగుల సమ్మెకు
అవకాశం యివ్వడు
చట్టాలతో
లాఠీ చుట్టాలతో
సమ్మె పరిష్కారం కాదు
తెలంగాణా అలజడిలో
గుడ్లు తేలవేసి
గోడల్తో తిన్న బూతులు
ఆకాశవాణి రోదనలోకూడా
యింకా ధ్వనిస్తూనేవున్నాయి.
నిన్ను అన్నాయి
అన్నదున్నాయి
సన్నాయి నొక్కుల
సానుభూతి
నీకు తెచ్చిపెట్టదు ఖ్యాతి.

పది పరసెంటు వుద్యోగులు
ఆఫ్‌రాల్ అన్న పెద్దన్నా!
పోలైన అరవై పరసెంటులో
యిరవై యెనిమిది శాతంతో
పెత్తనం వెలగబెట్టే నీకు
పదిశాతం ధనవంతుల
పక్షాన నిల్చిన నీకు
యాభైకోట్ల పన్నుల బకాయీలు
యెరగనట్లూరుకున్న నీకు
వాగ్దానభంగంలో
శుక్రనీతి వల్లించే నీకు
గారడీ లెక్కల్తో
కాలక్షేపంచేసే నీకు
లేని పరువు వున్నదనుకుని
లేనిదేదో పోతుందని
లేనిపోని బెడద తెచ్చిన నీకు
భాగ్యేందిర కటాక్షిస్తే
బాగుండుననుకునే నీకు
ఢిల్లీ తెన్నులు చూచే నీకు
తల్లడిల్లే మా స్థితి తెలిసేదెప్పుడు;
బధిరులకి వినబడని చప్పుడు.

నీ యంత్రంలోని నట్టు
నీ తంత్రంలోని గుట్టు
సర్వగ్రాహ్య వేత్తవైనా
వెతలపాల్జేయు వెర్రి ఆపు
మా సహనానికీ హద్దుంది
మానవమాత్రులం మేము
నిత్యజీవిత కటకటలకంటే
కటకటాలు మేలని తెగించే

తెంపుకలిగించిన నీకు కృతజ్ఞులం
నీ సోషలిజం భ్రమాంబరాయ
తొలగించిన నీకు కృతజ్ఞులం
అప్పుడప్పుడైనా బయటపడే
అసలురంగుచూపించేనీకు కృతజ్ఞులం
అజ్ఞులం అనుకునేవు
కృతజ్ఞులుగా మార్చేవు?

నాలుగున్నర లక్షల ఉద్యోగుల
వారి భార్యాబిడ్డల
అన్నాతురత - ఆక్రందన
ఆలకించే చెవులుగాని
మానవ సహజ కరుణగాని
కరువైతే
యిదే నీకు పరువైతే
ఆర్డినెన్సు వెరవైతే
కాలం తీర్పుకు కాచుకో
ఓవర్‌డ్రాఫ్ట్ భారమయ్యిందా!
అసలు నీదిలోటుబడ్జెటు కానిదెప్పుడు?
ఉద్యోగుల్ని నీవాళ్ళుగా
చూచిందెప్పుడు?

నీ బందుగు లరుగో మిల్లర్లు
నీ మిత్రు లరుగో నల్లవ్యాపారులు
నీతిబాహ్యులు
యింతకంటే చెప్పటం
అనవసరమని ఆపేస్తున్నా!!

('ఉపాధ్యాయ' సౌజన్యంతో)

## నా జాతిరాత!

కె. శివారెడ్డి

నన్ను సోదా చేస్తావా
దోచాలని చూస్తావా...?
నా దగ్గర
నీకేమి దొరుకుతుంది
ఒక గాయం దొరుకుతుంది
ఒక గేయం దొరుకుతుంది
మరీమరీ మాట్లాడితె
ఒక గుప్పెడు నవ్వులు
ఒక దోసెడు కన్నీళ్ళు
తప్పకుండా దొరుకుతాయి,
కత్తులు, కటార్లు
పిస్తోళ్ల మెషిన్‌గన్లు లేవు
బాధ ఆవేదన, ఆవేశం
ఆక్రోశం క్రోధం— పగ

కాలమారిన జీవితాల సమగ్ర
సంపూర్ణ చరిత్రలున్నాయ్—
మాటల ఈటెలు
భావాల బాంబులున్నై
ఇవి ఎక్కడ పేలతాయో తెలుసా....?
చెమటతో
సిరిచెట్టు పెంచబడే చోట
రక్తంతో
రాహువుల పొట్టనింపే చోట
పిచ్చోడా!
నా దగ్గర
నల్లధనం లేదురా
శ్రమను శమంతకమణులుగా
నిల్వచేసిన ఖోషాణాలు లేవురా
ఎన్నో కుటుంబాల కష్టార్జితం
పిండివంటలుగా మార్చుకుంటున్న
నాణ్యమైన నవ్వుల తాళాల గుత్తులు
లేవురా
ఈనీ కంటికి కనపడని
అధోవర్గాల కూడలి— ప్రపంచం—
నుంచి నే నేర్చుకున్న—
ఈనీ తుపాకితో కెలికిన
చెల్లాచెదురుగా పడ్డ
మౌనంగా జ్వలిస్తున్న
ఈ పుస్తకాలనుండి
నే సముపార్జించిన అర్థం
ఇంకిపోవని ఈ మెదడు బావిలో
ఉంది. నీకెలా అందుతుంది
ఆనందాన్ని ఆర్జించే
కల్మష హస్తాల ఉంగరాలు
వేళ్ళకెలా అందుతుంది
అనంత ఆవేదనాక్షుభిత
సాగర మథనామృతం;
కోటి వేలవేల దీనులు
కష్టాల బడబానలంలో జనించిన
జ్వాలాచైతన్య సంపుటాలు
ఎత్తిన ముద్దను నోటిదాకా
చేరనివ్వని ఈ చట్టాల చౌరస్తాలో
నా జేబుల్లో డైనమైట్లులేవు;
ఇదుగో— ఈ పేవ్‌మెంట్ మీద
కలిమికాల్చి విసిరేసిన
ఖాళీ సిగరెట్ పెట్టె దొప్పలమీద
రాసుకున్న రక్తాక్షరాలు
అంగారతల్ప సంజనితమైన
ఆపురాపురుమనే
హర్యక్ష సమూహాలు ఈ గీతాలు—
అడుగంటిన నా జాతి రాతలు.

('ప్రజాతంత్ర' సౌజన్యంతో)

రెండు కన్నడ కవితలు :

## "మనవాళ్లు"

కన్నడమూలం: జి. యస్. శివరుద్రప్ప
తెలుగు: వెం. శ్రీనివాస

దూరంగా నిలిచి, దొంగనవ్వు నవ్వి
మండే సిగరెట్ల వెనక మాయమైపోతారు.
ఎవరెవరి జేబుకో కత్తెరవేసి
తమ లెక్కకి జమాచేసి
చడీ చప్పుడూలేకుండా సందుగొందుల్లో తిరుగుతారు.
పదిమందీ చేరిన చౌక్ మధ్య
తమ దళారీలముందు బడాయి కొడతారు.
పసివాళ్ళ చేతుల్లోని బూరాలు ఊదించి
చప్పట్లు తడతారు.
డాబామీద గుట్టుగా గుమిగూడి
అంతర్జాతీయ సమాచారాలను
కంచంలో పెట్టుకొని తింటూ
అప్పుడప్పుడు వేదోపనిషత్తుల ఒక్కొక్క పంక్తిని
నంజుకుంటారు.
వాడినీ వీడినీ నిందించి, బీడాచేసి నమిలి
ఉమ్మివేస్తారు
తమ స్విచ్చినుండి అన్నిబల్బులూ వెలుగుతాయని
చిమ్మచీకట్లో తడుముకుంటూ
నట్టనడిరాత్రి మెట్లెక్కి
ఇంటి వాకిలితట్టి
నిద్ర చెడుపుతారు...

[ఈ కవిత 'నమ్మవరు' అనే పేరుతో 'సుధా' కన్నడ వారపత్రికలో ప్రచురితమయింది.]

# గాంధీ శతవార్షికోత్సవం

కన్నడమూలం: జి. యస్. శివరుద్రప్ప
తెలుగు : డాక్టర్ తంగిరాల

ముసురుకొన్న చీకట్లో ఒక్కడే ముసలివాడు
చేతికర్రి ఊతగా నడిచాడు :
దారిపొడుగునా పాడుపడివున్న పూలతోట,
ఇంకా రగులుకుంటూన్న నిప్పు,
కాళ్ళక్రింద నెత్తుటి బురద,
కోట ఇరుకులలో ఎవరిదో నిట్టూర్పు,
చెదలు వ్యాపిస్తున్న స్తంభాల పాడుమహలు,
కొత్తగా మరమ్మత్తుచేసిన రస్తాలమీద
కుక్కల కొట్లాట,
ఈ అన్నిటి నడుమా, వినబడుతోంది
ముసురుకొన్న చీకట్లో ఒక్కడే ముసలివాడు
చేతికర్రి ఊతగా నడుస్తున్న చప్పుడు.

* * * * *

మనమూ ఉన్నాం—
మూలలో మిణుకు మిణుకు కొవ్వొత్తి చీకటిచుట్టూ
పేకముక్క తిప్పివేస్తూ,
వారివీరి పాచికట్టిన మాటలమీద కాలూని నడుస్తూ,
గద్దెమీద విరాజిల్లుతున్న గద్దకళ్ళ మృగరాజు ఎదుట
పంచతంత్రి ప్రతిభతో తోక ఆడిస్తూ,
గుంపులో గోవింద అవుతూ,
మండుతున్నచోటల్లాదూరి, చేతికి చిక్కినంతా స్వాహాచేస్తూ,
వీధిధూళుల, సందుల, పెంటల,
అరపుల, రంగుల, కన్నుల నట్టనడిమధ్య.
హఠాత్తుగా ఇంతలో ఎవరో

కట్టె తట్టుతున్న చప్పుడు వినబడుతుంది.
ఎవరో సన్నగా కన్ను తెరచి మనలోపలి దాన్నంతా
టార్చివేసి దిగ్గన బయటపెట్టినట్లు
భయంవేస్తుంది.
'ఎక్కడ లెక్కలబుక్కు?' అని తనిఖీచేస్తున్నట్లు
తోస్తుంది.
మనం, వెల్లకిలబడ్డ బొద్దింకలు గిలగిలతన్నుకొని, ఎలాగోలేచి
విడిచిన బట్టలకోసం తడుముకుంటూ
చేతికి చిక్కిన గుడ్డపీలికల్తోనే ఒళ్ళుకప్పుకొని
మూలకి జరిగి, ముడుచుకొని నిలుస్తాం.
అసలు, ఈ పీడిస్తున్న నీడ తొలగితే చాలయ్యా,
అని కోరుకుంటాం.
దీన్నుండి తప్పించుకొని, ఊపిరాడాలని ఆయన్ని
పాడి పొగడుతాం.
మెల్లగా, సద్దుకరిగిన తరువాత వణుకుతూ
మనమూ జపిస్తాం రామనామాన్ని!

* * * * *

వచ్చిన టక్‌టక్‌శబ్దం వచ్చినట్లే కరిగిపోతుంది.
ఆయన పేరుమీద నిర్మించిన ప్రతిమల, ఫలకముల,
వీధుల, భవనముల నడుమ నిట్టూర్పు దాటిపోతుంది.
ముందెక్కడో, చీకటిక్రమ్మిన ఏ భూగోళాల మీదో
ఈ నీడవెలుగు పడుతుంది.
నట్టనడిరాత్రి నిప్పు కంటినివిప్పి ధడ ధడ దూసుకుపోయే రైలు
ఘోరుఘోరుమంటూ మొరపెడుతూ చివరికి చీకట్లో కరిగిపోయినట్లు
చప్పుడు నిలుస్తుంది.
ఇది తొలగిపోయింది కదా అనే నిబ్బరంతో,
మళ్ళీ కొవ్వొత్తివెలిగి, నిలిపిన ఆట ముందుకు సాగుతుంది...

[ఈ కవిత 'గాంధీ శతమానోత్సవ' అనే పేరుతో మైసూరునుండి వెలువడే "ప్రబుద్ధ కర్నాటక" అనే పత్రికలో ప్రచురితమయింది. 'ప్రబుద్ధ కర్నాటక' కన్నడిగుల ప్రసిద్ధ సాహిత్య త్రైమాసిక ]

## సజీవ సమాధి

— డాక్టర్ తంగిరాల

బానిసత్వపు చిమ్మ చీకట్లో
బ్రతుకు కొవ్వొత్తిని భగ్గున మండించావు నువ్వు—
ప్రవాసాన్ని శాశ్వతంగా ప్రసాదించాం మేం!

సత్యాగ్రహాల చలిగాలిలో తుప్పుపట్టిన
భరతజాతి శౌర్య కరవాలాన్ని
నీ గుండెల సానమీద ధైర్యం నూనె పోసి నూరి
తళతళల మెరిపించావు నువ్వు—
తుఫానులు వీచే మంచు ఎడారుల్లో
ఘోర చెరసాలలు చూపించాం మేం!

'జై హింద్! ఢిల్లీ చలో!'
దిక్కులు పిక్కటిల్లేలా సింహగర్జన చేశావు నువ్వు—
తడిగుడ్డలతో నీ గొంతుకోసి
నీ రొదను అరణ్యరోదన చేసి
కమిటీల రాకెట్లతో నీ విమానాన్ని కూల్చి
బ్రతికుండగానే నిన్ను నిలువునా కాల్చి
భస్మం చేసివేశాం మేం!!

స్వరాజ్య రోచిస్స్రవంతిలో స్నానంచేస్తున్న మమ్మల్నిచూసి
సంతోషంతో మళ్ళీమాలోకి వద్దామనుకున్నావు నువ్వు—
తఖ్తు మీదికెక్కి కూర్చున్న దేశభక్తి టోపీబుట్టలూ
వేదాంతం టర్బన్ తట్టలూ
నిన్ను సాదరంగా ఆహ్వానిస్తాయని ఆశపడ్డావు పాపం—
నక్కల్నీ తోడేళ్ళనీ నమ్మి దారుణంగా దగాపడ్డావు నువ్వు—
ఏమీ ఎరగని నంగనాచిలావున్న ఎర్రగులాబీ క్రింద
ఎన్ని స్వార్థపు రక్కసిముళ్ళున్నాయో ఇప్పుడు తెలిసికొని
గుండెలు బాదుకుంటున్నాం మేం!

నీ సజీవ సమాధిమీద
ప్రజాస్వామ్యం తులసిమొక్క నాటుకున్నాం మేం...
అది, స్పర్థల గ్రీష్మంలో వాడి
ఎన్నికల ఎండల్లో మాడి
కుమ్ములాటల దుమ్ములో
వెర్రితలలు వేస్తోంది......

ఎర్రకోట మీద సిగ్గువిడిచి
ఎగురుతున్న జెండాచుట్టూ
ముసలిగద్ద గానుగెద్దులా తిరుగుతూ
మధ్యమధ్య—
'మోసం! మోసం!' అని అరుస్తోంది......!!

## ఆవాహన

ఎస్. నారాయణ చౌదరి

చుట్టూ మెరుస్తోంది!
ఈక్షణమో మరుక్షణమో
ఆకాశం నడి బొడ్డున కారుమబ్బులు
కమ్ముకొంటాయ్!
గాలి వీపటమే ఆలస్యం
ప్రచండవర్షం ప్రపంచాన్ని ముంచెత్తుతుంది.
నువ్వెంత జాగ్రత్తపడ్డా
అనౌన్స్‌మెంట్ లేకుండానే కుంభవృష్టి
కురుస్తుంది!
నువ్వు చేయాల్సిందల్లా
దానికి స్వాగతం యివ్వటమూ
ఆ జలధారల్లో మనసారా స్నానంచేసి
తరించటమూ
అంతే...!

# హ్హ! హ్హ! హ్హ! హ్హ!

అద్దేపల్లి రామమోహనరావు

ప్రతి వీధిలో ప్రతి కిల్లీకొట్లో
పబ్లిగ్గా క్లిప్పులకి వేలాడుతున్న మర్మాంగ పుస్తకాలమీద
నిషేధం లేదు!
పెన్నుతో రాస్తారో రహస్యాంగాల్తో రాస్తారో తెలియదుగాని
పచ్చిబూతులు రాసే మహాకవులమీదగాని
వాటితో అనాగరిక కిరాతక వ్యాపారంచేసే దుష్టులమీదగాని
నిషేధం లేదు!
నిరుపేదల నెత్తురు తాగడానికి నోటివైశాల్యం చాలక
మాంత్రికుల్నీ తాంత్రికుల్నీ ఆశ్రియించి
నోరు పెంచుకుంటున్న ధనమదాంధుల మీద
నిషేధం లేదు!
మధ్యతరగతి దరిద్రుల జీవితాలు కోలుకోకుండా
చావుదెబ్బ కొడుతున్న
వందకి పదిహేను రూపాయల నెత్తురు వడ్డీలమీద
నిషేధం లేదు!
ఏడబ్బు సక్రమంగా ప్రభుత్వానికి చేరితే
ప్రజలంతా విప్లవాల్లేకుండా సుఖంగా బతుకుతారో
అటువంటి కోటానుకోట్ల ఇన్‌కంటాక్సు
ఇనప్పెట్టెల్లో కూడబెట్టే భయంకర స్వార్థంమీద
నిషేధం లేదు!
రోడ్డుమీద దిక్కులేని వాణ్ణి చంపడానికి
ప్రభుత్వాన్ని గుప్పిట్లో పెట్టుకున్న
దుర్మార్గు డెత్తిన కత్తిమీద
నిషేధం లేదు!

పేదల తరఫున నిలబడ్డవాడి గుండెమీదికి
గురి పెట్టబడిన తుపాకిమీద
నిషేధం లేదు!

మరి దేనిమీదనుకున్నారు నిషేధం?
ఈ పుచ్చిపోయిన అవకతవక అసమాన ఘోర సమాజాన్ని చూసి
కడుపు మండిన కవి
అక్షరాల్లో దాచుకున్న గుండె పగుళ్ళమీద!
నిప్పులాగా మండిపోతున్న నిజంమీద—
ప్రజల వాణిని పలికించే కలంమీద—
ప్రజల బాధలు వినిపించే మనిషిమీద—

బహుశా నేననుకుంటాను
ఈ వ్యవస్థలో
పేదవాళ్ళందరి జీవితాలూ నిషేధింపబడి
జైల్లో కుక్కబడి, నెత్తురు కక్కబడ్డా
ఏమాత్రం ఆశ్చర్యపడ నక్కర్లేదు—

## తిరుగుబాటు గాలి

పవన్ కుమార్

ఉడికి ఉడికి భూమంతా
నిప్పులాంటి ఎండకు కాలి— బద్దలై
బీటలువారిన
దరిద్రుడి నుదుటిలా
సమయం చూసి
ఇవాళ ఆకాశం ఎర్రబడ్డది.

సహనం చచ్చిన పీడితుని
తెగింపులా
గిరిజనుడి కసినుండి
దూసుకొచ్చిన బాణంలా
మూకుమ్మడి ముట్టడికి సమాయత్తమై
వేగంగా వీస్తున్నది గాలి.

ఇరవై ఏళ్ళనుండి మరో మొక్కకు
తావులేకుండా తనకు పుట్టిన
పిల్ల వూడలకు భూమ్మీద
బలాన్ని అందించి
రాజులా పోజుతో వూగే వటవృక్షం
ఆకు ఆకులో బందీ అయి
ఈ వృక్షం వుంది కాబట్టే
తనకు జీవం వుందని
బానిసై బతికిన గాలిలో
ఇవాళ తిరుగుబాటు తత్వం చెలరేగింది.

సముద్రం గుండెను పగులగొట్టి
లోపల దాచుకున్న రత్నాలను
భూమ్మీదకు లాగడానికి
సుడి తిరుగుతూ వడిగా లేస్తున్నది

ఇక దొరవారి దేవిడీ తలుపులు
బద్దలు కాకపోవు
భూమ్మీద కంపుకొడుతూ
కుళ్ళిన చెత్తంతా
వూడ్చుక పోకపోదు.

## విప్లవ కవికి ద్రోహి బిరుదు!

—అగ్నిమిత్ర

కాలే కడుపుల్ని కరుణతో స్పృశించి—
కలవారి ఉక్కుపాదాల కింద నలుగుతూ
భూమిని కరుస్తోన్న అమాయిక అనాధల వీపుతట్టి
పతనానికి ప్రతినిధుల్ని
దుర్దశకు కారకుల్ని చేయెత్తి చూపుతూ—
అధికార అహంకార మదోన్మత్తుల్ని మారణహోమం చేసి
జనరాజ్యం నిలుపుకోవాలని కర్తవ్యబోధ కావిస్తూ
నిరాశాభరిత మోడు బ్రతుకుల్లో
ఆశాకిసలయాల్ని మొలిపించి
అంధకార బందీలకు మహోదయం సృష్టించే
విప్లవ కవికి
ద్రోహి బిరుదుతోపాటు
కరాలకు యినుప కంకణాలు!—

## ఆక్సిజన్

—'మంత్రవాది'

ఆక్సిజన్‌ను దోచుకుంటున్నారు
ప్రాణాల్లారా పరుగులు తీయకండి
వెలుగును చెరపట్టారు
వత్తుల్లారా ఒత్తిగిలకండి.
పంచలో నుండి
వంచనకు-లోబడక
నిండు గుండెతో ఎదిరిద్దాం.

# నెత్తురుడికింది

బి. తారకం

వియత్నాం కాదు
వీరబెంగాల్ కాదు
ఇక్కడే మనమధ్య
వస్తోంది విప్లవం!
మగువ మాంచాలిలా
రుద్రమదేవిలా
మగువలంతా కలిసి
మనకు తెస్తున్నారు

విన్నావ ఈమాట?
మగవాడ విన్నావ?
కొత్త గూడెం వద్ద
నెత్తురుడికిందంట!
అవును మరి ఎన్నాళ్లు
ఎన్నాళ్ళు ఈ ఘోర
నరక యాతనలతో
బతుకుగడి పేదంట?

తాను శ్రమజేస్తాది
మామ శ్రమజేస్తాడు
భర్త శ్రమజేస్తాడు
మరిది శ్రమజేస్తాడు
నడకనేర్చినచాలు

పిల్లపాపా అనక
ఇంటిల్లి పాదిగా
అంత శ్రమజేస్తారు!

అయినగానీ తినగ
తిండికే కరువాయె
తిండి ఒకటేకాదు
ఉండ నీడాలేదు
కష్టమంతా ఎవరో
దోచుకొనిపోతారు
ముష్టిగింజలు నేల
నిష్ఠురముతొ రాల్చి

అవునుమరి శ్రమనంత
దొంగిలిస్తున్నారు
అవునుమరి ఓపికను
దోపిడీ చేసారు!

కళ్ల ఎదుటనె వారి
శ్రమ కొల్లగొట్టుకొని
బస్తాలకెక్కించి
పట్టుకెళుతుంటేను
బిక్కుమంటూ పేద

రైతు చూస్తుండాలి
లారీల బస్తాలు
తరలి పోతుంటాయి.

ఉన్న రక్తమునంత
భూస్వామె తాగాడు
పిల్లకివ్వగ పాలు
ఎటు మిగులుతాయి?
దాస్యవృత్తి లోపడెను
చేవ చచ్చినమగడు
ఎన్నాళ్లు భయపడుట
సహనమింకెన్నాళ్లు?

బతకడానికివేరు
దారేమి కనరాక
అకృమాన్నరికట్ట
ఆయుధం పట్టారు
అంధకారముమధ్య
అన్యాయమునాపి
నిలిపి దిగమన్నారు
నడువనీ మన్నారు!

విచ్చుకున్నది రాత్రి
మెచ్చుకున్నది ధాత్రి
ఉచ్చులను తెంచుకొని
వచ్చుచున్నదిక్రాంతి!
విన్నావ తెలుగోడ!
విన్నావ మగవాడ!
కొత్త గూడెంవద్ద
నెత్తురుడికిందంట!

★

సత్యాన్ని చాటే
పుస్తకాల్ని నిషేధించగలరు కాని
సాక్ష్యంగా బతికే
ప్రపంచాన్ని ఏం చేస్తారు?

—ఎస్. కె.

# గానుగెద్దు జీవితాలు

—దిక్సూచి

అంబటేల కన్నముందు
అంత పొద్దు వుండంగ
అరక రొప్ప నువ్ పోతే
రాటు తిప్ప నే పోతే

—ఒక్క పొద్దు తప్పదాయె
—ఒక్క దినం గడువదాయె

నడుమంత నొయ్యంగ- నే
దినమంత కొయ్యబోతే
పెయ్యంత కందిపోవ
నడిపొద్దు ఎండలోన నాటేయ నువ్ పోతే—
కాళ్ళన్ని నొయ్యంగ కోసున్నర నేనడిచి
పెదకాపు చేలోన కలుపు తీయగాపోతే—
మోట బాయి పనిలోకి మట్టిమోయ నువ్‌పోతే

—కడుపాకలి తీరదాయె
—లాభమేమొ ఆడిదాయె

కంప గొట్టి గట్టు వేసి
బంచరాయి పొతం చేయ
భూస్వామి స్వంతమాయె

రేయి లేదు — పగల్లేదు
రెక్కలన్ని ముక్కలాయె

గటకకాసి తాగబోతే ఉప్పురాయి కరువాయె
రొట్టెముక్క నమలబోతే పచ్చికారం లేకపోయె
నూకలన్నీ నిండిపోయి గంజికూడ కరువాయె

గోచిబెట్ట చేతగాని
'గురు'గింజ పిల్లగాణ్ణి
దొరతాన నౌకరుంచి

గోదలు కాయ నే తోల
గొడ్డు లెక్క ఆణ్ణి కొట్టి

—చూడ సక్కేం కాదాయె
—కడుపు తీపి పోదాయె

ఎరిక తెలిసిన్నాటి నుంచి
తెరిపి లేక మేమంతా
పెయ్యి దాయకుండంగ
వంటి సుఖం చూడకుండ
కట్టమెంతో మేం చేస్తే

—లగ్గం బాకీ తేరదాయె
—రోగం బాకీ తరగదాయె

మిత్తేమొ మెండాయె
దినం దినం ఒత్తాయె

—అర్దబీగ అరువు కింద
—షాహుకారు స్వంతమాయె

రెక్క కష్టం ముక్కలాయె
కాయ కష్టం గంగ కలిసి

గానుగెద్దు బతుకేమొ
గాడి తప్పక మిగిలి పోయె.

# తప్పదు

ఎస్. కె.

ఒరి తీయబడ్డ తలలు
గుండ్లు దూసుకపోయిన గుండెలు
చిమ్మిన నెత్తుర్లు
చరిత్ర పుటల్లో
ఎప్పుడూ ఒకే సత్యాన్ని చాటినయ్

బానిస బంధాలను తెంచడానికి
స్వేచ్ఛా ప్రియుడు అందుకున్న ఆయుధం మీద
మన భవిష్యత్తు పదునుగా మెరుస్తున్నది

ఇరువర్గాల గాయాలనుండి
కారేది రక్తమే అయినా
ఒకటి విముక్తిగురించి
యింకోటి స్వార్థంకోసం

రక్తపాతం కూడదన్న కుహనా వేదాంతం
దోపిడీ హింసను కాపాడే అహింసా మంత్రం.
మనం అహింసా ధర్మాన్ని స్థాపించడానికి
ప్రతిహింస శస్త్రాన్ని సారించక తప్పదు

సత్య సమాజం కోసం అధర్మాన్ని
హత్య చేయక తప్పదు.

## అణగారిన ప్రతిచోటా....

లో చ న్

అప్పుడే పుడుతున్న
సూర్యుని కళ్ళు పొడిచేందుకు
ఆ నయనాల భవిష్యత్ స్వప్నాలచెరుపేందుకు
కొన్ని కాకులు గద్దలూ
బయిల్దేరి పోయినయ్–

ఆ అగ్నిశిశువు ప్రతి గాయంలోంచీ వెలువడే
రక్త కిరణాలు
భూగోళం చుట్టూ
గాలిలో ధూళిలో
కడలిలో కారడవిలో
అణగారిన ప్రాణాలున్న ప్రతిచోటా
వేకువ గీతాలు పాడుతున్నాయ్

# ఊఁ కానీ –

కలం వీరయ్య

కళ్ళముందు
మిల్ట్రీ టాంకుల నియంతృత్వం కిందపడి
నలిగిపోతున్న స్వాతంత్ర్యా కాంక్షకు
లిప్ సింపతీ చూపి, తీర్మానాలు రాసి
ఎర్రి గులాబీ మంచు దులిపినట్లు
కన్నీళ్ళు దులుపు

నీవలెనే కానిపోని సోషలిస్టు సూక్తులు వల్లించి
నీకన్నా ఎక్కువ లెఫ్ట్ పోజుపెట్టి
నిరుద్యోగం తప్ప యువకులకు
భవిష్యత్తు సైన్‌బోర్డు చూపలేని
భండారాన్ని బద్దలు కొట్టడానికి
గువేరాను సాహసంగా పిలుచుకున్న
గుండెల మీదికి మాత్రిం
ఆయుధాలు అతి త్వరగా పంపించు

బొలీవియాలో పొదలమాటున
చచ్చిందని ప్రకటించిన యువ విప్లవ సింహం
సింహాళంలో జూలు దులిపింది
జాగ్రిత్త
ఈ దేశంలోని విద్యాలయారణ్యాలలో కూడా
అది గర్జించే సమయం వచ్చింది.

# సాహిత్యం-విప్లవం

ఎవ్‌గెనీ జమ్యాటిన్

చివరి అంకె ఏదో చెప్పండి, అన్నిట్లోకి పెద్దది?

హాస్యాస్పదం; అంకెలు అనంతం కదా!

చివరి అంకెను ఎలా చెబుతారు?

అలాగే విప్లవం సంగతికూడా, చివరి విప్లవం అనేది ఎలా వుంటుంది.

అంతిమ విప్లవం అంటూ ఏమీలేదు.

విప్లవాలు అనంతం.

—ఎవ్‌గెనీ జమ్యాటిన్,

సూటిగా అడుగుతాను– విప్లవం అంటే ఏమిటి? రకరకాలు సమాధానాలొస్తయ్. తారీకులతో కొందరు పేరులతో కొందరు ఏవేవో చెబుతారు. కాని యీ పైపై వాటిని అధిగమించి లోతుకెళ్ళిచూస్తే మనకొచ్చే సమాధానం యిదీ—

"మృతప్రాయమైన చీకటి నక్షత్రాలు రెండు ఢీకొంటయ్ కనీవినీ యెరుగని చెవులు దిబ్బళ్లువేసే మహాధ్వని; ఒక కొత్తతార జీవితంలో జ్వలిస్తుంది. అదీ విప్లవం. ఒక అణువు దానిపరిధినుంచి వదలించుకొని పొరుగు పరమాణువిశ్వంపై దండయాత్ర చేస్తుంది. ఫలితంగా ఒకకొత్త రసాయనక మూలపదార్థం ఉద్భవిస్తుంది– అదీ విప్లవం.

ఒక్క పుస్తకంతో లొబాషెవ్‌స్కీ ఇన్‌ఫినిటీస్ అని తీసుకొచ్చి యూక్లిడ్ సిద్ధాంతాల గోడలను కూలగొట్టాడు– అదీ విప్లవం.

విప్లవం ప్రతిచోటా ప్రతి వస్తువులోనూ వుంది. అది ఆద్యంతరహితం. చివరి విప్లవం అంటూ వుండదు. అంకెల వరసకు అంతంలేదు అనంతమైన అంకెల వరసలో సాంఘిక విప్లవం ఒకటి మాత్రమే. విప్లవం అనే సూత్రం ఒక సాంఘిక సూత్రం మాత్రమేకాదు, అది యింకా చాలాగొప్పది అది విశ్వసూత్రం, సూర్యుడు కోటానుకోట్ల నక్షత్ర మండలాల సర్వసృష్టికి సంబంధించిన సూత్రం. శక్తినిలిచి వుండటం, నశించటం అనే సూత్రాల లాంటిది. ఒకనాటికి ఎప్పుడో విప్లవం అనే

సూత్రానికి ఖచ్చితమైన నిర్వచనం దొరుకుతుంది. ఆ నిర్వచనంలో జాతులు, వర్గాలు. నక్షత్రాలూ పుస్తకాలూ అన్నిటినీ సంఖ్యా విలువలతో చెప్పుకొంటారు కావచ్చు.

విప్లవం అనే సూత్రం— అరుణారుణం,
భయావహం, మారణ సమం.
కాని ఆ మరణం ఇంకో నవగ్రహం,
ఒక నవజీవనంల జననం
శక్తి ఉత్పాదన, ఉత్పతనాల సూత్రం—
అంతర్గ్రహ అదృశ్యాలలాగా మంచులాంటి శీతలం నీలం.

—భయావహమైన అరుణిమ నుండి జ్వాల, సమమైన వెచ్చని లేత ఎరుపుగా మారుతుంది.

మారణంగా కాక సౌఖ్యప్రదంగా అవుతుంది. సూర్యుడు వయసు మళ్ళి ఒక గ్రహం అవుతాడు. రోడ్లు, దుకాణాలు, పరుపులు, వ్యభిచారులు జైళ్ల వెలుస్తయ్— ఇదీ సూత్రం.

గ్రహాన్ని పునర్నవీకరించేందుకు మనం మంట మండించాలి, క్రమ పరిణామ మనే మెత్తని నున్నని బాటనుంచి పడనెట్టాలి. అదీ సూత్రం.

నిజమే— మంట రేపో, ఎల్లుండో చల్లారుతుంది (రోజులంటే సంవత్సరాలు, యుగాలు అనికూడా అర్థాలున్నయ్). కాని ఆ భవిష్యత్తును చూడగల్గేవారు ఉండి వుండాలి, రేపును గురించి తెలియజెప్పేవాళ్ళు వుండాలి. రేపును గురించి మాట్లాడే ఊహా ఉన్మాదులు (Hereties) యీ మానవ మేధాశక్తి నశింపుకు అవుసరం.

(సైన్సులో, మతంలో సాంఘిక జీవితంలో కళల్లో) జ్వలనంతో చలనంతో వున్న ఒకటి చల్లారినంక భయంకరమైన ఆ కరిగిన బండ, ఆ మరగిన కొండ ముడి ముడిగా గట్టిగా తయారవుతుంది. గట్టిగా, కదల్చలేనిదిగా; సైన్సులోనూ మతంలోనూ రాజకీయాల్లోకూడా భావశక్తి నాశకదశే పిడివాదం అవుతుంది. పిడివాదంగా తయారయినదాన్లో జ్వలనగుణం వుండదు. వెచ్చగా వుంటుంది మాత్రమే, త్వరలో చల్లారిపోతోంది. Sermon on the Mount (సెర్మన్ ఆన్ ది మౌంట్)— చాచిన హస్తాలకు విలపిస్తున్న గుండెలకూ మండుతున్న సూర్యుని క్రింద నిలబడి యిచ్చిన బోధ, మంచిగా నీటుగా నిర్మించిన చర్చలు హాయిగా ప్రార్థన చేసుకొనేందుకు ఉపయోగ

పడుతుంది. గెలీలియో సిద్ధాంతం ఒక పరిశోధనాగారంలో వెచ్చని గదుల్లో హాయిగా కూచుని గుణకారాలు చేసుకొనేందుకు ఉపయోగపడుతోంది. ఇదీ విప్లవం దారి. మళ్ళీ ఒకరోజున ఏదో ఒక ఉన్మాదపుకేక వెలువడి పిడివాదపు కరడును దాని ఘనాతిఘనమైన నిర్మాణాల్ని సుస్థిరమైన కట్టడాలనూ కూలగొట్టేవరకూ.

ప్రేలుళ్ళు సౌఖ్యదాయకమైనవికావు. అందుకే ప్రేల్చేవాళ్ళు 'ఉన్మాదులు' సహగానే గొడ్డళ్ళతో కూల్చే. మాటలవల్లనో నాశనం చేయబడుతున్నారు. ఊహాలోక విహారులయిన 'ఉన్మాదులు' అందరికీ హానేచేస్తారు. క్రమపరిణామానికి హానిచేస్తారు. తెలివితక్కువతో రేపట్నించి యివాళలోకి దూకుతారు. వారు స్వాప్నికులు. 1797 లో బాబిఫ్ తల నరికేశారు అడెంతో రైటు. (బాబిఫ్ 1760–97) ఫ్రాన్స్‌లో సమానత్వం, ఆచరణయుత సామ్యవాదంకోసం పనిచేశాడు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర పన్నాడని ఉరితీశారు). 1797 లో 150 ఏళ్ళముందు కురికాడు అతను. అటువంటి వారి సాహిత్యమూ. పిడివాదం. మూఢ సిద్ధాంతాలపై పోరాడే సాహిత్యమూ నాశనం చేయబడటం నిర్బంధాల పాలవటమూ న్యాయమే. మరి ఆ సాహిత్యం హానికరమైనది కదా!

కాని హానికరమైన సాహిత్యమే ఎక్కువ ఉపయోగం. శక్తినాశక సూత్రానికి వ్యతిరేకం అది. మెదడు కరడుగట్టటానికి, ఘనీభవించటానికి, పొరకప్పివుండటానికి, శాంతికి వ్యతిరేకం అది. ఆ సాహిత్యం ఊహాజనితంగా, వింతగావుంటుంది. 1797 లో బాబిఫ్‌లాగా 150 సంII ల తర్వాత అది రైటుగావుంటుంది.

మనం డార్విన్‌ని ఎరుగుదుం. డార్విన్ తర్వాత చాలామంది వచ్చి ఆయన సిద్ధాంతాన్ని మెరుగుపర్చారు. కాని యివన్నీ పైమెరుగులు అలంకరణలు మాత్రమే. డార్విన్ అసలు భవనం. ఆ భవనంలో అవీ యివీ ఎవో వుండటమే కాదు, మనిషే వున్నాడు. ఊహాలోక విహారులయిన ఉన్మాదులు అవసరం. వారు లేకపోతే కొత్తగా తయారయినా చేయాలి.

సృజనశీలమైన సాహిత్యం తనకాలాన్ని నిన్నటి అనే గడియారంతోనో నేడు అనే గడియారంతోనో కొలుచుకోదు. రేపు అనే గడియారంతో చూచుకుంటుంది.

మృత్యుముఖంలో మనుషులు ఎలా ఆలోచిస్తారో అలా ఆలోచించాలి– మనం చచ్చిపోతాం. మరి అపుడేమిటి? మనం ఎలా జీవించాం. కొత్తతరహా యింకోసారి

జీవించాల్సివుంటే ఎలా జీవిస్తాం దేనిపల్ల? ఎందుకొరకు? భూమ్యాకాశాల వైశాల్యం గల తాత్త్విక ఆలోచన మన సాహిత్యంలో వుండాలి. పూర్తిగా అంతిమమైన, ఎంతో భయావహమైన ఎంతో ధైర్యవంతమైన "ఎందుకు?", "తర్వాత ఏమిటి" అనే ప్రశ్నలు కావాలి మనకు—

ఈప్రశ్నలు పిల్లలు అడిగేవి. కాని తత్త్వవేత్తలలోకెల్లా ధైర్యవంతులు పిల్లలు. దిగంబరంగా జీవితంలో కొస్తారు. మతం, వాదం అనే ఏదో ఒక చిన్నతొడుగును కప్పుకునిరారు. అందుకే వారి ప్రశ్నల్లో అంత హాస్యస్ఫోరకమైన కొత్తదనం, భయంకరమైన సంక్షిప్తతవుంటుంది. ఇపుడు ముందుకొస్తున్న కొత్తమనుషులు పిల్లల లాగానే దిగంబరులూ, భయరహితులు వాళ్ళు పిల్లల్లాగా, షోపెన్‌హోవర్ డొస్టొవస్కీ, నీట్జేలాగానే "ఎందుకు" "తర్వాత ఏమిటి?" అని ప్రశ్నిస్తున్నారు.

మహామేధావులయిన తత్త్వవేత్తలు, పిల్లలు, సాధారణ ప్రజలు ఒకరకంగానే తెలివిగలవారు. ఎందుకంటే చాలా అజ్ఞానమైన ప్రశ్నలడుగుతారు. నాగరికమైన మనిషికి అంటే ఒక మంచి బిల్డింగూ, తోట, చక్కని స్నానాలగదీ, తను గట్టిగా నమ్ముకొనే సిద్ధాంతమూగల నాగరికమైన మనిషికి యీ ప్రశ్నలు అజ్ఞానమైనవిగానే కన్పిస్తయ్.

సజీవ, నిర్జీవ పదార్థాల విభజనరేఖ చెరిగిపోతోంది యివాళ రసాయనశాస్త్రాభివృద్ధితో. సజీవ, నిర్జీవులుగా మనుషుల్ని విడదీయటం పొరబాటు. జీవన్మృతులూ, సజీవ జీవులూవున్నారు యిపుడు. జీవన్మృతులుకూడా రచనలు చేస్తారు, నడుస్తారు, మాట్లాడుతారు. కాని వాళ్లు పొరపాట్లుచేయరు. మెషీన్లు మాత్రమే తప్పులులేకండా ఉత్పత్తిచేస్తాయి కాని అవి మృతవస్తువుల్నే తయారుచేస్తయ్, సజీవజీవులు చేసేవన్నీ తప్పులూ, అన్వేషణలూ, ప్రశ్నలూ, బాధలూ.

అలాగే మనం రాసేవీ నడుస్తయ్, మాట్లాడుకయ్. కాని అవీ జీవన్మృతమో, సజీవజీవమో అవుతుంది. సత్యమైన సజీవమైన రచనలు, దేనిపల్లనూ ఆగక ఏ అవరోధాల గోడలకూ జంకక 'తెలివితక్కువ' చిన్నపిల్లల ప్రశ్నలలాంటి ప్రశ్నలకు సమాధానాలు వెదకుతారు. సమాధానాలు తప్పురావచ్చు, తత్త్వచింతన పొరబాటవొచ్చు-కాని పొరబాట్లు సత్యంకంటే గొప్ప విలువగలవి; సత్యం యాంత్రికమైనది; పొరబాటు సజీవమైనది; సత్యం సంరక్షకమైనది; పొరబాటు కదిల్చివేస్తుంది. మరి సమా

ధానాలు అసంభవమే అయినా యింకామంచిదే. సమాధానాలు దొరికినప్రశ్నలే అడగటం అవుకడుపులాంటి బుర్రగల కొందరి అదృష్టం అది. అవుతిన్నదే నెమరేస్తుందికదా.

ప్రకృతిలో ఏదో నిర్ణీతమైనది వుంటే, సత్యాలనేవి వుంటే— యిదంతా యిపుడు మన మనుకొన్నదంతా తప్పే. కాని సంతోషకర విషయం ఏమంటే అన్ని సత్యాలూ పొరబాటువే. ఇదే గతితర్క విధానపు విశిష్టత. ఇవ్వాళ్టిసత్యం రేపటికి తప్పు అవుతుంది. చివరి అంకె అంటూ వుండదు.

ఈ ఏకైక సత్యం బలవంతుల కొరకే. దుర్బల మనస్కులకు ఆద్యంతాలుగల విశ్వంకావాలి. వాళ్ళకు ఒకచివరి అంకె అవసరం నీట్షె చెప్పినట్లు వాళ్ళకు అభయ హస్తం కావాలి. దుర్బల మనస్కులు తమ్ముతాము గతితర్కవాదంలో చేర్చుకొనరు. ఇది నష్టమే. కాని యిదే ఐన్‌స్టీన్ చేసింది.

చేతిలో గడియారం పట్టుకొని, కదలికను (motion) పరిశీలిస్తూ, తనూకదల్తునే వున్నానుకదా అని జ్ఞప్తివుంచుకోగలిగాడు. భూమి కదలికలను బయటనుంచీ చూడగల్గటంలో కృతకృత్యుడయాడు.

ఇలాగు గొప్ప సాహిత్యం, చివరి అంకెనుగురించి ఎరగని సాహిత్యం భూమి మీద ఉద్యమాలను కదలికలను అర్థం చేసుకుంటుంది.

సజీవ సాహిత్యం యొక్క రూపానికి సంబంధించిన లక్షణాలు దాని అంతర్లక్షణాల్లాగానే వుంటయ్. సత్యాన్ని నిరాకరించటం, అంటే అందరకూ అనుకొనేదాన్ని, నేను యింతవరకూ తెలుసుకున్నదాన్ని నిరాకరించటం. సజీవ సాహిత్యం సంప్రదాయ శైలుపట్టాలను విశాల రహదారులను విడిచిపోతుంది.

టాల్‌స్టాయ్ గోర్కీ చెకోవ్‌ల మహాచక్రాల క్రింద నలిగి అరిగి నునుపుదేరిన రష్యన్ సాహిత్యపు రహదారి—— వాస్తవికవాదం, వాస్తవజీవితం, మనం నిజజీవితాన్నుంచి తిరిగిపోవాలి.

బ్లోక్, సోలొగుబ్, బెలీలు నడిచిన రైలుదారి సింబలిజం— నిజజీవితాన్నుంచి మరలిపోయిన సింబలిజం— కనుక మనం సింబలిజం నుంచి మరలిపోవాలి. వాస్తవ జీవితంవైపు మరలి నడవాలి.

అసాధ్యం ? అవునా ? సమాంతర రేఖలు ఒకదానిపైగా ఒకటి పోవటమూ అసాధ్యమే. యూక్లిడ్ యొక్క సాంప్రదాయక ప్లేన్‌జామెట్రీలోనే అది అసాధ్యం.

యూక్లిడేతర జామెట్రీలో అదొక ఊహ. ముఖ్యమైన సంగతేమంటే తిన్నగావుండటాన్ని విరమించటం, వున్నస్థాయిని అధిగమించటం. భూమికి విమానానికి వున్న సంబంధమే, యివాళ్టి వాస్తవజీవితపు తిన్నని ఉపరితలానికి యివాళ్టి సాహిత్యానికీ వుంది. ఉన్నజీవితాన్నించి వాస్తవికతకూ, తత్వశాస్త్రానికి అభూతకల్పన అనిపించే లోకాలకు ఎగిరిపోయేందుకు ఉపయోగపడే runaway మాత్రమే అది (విమానం ఎగరటానికి భూమి వుంటుందే అదే runaway). మహాపథాల పయనించేకోసం నిన్నటి బళ్ళను వదిలేద్దాం. నిన్నలను తెగగొట్టేందుకు సజీవులకు బలం వుంటుంది.

బండిలో ఒక పోలీసు ఆఫీసర్ను వుంచొచ్చు. కాని అది యింకాబండే.

అదెంత విప్లవ వాస్తవికత అయినా, ఎంత గణగణగంటలతో వేగంగా అయినా పాతరహదారివెంట వున్న జీవితాన్నే పట్టుకురాస్తూ కూచుంటే అదింకా నిన్నటి సాహిత్యమే అవుతుంది.

మన కివాళ కావల్సింది కార్లు, విమానాలు. రెక్కలమీద ప్రయాణాలు, క్షణాలు, చుక్కల గీతలు.

నెమ్మదిగా సాగే పాతవర్ణనలు వద్దు. ప్రతిమాటలో ఎంతో విద్యుత్తు మరెంతో ప్రవాహం వుండాలి. పూర్వపు 60 సెకండ్ల నిమిషం దాన్ని యిపుడు ఒక సెకండ్లోకి వత్తాలి, ఛంధస్సుల నడ్డివిరగ్గొట్టి సూత్రాల బంధాలు తెంచి నియమాల అవధులుదాటి సూటిగా నేరుగా ప్రతి చిన్నభావానికి వేరువాక్యంగా వుండాలి. అతిచురుకైన చలనంతో పాతది అలవాటయినట్టిది సంప్రదాయమైనది ఎగిరిపోతుంది. వింతఅయిన సింబాలిజం కొత్తరకపు పదాల కూర్పువస్తుంది.

సూత్రం అని దానిని అనొచ్చో లేదోగాని ఒకసూత్రం వుంది. రూల్‌ని ఎక్స్‌ప్లైన్ చేసేసే శక్తిలోనే రచయిత తెలివివుంది అని.

ప్రపంచాన్ని సంధానీకలుగా చూపించటమే సైన్సుయొక్క, కళలయొక్క పని. రూపభేదాలు సంధానకల్లో భేదాలే. వాస్తవవాద రూపాలన్నీ యూక్లిడ్ ప్రపంచ నిర్దిష్టస్థాయిలో చూపించటమే. ఆద్యంతాలుగల ప్రపంచం అనేదిలేదు, అదొక సంప్రదాయం, ఒక అవాస్తవం. కాబట్టి వాస్తవవాదం— సామ్యవాద వాస్తవికత అయినా బూర్జువా వాస్తవికత అయినా— అవాస్తవికమే,

కొత్త గణితశాస్త్రం, కొత్త కళల్లోలాగా వాస్తవానికి దగ్గరగా వుండటమంటే శీఘ్రచలనంగల వంపులతో కూడిన ఉపరితలాలను చిత్రించటమే. ఆటవికం కాని వాస్తవవాదం అనేది మార్పులోనూ, వక్రీకరించటంలోనూ, అభౌతిక అవగాహన లోనూ వుంది. కెమెరా రెన్సు భౌతికంగా (objective) వుంటుంది.

కొత్తరూపం అందరకూ బోధపడదు. అది కష్టం, అలవాటయింది తేలిక, సుఖమైందిన్నీ. యూక్లిడ్ ప్రపంచం సులభగ్రాహ్యం. ఐన్‌స్టీన్ ప్రపంచదుర్గ్రాహ్యం. అయినా మనం యూక్లిడ్‌కి తిరిగిపోవటం అసాధ్యం. ఏ విప్లవమూ, ఏకొత్త వింత సంగతీ సుఖమైందీ సునాయాసమైందీ అవదు. విప్లవం ఒకపెద్ద దూకుడు, అందులో పగలటం వుంది. పగలటంవల్ల గాయం అవుతుంది. గాయం బాధాకరమే. కాని అది అవసరమైన గాయం. చాలామంది సాంప్రదాయకమైన నిద్రజబ్బుకు గురవు తారు. యీ జబ్బుగలవాళ్ళకు ఆది సాగనీయకూడదు అలా పోనిస్తూపోతే వాళ్ల దీర్ఘ నిద్రలోనే (చావు) పడిపోతారు.

ఈ జబ్బే కళాకారులకు రచయితలకూ వస్తుంటుంది. వాళ్లకు దొరికిన ఏదో ఒక కళారూపం, వాళ్ళకు నచ్చిన కళారూపంతో తృప్తిపడిపోయి నిద్రపోతారు. వారు తమకు తాము గాయం చేసుకోలేరు. వారికిష్టమైన వాటిని ప్రేమించకండా మానలేరు. ఆ బలం వారికిలేదు. ఎన్నాళ్ళనుండో వుంటున్న పొగడ్తల వాసనంతో నిండిన తమ గదులను వదలిపెట్టే చేవ వారికుండదు. బయట స్వేచ్ఛగా గాలిలో తిరగలేరు కొత్తగా పునఃప్రారంభం చేయలేరు.

తమకు తామే గాయం చేసుకోవటం కష్టం. ప్రమాదకరమనేది కూడా నిజమే. కాని నిన్నటిలాగానే యివాళ, యివాళలాగానే నిన్నలో బ్రతకటం సజీవ చైతన్యంగల వారికి యింకా కష్టం.

( తెలుగు అనువాదం : అట్లూరి రంగారావు )

# కవి - కవిత్వం

సమాజంలో ఒక కవి కవిగానే కాకుండా అందరు మనుష్యుల్లాగానే ఒకే తిండి తింటూ అందరిలాగానే బాధలమభవిస్తూ వుండే మనిషి అశాభరితమైన వాతావరణంలో బాధాపూరితమైన పరిస్థితులలో అందరిమాదిరిగానే ప్రవర్తిస్తాడు. కవిగా ఏవిషయం గురించైనా మాట్లాడే ముందు అతడు మనిషిగా దానిగురించి ఫీలవుతాడు. ప్రకృతి దృశ్యాలగురించే కవి ఫీలవ్వాలని చెప్పి ఆ తరువాత అతణ్ణి పలాయన వాది (escapist) అని ఎవరైనా అంటే అది హాస్యాస్పదం. జనన మరణాలు, వివాహం, ఋతువుల్లాంటి శాశ్వత విషయాలగురించే అతను పట్టించుకోవాలని అనటం కూడా సరైందికాదు. ఇవన్నీ మనకు తెలిసిన ప్రపంచంలో ఎత్తైన పర్వత శిఖరాల్లాగా పెరిగి శాశ్వతంగా ఉన్న అంతిమావధులు. అవే పట్టణాల పుట్టుకకు నాశనానికి, సంవత్సర కాలంలోని పంటలకు, క్షణికమైన బాధలకు ఇంకా తాత్కాలిక విషయాలన్నిటికి బ్యాక్‌గ్రౌండ్ లాగా ఉపయోగిస్తాయి. కాని ఈనాడు మనముందున్నది అస్తవ్యస్తమైన అస్థిరమైన పరస్పర విరుద్ధమయిన పరిస్థితులు. ఈనాడు కవి ఒకవిధమైన వైరుధ్యంలో ఇరుక్కున్నాడు— గత జీవితానికీ, కొత్త పరిస్థితులకు మధ్య. ముందూ వెనుకా మండే మంటల మధ్యపరిస్థితి అతనిది. ఒకవైపు కమ్యూనిస్టు విప్లవకారుడు అతన్ని విప్లవ శంఖం పూరించకుంటే గంజాయిమ్మకునే బేరగాని బాపతుకు జమకడ్తేస్తున్నాడు. పాత కొత్త ప్రపంచాలు రెంటిలో నివసించే ప్రయత్నంవల్లనే అతడు అశక్తుడై అశాంతి ననుభవిస్తున్నాడన్న సత్యాన్ని చెపుతున్నాడు. ఈనాడు కళాకారుని కర్తవ్యం మనుష్యుణ్ణి బూర్జువా పరిస్థితులనుండి తప్పించి శ్రామికసంఘ జీవనంవైపు నడిపించటం అని సూచిస్తున్నాడు. నూతన ప్రపంచావిర్భావం కోసం ప్రచార సాధకుడుగా (Propagandist) కవి మారాల్సిన అవసరాన్ని నొక్కి చెప్తున్నాడు. ఇంకొకవైపు బూర్జువా విమర్శకుడు కమ్యూనిజంపై సానుభూతితో ప్రచారధోరణిగల కవిత్వం రాస్తున్నందుకు తప్పుపడ్తున్నాడు. సిద్ధాంతం (ideology) అనేది ఆ భావాల నర్థంచేసుకున్న కవి విషయంలో అవగాహన పెంపొందించి విప్లవాత్మకమైన లేక తద్వ్యతిరేకమైన కవిత్వంలో కొత్తదనం సంబంధించినంతవరకు ముడిసరుకుగానే ఉపయోగపడాలని అంటున్నాడు.

కొంతవరకు వాళ్ళిద్దరి వాదనలూ సరైనవే. అయినా కవిత్వం ప్రచారం కూడా ఎందుకు కాగూడదు అన్నవిషయాన్ని జ్ఞాపకం పెట్టుకోవాలి. కవిత్వంతోనైనా ప్రచా

రంతోనైనా సాధించాలని ప్రయత్నించేది ఒక మానసికస్థితి (state of mind). అయినప్పటికీ ప్రచారం conscious గా చేసేపని. కవిత్వం unconscious గా చేయాలని చెప్పటం సరిపోదు. ఈ విధంగా ఆలోచిస్తే బైబిలు నుండి నేటివరకున్న ప్రబోధాత్మకమైన కవిత్వాన్ని కాదనాల్సివుంటుంది. ఒకవేళ ప్రబోధాత్మకతే ప్రధానమనుకుని కావ్యగుణాన్ని పరిహరిస్తే ప్రచార కవిత్వమని నిందించవచ్చును. ఏది ఏమైనప్పటికీ కవిత కవితే. అది ఎప్పుడూమారని నిర్ణీతమైన విషయం. ఈసందర్భంలో the Dance of Death అనే ఆడెన్ రచనకు లభించిన ఆదరణను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇంతకుముందున్న అతని రచనలతో పోల్చినపుడు దీనిలో ప్రచారం ఎక్కువగా ఉందని విమర్శవచ్చింది. అయితే అతని 'Poems' కూడా ప్రచారమే అనాల్సి ఉంటుంది. అవి మధ్యతరగతి ఇంగ్లీషువాడి అర్థశవప్రాయత్వాన్ని. వివిధరీతుల్లో చాలా తెలివిగా ఎత్తిచూపించాయి. శక్తీ, సమర్థతగల ఒక రచయిత కనుక ఎవరితోనైనా నీవు సగం చచ్చి శవప్రాయంగా ఉన్నావని అదేపనిగాచెపితే అతడా విషయాన్ని తప్పకుండా నమ్ముతాడు. మాటిమాటికీ చేసే సూచన అతనిలో ఒక మానసిక సంసిద్ధతను కలిగిస్తుంది. అయితే కవిత్వం ప్రచారమన్నమాటేగదా. ఇటువంటప్పుడు 'the Dance of Death' లాంటి రచనల్ని కవిత్వంగానే గుర్తించాలి కాని ప్రచారంగా కాదు.

'Poems' అనేవి వైయక్తికమైన మానసికశాస్త్ర దృష్టినుంచి చూస్తే ప్రబోధాత్మకమైనవి. 'the Dance of Death' అన్నది మార్క్సియన్ ఉద్దేశం ప్రకారం ప్రబోధాత్మకమైంది. దానికి సార్థకత చేకూరలేదంటే దానికి కారణం ఇంగ్లండులో వర్గభేదాల్లేని సమాజం ఏర్పడలేదన్నదే. సంఘవిమర్శ ప్రధానంగాగల రచనలు చేయడానికి ఒక స్థిరమైన వ్యవస్థకావాలి. అస్పష్టంగా ఉన్న భవిష్యతును. దృష్టిలో ఉంచుకుని వర్తమానాన్ని విమర్శించలేము. కమ్యూనిజమ్ ఇంగ్లండులో ఏర్పడబోయే స్థిరమైనవ్యవస్థే అయితే అప్పుడు సాహిత్యపరమైన విమర్శ వెల్లివిరుస్తుంది. ఇదే మనం కమ్యూనిస్టు విమర్శకునికి ఇచ్చే మొదటి సమాధానం కవి ఒక చైతన్యవంతమైన సాధనం మాత్రమే. నాయకుడుకాడు. భావాలు కార్యసాధకులయిన ప్రజల మనస్సుల్లో సామాన్య విషయాలుగా మారనంతవరకు అవి కవికివస్తువుకాలేవు ఇంకోవిధంగా చెప్పాలంటె కవి విప్లవంలో చేరితీరాలని కమ్యూనిస్టు కనక చెప్తే అది రైటే. మార్క్సిస్టు అయినవానికి సిద్ధాంతం ఆచరణ మధ్య వైరుధ్యం ఉండదు. విప్లవాత్మకమైన ఆచరణే కవిని విప్లవకవిని చేస్తుంది. అయితే కవి తన కవిత్వాన్ని వర్గయోధుని సరసన ఉపయోగించాల్సింది పోయి ప్రతి కవితనూ వైయక్తికబాధా నివృత్తికి

సాధనంగా వాడుకున్నాడని విమర్శిస్తే లాభించేదేమీలేదు. ఒకవిధంగా ప్రతికవిత ఒక అంతర్గత వైరుధ్యాన్ని, పోరాటాన్ని సాధిస్తుంది, కానిఅది తాత్కాలికంగానే అటువం టప్పుడు కవి మేధస్సులోని బాధలు సుషుప్తిని పొందుతాయిగాని అంతమవవు.

విప్లవ కవిత్వం అనబడే దానివల్ల నిజంగా విప్లవకరమైన శక్తులపై కలిగే పరిణామం కూడ విపరీతమైందే. స్పెండర్ అన్నట్లు ఈ విప్లవ కవిత్వాన్ని చదివిన వాళ్ళు భౌతికవాదపు (materialism) అంశాల గురించి అదనంగా ఆలోచించి సామాజిక విప్లవం గురించి మరిచిపోతారు, విప్లవ ప్రచారకుల ప్రకారం కళ విరామసౌఖ్యం గల వర్గాల్లో మేధావంతులైయుండి అసంతృప్తిపాలైన కొందరిపై బీదవారికి దానధర్మాలు కల్గజేసే ఫలితాన్ని కల్గచేస్తుంది. కాబట్టి రాపిడి బాగా ఎక్కువై చివరికి పనికిరాకుండా పోవాల్సిన యంత్రానికి ఆయిల్‌పూసి ఇంకా నిలిచి ఉండటానికి అవకాశం కల్పించటం జరుగుతుంది Conventional Communist కూడా ఇదేవిధంగా ఆలోచిస్తాడు. ఇది కొంతవరకే సత్యం, మత్తుమందు కావలసిన వాళ్ళు దాన్ని వారెక్కడో సంపాదిస్తారు వారా గంజాయి మత్తును కవిత్వంలో పొందితే వారి అలవాట్లను నిందించాలికాని కవిని కాదు. కమ్యూనిజమ్‌తో సానుభూతి ఉన్నకవిత ఆరోగ్యవంతులైన వారినే ప్రభావితం చేస్తుంది. అది ఆలోచనను రేకెత్తించి, అసహనాన్ని ప్రేరేపించి దాన్ని అరణ్యంలో అగ్నిలాగా వ్యాపింపజేస్తుంది. దానివల్ల ఎంతోమంది ఆలోచించే పద్ధతిమారి చివరికి ఆ వ్యవస్థ కూలిపోవడానికి దోహదం చేస్తుంది.

విప్లవకవి నాయకుడు కాడు. క్రాస్‌రోడ్లవద్ద నిలబడి వచ్చే పోయేవాళ్ళకు ప్రమాదాన్ని సూచించి దారిచూపించేవాడు. ప్రతి ఒక్కరిలో ఉన్న వైరుధ్యాన్ని విచ్ఛేదం చేసేవాడు ప్రతి ఒక్కరిలో ఉన్న ధైర్యాన్ని ప్రతిబింబింపజేసి ధైర్యాన్నిస్తూ, ప్రతి ఒక్కరిలో ఉన్న విప్లవోద్దేశాలకు అద్దంపట్టి విప్లవాన్ని ముందుకు తీసుకుపోయేవాడు.

(సిసిల్ డే లూవిస్ రచించిన A Hope for Poetry - chap. 8 నుండి అనువాదం : సి. ఎ. జగన్‌మోహన్)

బాధితులను చూసి, దుర్బలులు కన్నీరు విడుస్తారు. ధీరులు సాయపడతారు.

—మాంటెన్

# ఈ తరం కవులు

విశాఖ, విరసం శాఖ (మార్చి '71)

నవతరానికి
(తిరుగుబాటు) యువతరానికి
దివిటీ పట్టుకు వస్తా

ప్రళయానికి విలయానికి
ప్రకంపనం పలికిస్తా

పిడుగుపడ్డ గుడిసెమీద
ఫిడేలు వాయించలేను

రాబందు రాజ్యంలో
రక్తం తిని బతకలేను

అన్నారు శ్రీ పురిపండా అప్పలస్వామిగారు.

ఈ దివిటీని ఊతగా తీసుకుని సాగిపోతున్నారు ఈతరం కవులు. వీరందరి గుండెల్లో మారుమోగేదేమిటి?

ఆందోళన మా ఊపిరి
తిరుగుబాటు మా వేదాంతం

అన్న శ్రీశ్రీ మాటలు ఈతరం కవుల్లో చైతన్యం రగిలించాయి. ఈతరం కవుల్లో విప్లవకవులదే పైచెయ్యి. కాని ఇందులో విప్లవకవులు కానివారూ వున్నారు. మచ్చుకు కొన్ని పేర్లు— మురళీధర్ (భిన్నధృవాలు), ఆరిపిరాల విశ్వం (నిదుర కన్నెలు, రేపటి స్వర్గం వగైరా), మాదిరాజు రంగారావు (కిర్మీరం), వేగుంట మోహనప్రసాద్ (చితి-చింత), అద్దేపల్లి రామమోహనరావు (అంతర్జ్వాల), సి వి. కృష్ణారావు (వైతరణి, మాదీ మీఊరే). ఆతరంలో అభ్యుదయ కవులు కానివారున్నట్టే ఈతరంలో విప్లవకవులు కానివారు వీరు, మరికొందరు. అయితే ఈతరం కవులను గురించి చెప్పేటప్పుడు విప్లవకవులే ముందువరసలో నిలబడతారు.

ఎందుకంటే భారతదేశ మంతటిలోకి రాజకీయంగా ఎక్కువ చైతన్యం చూపిస్తున్నది తెలుగునాడు. విప్లవ కవిత్వంలో ఈనాడు ఇండియా కంతటికి అగ్రస్థానం

తెలుగుభాషది. ఈ రెండు విషయాలకి సన్నిహితమైన పరస్పర సంబంధం ఉంది. మొదటి విషయాన్ని శ్రీకాకుళ గిరిజన పోరాటం, రెండో విషయాన్ని 'ఝంఝ', 'లే' వంటి కవితా సంకలనాలు తెలియజేస్తున్నాయి. శ్రీకాకుళ పోరాటం 'ఝంఝ' కి పునాది. విప్లవ కవిత్వానికీ, భావితరాలకూ ఇది ఒరవడి. అయితే దీనికి పూర్వ రంగం ఏమిటి? 'ఝంఝ' ఒక్కసారి ఆకాశంనుండి విరుచుకు పడలేదు. ఎంతో పూర్వగాథ వుంది. బాధ, వేదన, సంగ్రామం, సంహారంతోనిండిన తెలుగునేల నుండి పుట్టింది 'ఝంఝ'.

రావి శాస్త్రిగారి 'మాయ' కథలో పెద్దప్లీడర్ అన్నట్టు ఇంగ్లీషువాడు "మాయగాళ్ళల్లోకల్లా మాయగాడు, గొప్ప మాయగాడు. అక్కడా అక్కడా చలాయించినట్లు ఇక్కడ కూడా కూలివెధవలు పెత్తనం చలాయిస్తారేమోనని అనుమానం కలిగింది. అసలుకేమోసం వస్తుందేమో నన్నభయం కలిగింది. వెంటనే సాటి షావుకార్లకు రాజ్యం అప్పజెప్పి చల్లగా తెరవెనక్కు జారుకున్నాడు. గొప్ప మాయగాడు. వ్యాపారం వ్యాపారంలాగే వుంది, లాభాలు లాభాల్లాగే వున్నాయి. ఏదైనా రొష్టుంటే అదంతా మన వెధవల్దే అయింది". 1947 భారత స్వాతంత్ర్యంలోని చిదంబర రహస్యమిది. 1947 కే తెలంగాణా పోరాటం వుప్పెత్తుగా సాగుతోంది. మన స్వతంత్ర ప్రభుత్వం నీడలోకూడా తెలంగాణా ప్రజలు సాయుధ పోరాటం కొనసాగించవలసి వచ్చిందంటే మన పాలకవర్గాల నిజస్వరూపం తేటతెల్లమవుతుంది. 1948 లో స్వతంత్ర భారత సైన్యాలు పోలీస్‌యాక్షన్ పేరుతో నిజాం సంస్థానంలోకి అడుగుపెట్టాయి.

బానిస జన శల్యములను పేర్చికూర్చి నిర్మించిన
నీ రాక్షస సింహాసన వదిగదిగో కదులుతోంది

(సోమసుందర్)

అంటూ గర్జించింది తెలంగాణా వీరప్రజానీకం. కవి గొంతులో అదే ప్రతిధ్వనించింది. అయితే భారత సైన్యాలు నిజాం నవాబు సింహాసనాన్ని తెలంగాణా ప్రజల 'బారి' నుండి రక్షించి తమ ప్రభుభక్తిని చాటుకున్నాయి. ఒకపక్క ఇంగ్లీషువాడి ఆస్తులకు కాపలా, మరోపక్క దేశవాళీ దోపిడీదార్లకు మద్దతు. ఇది భారత పాలకవర్గాల ద్వంద్వ స్వరూపం. 1947 నుంచి కాంగ్రెసు ప్రభుత్వాలు చేస్తున్న పని యిదే.

ఆనాటి తెలంగాణా విముక్తిపోరాటం ఎందరో కవులను వుద్రూతలూగించింది. ఒక అజ్ఞాతరవి

తెలుగు బిడ్డల రక్తమొలికింది నేలపై
కాలువై పారింది కలిసింది వీటిలో
సెలయేరు ఎరుపెక్కెను
కన్నీటి కెరటాల రొదవొందెను
అని ఆలాపించాడు

సోమసుందర్ రాసిన 'ఖబడ్దార్ నైజాం పాదుషాహీ' గేయం తెలంగాణా విముక్తి పోరాటానికి, బయట పరిజానీకానికి ఎంతో వుత్తేజమిచ్చింది.

ఆవేదిలో వచ్చినదే ఆరుద్ర 'త్వమేవాహం', కుందుర్తి 'తెలంగాణా', గంగినేని 'ఉదయిని', 'త్వమేవాహం' టెక్నికల్ కావ్యం. వరవరరావు అన్నట్టు "ప్రయోగం కొరకు వస్తువుని బలిపెట్టాడు." ఆనాడు ఒక ఇంటిపై దాడిచేసి పోలీసులు 'త్వమేవాహమ్' ఎత్తుకుపోతూ పుస్తకం పేరు 'ఆరుద్ర' అనీ, రచయిత పేరు 'త్వమేవాహమ్' అనీ రాశారట. కవిత్వానికీ, పోలీసులకీ చుక్కెదురయినా 'త్వమేవాహమ్' ఎంత కొరకరాని కొయ్యో మనకు తెలుస్తుంది— ఈ పోలీసు రాతవల్ల. తెలంగాణా పోరాటాన్ని గురించిన ఆవేదన ఆరుద్రలో చాలా ఎక్కువేవుంది. కాని పాపం anxiety గుప్పిటినుండి Confusion ముట్టడిలో చిక్కుకున్నాడు. అందుకే ఆ కావ్యం ఎవరికీ అందకుండా పోయింది.

కుందుర్తి 'తెలంగాణా' పొడుగునా రూపకాలంకారం చాలా ప్రయోజనాత్మకంగా వాడాడు. కళాప్రమాణాల దృష్ట్యా ఇది ఉత్తమకావ్యం. Poetry is metaphorical అంటారు. అయితే వరవరరావు అన్నట్టు "కుందుర్తి ఈ పోరాటాన్ని మహాభారత అవతరణతో పోల్చి "యుద్ధంకాదు సంధి పరిష్కారం" అని ముగించడంతో చప్పున చల్లారింది". గంగినేని 'ఉదయిని' లో కవిత్వంపాలు తక్కువైనా తెలంగాణా ప్రజా పోరాటాన్ని సూటిగా తేటగా చిత్రించాడు. కె. వి. రమణారెడ్డి 'అంగారవల్లరి' అదే సమయంలో వచ్చింది,

"స్మృతి కలవరకు విస్మృతి మీకు లేదు"

అంటూ హతప్రజావీరుల అమృతస్మృతికి జోహార్లర్పించారు. ఆ తరువాత చాలాకాలం కావ్యోద్యమం కుంటుపడింది.

1961 లో గజ్జల మల్లారెడ్డి తెలుగునాటి రాజకీయ, సాంఘిక దురలవాట్లని దుమ్మెత్తిపోస్తూ

తెలుగునాట భక్తిరసం
తెప్పలుగా పారుతోంది
డెబ్రయినేజి స్కీములేక
దేంజరుగా మారుతోంది

అంటూ గేయాలు రాశారు.

1965 లో సి. విజయలక్ష్మి 'విషాద భారతం' రాశారు. కవితాకాశంలో ఇదొక గొప్ప మెరుపు. వరవరరావు అన్నట్టు "విషాద భారతం ఈ 20 ఏళ్ళ భారత విషాదాన్ని కళ్ళముందు నగ్నంగా చూపుతుంది". కాని సి. వి. విషాదభారతాన్నే చూశారు కాని విప్లవ భారతాన్ని, వీరభారతాన్ని చూడలేకపోయారు. కనకనే

ఓటు ప్రజా తంత్రానికి
జీవిత ప్రగతికీ రాచబాట

అన్నారు.

కాని ఈనాడు

రైట్ టు ఓట్ కాదు
ఫైట్ టు ది లాస్ట్

అంటున్నాడు లోచన్.

విషాద భారతానికీ వీర భారతానికీ ఉన్న తేడా ఇదే. అయితే అనాడు 'విషాద భారతం' రాసిన సి. వి. నేటి విప్లవ భారతాన్ని గుర్తించడం కవి ధర్మం.

నగరమే పులి అయినప్పుడు ప్రజలు
అడవుల్లో తలదాచుకోక తప్పదు
మాటుకాచి పులిని కూల్చేయడమూ తప్పదు.
అడవిలో ప్రతిచెట్టూ రహస్యాన్ని దాస్తుంది
విప్లవాన్ని పూస్తుంది

'విషాద భారతం' తర్వాత సి. వి. 'కారుచీకటిలో కాంతిరేఖ' రాశారు. 'విషాద భారతం' లోని క్లుప్తత, కుదింపు ఇందులో కొరవడింది. కాని కుహనాకవులని, రాజకీయవాదులని తెగ ఏకేశారు.

1953 లో దాశరధికి ఉత్తరం రాస్తూ ఆరుద్ర ఇలా అన్నారు. బహుశః తన మనసులోని ఆనాటి ఆవేదనే అలా పలికించిందేమో. "రానున్న పదేళ్ళలో తెలంగాణా

సాహిత్య ప్రపంచానికి మార్గదర్శి అవుతుంది. తెలంగాణా నుండి భావివుద్యమాలు తలలెత్తుతాయి, ననలెత్తుతాయి. కోస్తాజిల్లాలు సుస్తీపడుతున్నాయి". నిజంగా ఇవి అక్షర సత్యాలు. అందుకే తెలంగాణాలోని దిగంబరకవులు, తిరగబడు కవులు, మార్చ్కవులు కవితా కదనరంగంలో కదంతొక్కుతూ కదిలివచ్చారు. తెలుగు కవిత్వంలో ఈముగ్గురు కవులు విప్లవ కవిత్వానికి పూర్వరంగం సిద్ధంచేసి వుంచారు. ఏది ఎలావున్నా కుటుంబరావుగారన్నట్లు "సాహిత్యోద్యోమంలో స్తబ్దతను దిగంబరకవులు ధ్వంసంచేశారు. ఈ తిరుగుబాటు సర్వతోముఖమైనది. రానురాను దిగంబరకవులు ఒక వుద్యమంగా పరిణమించారు. కవులుగాకన్నాకూడా ఉద్యమకారులుగా వారి స్థాయి చూస్తూండగానే పెరిగిపోయింది". 1965 నుండి '68 వరకు మూడు సంపుటాల్ని వెలువరించి తెలుగు దేశాన్ని కదిలించారు. అయితే దిగంబర కవిత్వంలోని negetive దృక్పథం సమాజంలో పేరుకొన్న కుళ్ళను పాక్షికంగానన్నా బయటపెట్టింది. ఈ లోటునితీర్చి విప్లవానికి చూపుడువేలుగా నిలిచింది 'తిరుగబడు' (1970 లో అచ్చయింది.)

'తిరగబడు' లో 'లోచన్' గీతం—

పరాభూతమైన పత్రి అణువులోంచి
బులెట్ శబ్దంలోంచి రావాలి
మానవత్వం పలికే నీరక్తంతో
కొత్త చరిత్ర రాయాలి
మరో మాట వద్దు
వేరే బాట వద్దు
ట్రిగ్గర్ మీద వేళ్ళతో
రమ్మంటున్నా

కవిత్వం నగరాలనుంచి గిరిగహనాలకుమారింది. అక్కడే పుట్టాడు సుబ్బారావు పాణిగ్రాహి. తెలుగులో విప్లవకవిత్వానికి నాందీ గీతం పాడాడు.

దిక్కు మొక్కు లేని జనం
ఒక్కొక్కరు అగ్నికణం

అంటూ పలవరించాడు.

ఎందాక రమ్మన్న
అందాక వస్తాము

కష్టాలు నష్టాలు
ఇష్టపడి వుంటాము
యమయాతనలు దాటి
సుఖ మనుభవించాలి
మాకున్న లేకున్న
ముందుతర మైనాను.

అని గిరిజనులతో కలిసిపోయి పాడుకున్నాడు. అతని గేయాలు ఇంకా ఎన్నో వెలుగులోకి రాకుండా వుండిపోయాయి. పాణిగ్రాహిని పోలీసులు పొట్టనపెట్టుకున్నారు. అందుకే రాచకొండ విశ్వనాథశాస్త్రి అన్నారు "ప్రజల పక్షాన పిట్ట నిల్చున్నా సరే. పెద్దలు దానిరెక్కలు విరిచి రక్తంతాక్క మానరు". కోయిలయినా అంతే. కవికోయిలయినా అంతే. మన పాలకులకు ఆ తేడాలులేవు.

సుబ్బారావు పాణిగ్రాహికి విప్లవశంఖమే హంసగీతం. ఆ శంఖనాదం తెలుగు కవుల గుండెల్లో సుడులు రేపింది. వెంటనే ముందుకురికి వచ్చారు 'మార్చ్' కవులు. (1970 జులై)

ప్రజలను సాయుధం చేస్తున్న
రివల్యూషనరీ నేటి కవి

అంటూ కుండబద్దలు కొట్టినట్లు నిర్దుష్టంగా, నిక్కచ్చిగా కవితావాహినికి గమ్యం ఏమిటో చెప్పారు.

ఇంతవరకు వచ్చిన కవిత్వమంతా వచనగీతంలోనే సాగింది. వచన కవిత్వంలో ఎంతో లోతుంది. మధ్యతరగతి పాఠకుల్లో, విద్యార్థుల్లో అది గొప్పసంచలనం కలిగించింది. నిజంగా కవిపసతెలిసేది వచన పద్యంలోనే. 'కందపద్యం రాసినవాడే కవి' అని పూర్వం అన్నట్లుగా, "వచనగేయం రాసినవాడే కవి" అని అనేటంతగా ఈ 20 ఏళ్లలో వచ్చిన కవితావుద్యమం మూడు పువ్వులు, ఆరు కాయలుగా పుంచికాపు కాచింది. వచన కవితా ఉద్యమంలో ఉద్దండులు తిలక్, కుందుర్తి. వచనకవిత్వం రాసిన కవులు చాలా వరకు ఆ కవిత్వానికి వన్నెతెచ్చారు. అయితే వచనకవిత్వం తనపాత్రను ఇంతవరకు సక్రియంగా నిర్వహించింది, ఇక తెరవెనక్కు తప్పుకోక తప్పదు శ్రీశ్రీ అన్నట్టు "కష్టజీవికి రెండువైపులా నిలబడ్డవాడే కవి". కష్టజీవులకు కావలసింది తేటగా, సూటిగా పాడుకునే పాటలు. కవిత్వం కష్టజీవుల గుండెల్లో చోటు చేసుకోవాలంటే ప్రతివారు

పాడుకునేందుకు అనువుగా రచించాలి. వచన కవితావాహిని గమనాన్ని 'ఝంఝ' సక్రమంగా మళ్లించగలిగింది. విప్లవ కవిత్వం మార్గపద్ధతినుండి దేశిపద్ధతికి మారింది.

'మహాప్రస్థానం' రాసిన శ్రీశ్రీ జానపదుల భాషలో 'నిన్నటి జట్కావాలా' పలవరించాడు. ఇది కథాకావ్యం కావడంతో శ్రోతల్ని బాగా ఆకట్టుకుంది. ఆనాటి తెలుగు సాహిత్యంలో పాల్కురికి సోమనాథుడు భాష, వస్తువు, ఛందము— ఈ మూడింటిలోను సంప్రదాయాలను కాదని వాటిలో విప్లవం సాధించిన విప్లవవీరుడు అందుకే శివకవులు ప్రజలకు అంతదగ్గరగా రాగలిగారు. ఈనాడు మన 'శివుడు' కూడా అంతే జానపదులు పాడుకోవడానికి వీలుగా 'నరుడో భాస్కరుడా' రాసి తెలుగు కవితాల ధాలను తెంచి విప్లవకవిత్వాన్ని జానపద కవిత్వంగా మలిచాడు దేశకవిత్వం రెండు రకాలు— పదాలు, పాటలు. జానపద కవిత్వంలో తుమ్మెదపదాలు, ప్రభాతపదాలు, వెన్నెలపదాలు, కోవెలపదాలు, గొబ్బిపదాలు; లాలిపాటలు, ఏలపాటలు దరువులు, చిందులు ఎన్నోవున్నాయి. పదకవిత్వానికి "నరుడో, భాస్కరుడో" ద్వారా 'శివుడు' వరవడిపెడితే, పాటలకు దారిచూపించాడు తన 'కొక్కొరోకో' లో 'రెంజిమ్'.

కొక్కొరోకో అని కోడి కూసింది
ఏత మెత్తినవాడ! ఏరు కట్టినవాడ!
నారు పోసినవాడ! నీరు పోసినవాడ!
కలుపు తీసినవాడ! కలత మోసినవాడ!
తూరుపు కొండంత జేవురించింది

అయితే వచనకవిత్వ రచనకి అలవాటుపడిన కవులకి ఒక్కసారి తమ కళారూపాన్ని మార్చుకోవడం అంటే కష్టమైనపనే వచనపద్యాలు ఆలోచనాత్మకమైనవి. ఆవేశం, అనుభూతి పాటల్లోనే పరుగులు పెడతాయి.

ఆంధ్రదేశంలో ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క విధంగా కోతపదాలు నూర్పిళ్ళపాటలు ప్రచారంలో వున్నాయి.

కొయ్యండయ్యా! కొయ్యండి
కోసీ ఒణుపూ వెయ్యండి
వానల వరదల వంగినను
వెన్నుల నీనిన పన్నెల పేను

తిన్నగ డీసీ మొదలూ కోసీ
పనలన్నీ నీ బొంజెట్టాల
గింజలు బొందలొ పడిపోకుండా
పొందుగ వెన్నులు కొయ్యండల్లా
కాలం సూత్తే సీతాకాలం
కొడవలి పాటూ జాగర్తరా
కాలూ సెయ్యీ ఆడితేనే
కుండలొ కూళ్ళు కనిపిస్తాయి

ఇలాంటి పదాలు, పాటలు వాళ్ళకు ఆవేశం కలిగిస్తాయి.

జానపద సాహిత్యంలో పడవ పాటలు, రాట్నం పాటలు, దంపుళ్ళ పాటలు, పీచుకొడుతూ పాడే పాటలు లాంటివి ఎన్నోవున్నాయి.

ఈ సాహిత్యాన్ని సృష్టించిన వాళ్ళు పండితులుకారు. అక్షరజ్ఞానంలేని జానపదులే. కాని ఈ పదాలు వాళ్ల పెదాలమీద ఆడుతూంటాయి.

కష్టపడుతూన్నా కడుపునిండని రైతులని గురించి 'లోచన్'

దశాబ్దాలుగా యీ పొలాల్లో రెక్కలు విరుచుకున్నా
కడుపులో ఓ కమ్మని తేన్పు పండించుకోలేని
కర్షకుల కడగళ్ళని చూడలేని కళ్ళని...."     అంటూ

వచన గేయంలో చెప్పిన భావాన్నే ఇంకా బలంగానూ, సూటిగానూ చిత్రించాడు ఏ అజ్ఞాత జానపదుడో!

ఏటి కేతంబెట్టి ఎయిపుట్లు పండించి
ఎన్నడూ మెతుకెరుగనన్నా!
నేను గంజిలో మెతుకెరుగనన్నా
కాల్జేయి కడుక్కోని కట్టమీద గూసుంటె
కాకి దన్నిపాయెరన్నా– కాకి
పిల్లా దన్నిపాయెరన్నా
పోరుకూ చాల్లేక పొయికాడ కూసుంటె

పోరి దన్నీపాయెరన్నా – పోరి
తల్లీ దన్నిపాయెరన్నా
చుక్కపొద్దున లేచి బొక్కెనెత్తాబోతె
బొక్క బోర్లా పడితిరన్నా
నేను పక్కలిరగా బడితిరన్నా
నాదేటి బతుకాయెరన్నా
నేను నాడే చావకపోతిరన్నా!

ఆ వచనగేయం మధ్యతరగతి వాళ్ళకి తప్ప మరొకళ్ళకి అందదు. కాని ఈ జానపదగీతం మధ్యతరగతి వాళ్ళనీ, జానపదుల్నీకూడా స్పందింపజేస్తుంది.

కళల్లో సామూహిక లక్షణం అంటే ఇదే. కొడవటిగంటి కుటుంబరావుగారన్నట్లు "మనకళలన్నీ శ్రామికవర్గప్రయోజనాలకి అంకితమైవుండాలి. కాని అవి శ్రామికవర్గానికి చెందనివాళ్ళని, అంటే మధ్యతరగతి మేధావులను వుత్తేజితులను చేయాలి".

మన రచనలన్నీ శ్రామికవర్గ ప్రయోజనాలకి అంకిత మవడమేగాక, వాళ్ళకి అర్థమై, వాళ్లనోళ్ళలో ఆడుతూండేలాగ వుండాలి. మధ్యతరగతికోసం రాసింది అట్టడుగు జీవికి అర్థంకాదుగాని, అధోజగత్సహోదరుడికోసం రాసింది మధ్యతరగతివాళ్లకు అర్థం కావడంలో కష్టంలేదు.

మన జానపదగీతాలను మనం బాగా ఆకళించుకోవాలి. స్టాలిన్ "Art must be national in form and Socialistic in content" అన్నారు. విప్లవ కవులంతా ఈ మాటను మరీ మరీ మననం చేసుకోవాలని మనవి.

మరోమాట. మన పోలీసు ప్రభుత్వం మనకవిత్వాన్ని నిషేధిస్తోంది. కవిత్వం రాసి, అచ్చువేయించి, జనంచేత చదివించే అవకాశం మనకు ఇకముందు వుండదు. అందువల్లనైనా ప్రజలకు అందేలా మన కవిత్వం పదాల్లో, పాటల్లో అల్లాలి. అవి జనం గుండెల్లోకి చొచ్చుకుపోవాలి. వాటిచోటు అదే. అవి అక్కడే పదిలంగా వుంటాయి. నండూరివా రన్నట్లు "గుండె గొంతుకలోన కొట్లాడుతుంది". గుండె చప్పుళ్లు గొంతు పలకాలి.

# శ్రీశ్రీలో అలంకారికత

ఆర్వీయార్

అలంకారికత అంటే ఉపమారూపకాది సర్వాలంకార పద్ధతులనూ యిముడ్చుకున్న విధానం. దీన్నే యింగ్లీషులో Imagery అంటారు. Imagery అన్న పదానికి తెలుగులో 'భావచిత్రణ' అని వాడుకలోకి వచ్చింది. Imagination భావుకత అయినట్లుగా. యీ రెండూ తప్పే. భావుకత అంటే Sensibility. యేమాత్రం ప్రేరణకైనా చలించడం. Imagery అంటే అలంకార పూర్వకమైన చిత్రణ. ఉపమా, రూపకాది అలంకారికతతో ఒక భావాన్ని, ఒక ఉద్రేకాన్ని, చిత్రించడం, అందివ్వడం.

ఉపమారూపకాది అలంకారికవిధానమే అయితే మనకు కొత్తకాదుకదా, మల్లియరేచన నాటినుంచీ జాగ్రత్తచేసిన తాటాకు పుస్తకాల్లో వుంది అనేవాళ్లున్నారు. అన్నీ మనిషి భూమ్మీద పుట్టిననాటినుంచీ వున్నాయి మనదేశంలో. అంచేత యీగొప్పతనాన్ని కాదనే సాహసం వుండకూడదు. తాటాకు పుస్తకాల్లోవున్న లాక్షణిక పాండిత్యానికీ, ఆధునికుల అవగాహనకీ వున్నతేడా యిదే; లాక్షణికులది శాస్త్రం, ఆధునికులది కళ; వాళ్ళది పాండిత్యం, ఆధునికులది రసచర్చ. దీనికి తెలుగులో వివరణ యిస్తే చాలదా. యింగ్లీషు పదాన్ని తీసుకొచ్చి కుప్పుస్వామయ్యర్ మేడ్ డిఫికల్ట్ చెయ్యాలా అనవచ్చు ఆధునిక విమర్శనలో పాశ్చాత్య ప్రభావమే యెక్కువ వుంది కాబట్టి ఆ పదాలకి అర్థం తెలుగులో వెదకడమే యీ వివరణ. తెలుగులో వున్న లాక్షణిక సంప్రదాయానికి వివరణకాదు.

యీ అలంకారిక పద్ధతి భాషలో సహజంగా వున్నదే. నిప్పులాంటి మనిషి, బెల్లంకొట్టిన రాయిలా పడివుండటం, మూర్తీభవించిన శోకంలాంటిది. కాని నిత్యవాడకంలో యివి తుప్పుపట్టిపోయా యన్నమాట. అంటే శక్తివిహీనంగా తయారవుతున్నాయన్న మాట. మరికొత్త అవసరాలకి, కొత్తప్రేరణ యివ్వడానికి పాతపద్ధతి సరిపోదు. అందుకని యెప్పటికప్పుడు కొత్తకొత్త పోలికలూ రూపకాలూ పుడుతూ వుంటాయి. 'రాకెట్‌లా దూసుకుపోవడం' యిటీవల వాడుకలోకి వచ్చిందే. మామూలు జీవితంలో భాషకులోతైన అలంకారికత వుండదు. యెందుకంటే సామాన్యంగా ప్రజాబాహుళ్యం వాడుకచేసే భాష వ్యాపారవతు కాబట్టి. కవిత్వం అలాకాదు. ఉద్రేకభరిత

మైంది. ఆవేశ ప్రధానమైంది, అనుభూతి గాఢత కలిగింది. యీ లక్షణాలకనువైన భాష కవిత్వానికి వుంటుంది. అలాగే ఆలంకారికతానూ, కవిత్వంలో మాటలు కవి అనుభూతికి సంకేతాలు. అలంకారాలు కవిభావనకు లభించే రూపాలు.

సంగీతం భాషకతీతమైన అనుభూతిని రేకెత్తించగలదు. చిత్రకారుడు కుంచెతో రంగుల్తో తన హృదయంలోని ఆర్తికి రూపం యివ్వగలడు. కవి మాటలతోనే తన ఆవేశాన్ని వెల్లడించాలి. తన ఉద్రేకానుభూతులను యెంత నిశితంగా మాటల్లో నింపగలడో అంత గొప్పకవి అవుతాడు. యీ పద్ధతికి అలంకారికత దోహదం చేస్తుంది. ఎన్నో పేజీల వివరణ యివ్వలేని అనుభూతిని ఒక చిన్న అలంకారం యివ్వగలుగుతుంది. యీ పద్ధతి కవిహృదయుడైన ప్రతి ఒకనికీ స్వతహాగానే వస్తుంది. కవి అనే వాడికి నేర్పలేనిదీ, నేర్వలేనిదీ యీ ఆలంకారికతే.

ఆలంకారికత కవిత్వంలో వాతావరణం సృష్టించడానికీ, ఒక మూడ్ నిర్మించడానికీ, ఒక ఉద్రేకాన్ని సూటిగా పాఠకునిలో రేకెత్తించడానికీ అవసరం. ఆలంకారికత లేకుండా కవి తన అనుభూతిని వ్యక్తం చెయ్యలేడా అంటే నిర్దిష్టంగా చెయ్యలేడనే చెప్పాలి, నిశితంగా అనుభూతి పాఠకునికి అందదనే చెప్పాలి. ఆలంకారికత లేకపోతే అది కవిత్వం కాకపోవచ్చు. ఉదాహరణకు శ్రీ శ్రీ "గతమంతా తడిసె రక్తమున/ కాకుంటే కన్నీళులతో" అన్నప్పుడు ఉద్రేకభరితంగా చరిత్రస్థితి పాఠకునికి అందుతుంది. 'గతంలో యెన్నో యుద్ధాలు జరిగాయి. యెంతో మంది చచ్చిపోయారు. పూర్వం అంతా కొట్లాటలే. అవన్నీ కొంతమంది స్వార్థంకోసం జరిగినవే, కాబట్టి గత చరిత్రలో గొప్పదనం అనేది అశాంతిలోనే వుంది' అంటూ వద్దురాస్తే అదికవిత్వం కాదు. యిలాంటి వివరణాత్మక రచన మేధావ్యాపారం అవుతుంది కాని హృదయ సంబంధికాదు. అంచేత ఆలంకారికత కవిత్వంలో ఒక ప్రధానమైన ప్రయోజన నిమిత్తం కవి వాడుకచేస్తాడు అలా అని కేవలం అలంకారాలు గుప్పించడమూ కవిత్వం కాదు తీరికూర్చుని కవి అలంకారాలు నిర్మించవచ్చును. అలా 'నిర్మించే' అలంకారాలు 'క్వారీ' పనిలో రాళ్ళు చప్పుడైనట్టు 'ధ్వని' యెంతేనా కలిగివుండచ్చు. యింత 'ధ్వని' అయింది కాబట్టి యెంతో గొప్ప కవిత్వం వుందని భ్రమిసే ప్రమాదమూ వుంది. యిలా తెలివిగా అలంకారాలు కూర్చడం పాఠకునికి కవి ఉద్రేకాన్ని యేమీ అందివ్వదు. పైగా తీర్గా యీ అలంకారాల చిక్కులు విడదీసుకుని విషయం బోధపరచుకొనేసరికి పాఠకుడి తాడుతెగుతుంది. యిలాంటి learned, ingenious

అలంకారాల వాడకాన్నే Dr Johnson 'Metaphysical' అన్నాడు. ఉదాహరణకి 'ఆముక్తమాల్యద' వుంది. సమాస కాఠిన్యమూ, వ్యవహారదూరమైన భాషా యెలా వున్నా, గ్రీకుబొమ్మల కండరాల్లా అలంకారాలు చేవదేరివుంటాయి బట్టలకొట్లలో పెట్టే బొమ్మల్లా (mannequin) వుంటాయి. యిలా కవి మేధాపరిశ్రమో ద్భూతాలుగా వుండి కవి ఆవేశంలోంచి మెరుపులు మెరిసినట్లు రాకుండా వున్నప్పుడే 'అలంకారం' శాస్త్రమైపోయింది. ఆ ట్జీ బ్రా లా తయారైంది. యీ ఛాయలకొస్తే contempt of court కింద కేసుపెడతారేమోనని చాలామంది చురుకైన ఆధునిక యువకులు రసచర్చ చెయ్యడంలేదు.

ఆలంకారికతను పరిశీలించడమంటే శయ్య, రీతీ ధ్వనిలాంటి వాటిని స్పృశించడం కాదు. ఒక అలంకారం అర్థాంతర సంక్రమిత వాచ్యధ్వనా, కావ్యలింగమా అన్న వ్యర్థచర్చాకాదు. యీ ఆలంకారికతకూ కవి ఉద్రేకానికీ వున్న బాంధవ్యం యేమీటి ? కవిలో యీ విధానం యేమి తెలియచేస్తున్నది ? కవి ఆలోచనా ధోరణికీ అతని ఆలంకారికతకూ వున్న సంబంధం యేమిటి ? కవి దృక్పథంతోటి అతని ఆలంకారికతకు, లేదా ఒక కవి ఆలంకారికతకూ అతని దృక్పథానికీ వున్న సంబంధం యేమిటి ? మొత్తంమీద ఒక కవి గ్రహించిన ఆలంకారికతకూ, కవి వ్యక్తిత్వానికీ యేమైనా దగ్గరా? అన్నచర్చే ఆధునికుల ఆలంకారికతను గూర్చిన చర్చ.

ఒక కవిగ్రహించే ఆలంకారికత అతని భావననీ, అతని మానసికస్థితినీ, అతని ఆలోచనాక్రమాన్నీ, అతని వ్యక్తిత్వాన్నీ తెలియజేస్తుంది అది కావ్యలింగాలంకారం కానీ; అపహ్నుత్యాలంకారంకానీ మరోటికానీ (చరిత్రలో తారీఖుల్లా, అన్నంలో రాళ్ళల్లా, యీ అలంకారాల nomenclature మంట పుట్టిస్తుంది. కాబట్టి సామాన్యంగా 'ఆలంకారికత' అని వాడుకోవడమే మంచిది) ఉదాహరణకు తిలక్ "నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన అమ్మాయిలు" అన్నప్పుడు తిలక్ వ్యక్తిత్వం ప్రస్ఫుటమౌతుంది. తిలక్‌లోని లాలిత్యం వెల్లడి అవుతోంది. (యిలాంటి పోలికలు తేకూడదా అన్నదికాదు యిక్కడి ప్రశ్న. యిలాంటి ఆలంకారికత యేం తెలియజేస్తుందీ అన్నదే సందర్భం) సకృత్తుగా, ఒకటి రెండుచోట్ల వాడిన ఆలంకారికత మాత్రమే కవి వ్యక్తిత్వాన్ని తెలియచెయ్యకపోవచ్చు. కాని ఒక కవిలోని ప్రాచుర్యమైన ఆలంకారికత తప్పకుండా కవి వ్యక్తిత్వానికి దర్పణం. కవి ఆలోచనాక్రమానికి ప్రతిబింబం. కవి దృక్పథానికి ఛాయ. కవి ఆలోచనా విధానానికీ, అతని ఆలంకారికతకూ వున్న సంబంధం ఒక మనిషి తీసుకునే ఆహారానికీ, అతని ఆరోగ్యానికీ వున్న సంబంధం లాంటిదే.

శ్రీశ్రీలో యెలాంటి ఆలంకారికత వుంది? యిది యెంతవరకూ శ్రీశ్రీ దృక్పథాన్ని తెలియజేస్తుంది? శ్రీశ్రీని ఒక నవ్యరీతికి ఆద్యునిగా ఒక యుగానికి కర్తగా అతని కవిత్వం యెలా నిలబెట్టింది? అందులో శ్రీశ్రీ ఆలంకారికత పాత్రయెంత?

ఒక కవికివున్న భావుకత అతని కవిత్వపు గంభీరతను సంతరిస్తుంది. అతని శిల్పం అతన్ని ఉన్నతుణ్ణిచేస్తుంది. అతనితాత్త్విక పునాది అతన్ని యుగకర్తనుచేస్తుంది. ప్రస్తుతచర్చ వీనికి సంబంధించింది కాదు. శ్రీశ్రీలోని ఆలంకారికతను గూర్చి, కాబట్టి శ్రీశ్రీలో అతని అలంకారికత యేమి తెలియజేస్తుంది? శ్రీశ్రీ దృక్పథం యేమిటి? శ్రీశ్రీ వ్యక్తిత్వానికీ అతని ఆలంకారికతకూ వున్న సంబంధం యేమిటి? అన్న పరిశీలన మాత్రమే. "మహాప్రస్థానం" లోని 'గీతాల' కు పరిమితమై యీ చర్చసాగించడం సౌలభ్యం కోసమేనని గమనించాలి.

'మహాప్రస్థానం' గేయంలో ఉద్రేకపూరితంగా "మరోప్రపంచం" పిలిచిందని ఆనందాతిరేకంతో, వెర్రి ఆవేశంలో పాడతాడు. యీ మరోప్రపంచం యేమిటి అన్న దానికి యిక్కడ జవాబులేదు. మరోప్రపంచపు కంచునగారా మోతలో, అగ్నికిరీటపు ధగధగలో యీ ప్రశ్నలు వినబడనూలేదు. ప్రశ్నించేవాళ్ళు కనబడనూలేదు. ఆ తర్వాత తాను ఊహించిన, కలగన్న మరోప్రపంచానికి ఓరూపూ ఆకారమూవచ్చాయి. "స్వాతంత్ర్యం / సమభావం / సౌభ్రాత్రం / సౌహార్ధం / పునాదులై ఇళ్లులేచి / జనావళికి శుభంపూచి—" కాంతీ, శాంతీ జయించి 'నిజమైన', 'ఋజువైన', 'స్వప్నమే', 'స్వర్గమే' ఆ మరోప్రపంచం. 'కార్మికలోకపు కల్యాణమూ', 'శ్రామికలోకపు సౌభాగ్యమూ' ఆ మరోప్రపంచపు ఆశయాలు. "వ్యధార్థ జీవిత యధార్థ దృశ్యం / పునాదిగా...." జనింపబోయే సమాజమది. "ఒకవ్యక్తిని మరొక్క వ్యక్తీ / ఒకజాతిని వేరొకజాతీ / పీడించే సాంఘిక ధర్మం" యికపై చెల్లని సమాజమది. "మరోప్రపంచాన్నే" తన ఊహలలో నిర్మించుకుని, ఆ కలలకు రూపం లభించడం కమ్యూనిజంలోనని తెలుసుకున్నప్పుడు శ్రీశ్రీ కమ్యూనిష్టు అయాడు. తన 'మరోప్రపంచాని'కీ కమ్యూనిజానికీ అభేదమని గ్రహించే శ్రీశ్రీ కమ్యూనిష్టు అయాడు. తన ఉద్రేకంలో కమ్యూనిష్టు భావనను కలిగివున్నాడు కాబట్టి. కమ్యూనిష్టు సమాజాన్ని—లేదా కమ్యూనిష్టు సమాజం లాంటిదాన్ని— తాను కోరుతున్నాడు కాబట్టి కమ్యూనిష్టు అయాడు. కమ్యూనిజంలో తన మరోప్రపంచాన్ని చూస్తున్నాడు కాబట్టి కమ్యూనిష్టు అయాడు. "మహాప్రస్థానం"గేయం నాటికి శ్రీశ్రీకి మార్క్సిజం తెలియదనే విషయం యిక్కడ గమనించాలి. కమ్యూనిజంలో తన కలలు ఫలిస్తాయని నమ్మి కమ్యూనిష్టు లయాడు.

అదే కవిగా కమ్యూనిజంలోకి దూకడం. (శ్రీశ్రీ emotional level లో— యింకా చెప్పాలంటే sentimental level లో కమ్యూనిష్టు. సైద్ధాంతికంగా కాదు.) తన మరో ప్రపంచాన్ని కమ్యూనిజంలో దర్శించాడు కాబట్టి ఒకపునాది—శాస్త్రబద్ధమైన సిద్ధాంత బలంగల దాన్ని— తన కవిత్వానికి యేర్పాటు చేసుకున్నాడు. తన ఉద్రేకాన్ని కమ్యూనిజంలో నింపాడు. యీ విషయాన్ని అవగాహన చేసుకోలేని వాళ్ళే శ్రీశ్రీ మరో ప్రపంచం అంటే కైలాసమనీ వల్లకాడనీ వక్రభాష్యం చెప్పడం.

యీ మరోప్రపంచ భావన శ్రీశ్రీ వూపిరి. మార్క్సిజం తెలియక ముందు నుంచీ శ్రీ శ్రీ కి యీ తపనవుంది. ఆమాటకొస్తే కవులందరూ ఊహాస్వర్గాన్ని (utopia) నిర్మించుకుని, లేదా ప్రజల విశ్వాసాల్లోవున్న స్వర్గాన్ని నమ్ముకుని, యీ లోకాన్నుంచిపారిపో ప్రయత్నించినవాళ్ళే. యీలోకానికీ, కవులకీ "తూకం సరికుదరక" పోవడమనేది ఆదినుంచీ వుంది. భావకవులైతే స్వర్గంలో స్థలాలే కొనుక్కుంటారు- 'దిగిరాను, దిగిరాను, దివినుండి భువికి' అని కృష్ణశాస్త్రి అక్కడే పీఠంవేస్తాడు. "నా నివాసమ్ము తొలుత గంధర్వలోక" మని కృష్ణశాస్త్రి భావకవుల ప్రతినిధిగా పాడతాడు. యీతరహా వాళ్ళంతా యీ భూమ్మీంచి ఎగిరి.... "సకల దిశాంతరాళ / మెల్లెడల నెందుకో పర్వులెత్తి" పోతారు. ప్రేయసితో, లేదా ప్రేయసికోసం— అదీ వూహల్లోని ప్రేయసి!— అన్వేషిస్తూ పోవడం యింకా తియ్యగావుంటుంది. అలా యీ లోకాన్నుంచి పలాయనం చిత్తగించి, తమతమ కలల్లో విహరించి, యీలోకాన్నే విస్మరించేవాళ్లు కాబట్టి భావకవులకు కవిత్వం తమ ఊహాస్వర్గాలకు నిచ్చెన అయింది. తదనుగుణంగా లలితమైన, మృదువైన భావనా, అలంకారికతా, కవిత్వమూ వాళ్ళకు అబ్బాయి. యిలా స్వర్గంలోకి వెళ్ళేవాడు "ఖడ్గమృగోదగ్రవిరావం / ఝంఝూనిల షడ్జధ్వానం" వింటే "మూడ్" అంతా చచ్చి వూరుకుంటుంది. జీవితంపట్లా కవిత్వం పట్లా ఒకడికివున్న అభిప్రాయాలను బట్టేవాడి కవిత్వస్థితి వుంటుంది. శ్రీశ్రీకి భావ కవులకంటె భిన్నమైన దృక్పథం వుంది. తను కాంక్షించేది మరోప్రపంచమే. తాను యీలోకంతో పొత్తుకుదుర్చుకో లేకపోయినమాటా నిజమే. అంతమాత్రంచేత తాను పలాయనాలు చిత్తగించడు. యీ "నిరాశామయ లోకం" నుంచి పారిపోడు. కృష్ణ శాస్త్రిలా యేడుపులో తననితాను మర్చిపోడు. "మనసారగా నేడ్వనీరున్న"ని లోకాన్ని తిట్టిపొయ్యడు. శ్రీశ్రీ కర్తవ్య ఉన్ముఖుడై 'కదనశంఖం' పూరిస్తాడు. "నిన్నవదలిన పోరాటం / నేడు అందుకొనక తప్పదు" అని కృతనిశ్చయంతో రంగంలోకి వస్తాడు. శ్రీశ్రీకి యీ లోకంలోనే స్వర్గం ఋజువౌతుంది. స్వర్గం యెక్కడోలేదు. "అన్నీ

ఒక్కడికి / అంతమందికి అన్నీ / అదే స్వర్గమంటాను / ఆ స్వర్గం వేరే కడు / దూరంలేదు లేదు / ఈడే నేడేవున్నది / నీలోనాలో వున్నది" అని స్వర్గం యీభూమి మీదిదేనంటాడు. యిలాంటి 'భౌతిక' స్వర్గాన్ని కృష్ణశాస్త్రి ప్రాణంపోతే వొప్పుకుంటాడా ? శ్రీశ్రీది భౌతికపునాది, కృష్ణశాస్త్రికి కల్పన పునాది. అందుకనే యీకవుల తత్త్వం, వీళ్ళకవిత్వ తత్త్వం యింత విభేదపూరితమైంది. "కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ. ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ" అని చెలం కరెక్ట్‌గా చెప్పాడు. తనబాధ ప్రపంచానికి బాధ చేసేవాడు భావకవి; ప్రపంచపు బాధ తాను అనుభవించేవాడు అభ్యుదయ కవి. యీ అభ్యుదయ తత్వం శ్రీశ్రీకి అబ్బడానికి కారణం అతని సాంఘిక చైతన్యమే (Social awareness). సాంఘిక చైతన్యం కలవాడు కాబట్టే తన రచనలలో "లోకం ప్రతిఫలించాల"నీ, తన "ఆకాశాలను / లోకానికి చేరువుగా" తేవాలనీ, తన ఆదర్శాలను అందరూ పంచుకొనే వెలుగుల రవ్వలజడి చెయ్యాలనీ తపించాడు.

యీ భౌతిక దృష్టే శ్రీశ్రీ కవిత్వాన్ని తీర్చింది ఓ లక్ష్యమూ, ప్రయోజనమూ యేర్పరచింది. "కావున— లోకపు టన్యాయాలూ / కాల్చే ఆకలి, కూల్చే వేదన, దారిద్ర్యాలూ, దౌర్జన్యాలూ / పరిష్కరించే, బహిష్కరించే / బాటలుతీస్తూ / పాటలువ్రాస్తూ / నాలోకదిలే నవ్యకవిత్వం" కార్మిక లోకపు కల్యాణానికి సమర్పిస్తాడు. "శ్రమైకజీవన సౌందర్యమే" అన్నిటినీ మించింది. సహస్ర వృత్తులూ, సమస్త చిహ్నాలూ అతని నీతికీ, రీతికీ ప్రాణం. "నాజాతి జనులు పాడుకొనే / మంత్రంగా" తనగీతాన్ని మ్రోగించాలని అతని తపన. 'ప్రతిజ్ఞ' శ్రీ శ్రీ కవిత్వపు మానిఫెస్టో అయితే 'కవితా! ఓ కవితా!' శ్రీశ్రీ కవిత్వ వ్యక్తిత్వపు వివరణ.

శ్రీశ్రీకి వున్న యీ భౌతిక దృక్పథమే, శ్రీశ్రీకి వున్న సాంఘిక చైతన్యమే శ్రీశ్రీని అభ్యుదయ వాదిగా చేసింది. "కదిలేదీ, కదిలించేదీ / మారేదీ, మార్పించేదీ / పాడేదీ, పాడించేదీ / పెనునిద్దుర వదిలించేదీ / మునుముందుకు సాగించేదీ / పరిపూర్ణపు బ్రతుకిచ్చేదీ" నవకవిత్వమయింది. అందుకనే శ్రీశ్రీలో లలితమైన, మృదువైన ఊహలూలేవు, మత్తెక్కించే కవిత్వమూలేదు. హృదయ సంబంధపు సుకుమారమైన భావనలూ, రోగిష్టి మమతలూ శ్రీశ్రీలో కాగడావేసినా కనిపించవు. Lyrical element ను బహిష్కరించడంలోనే వుంది శ్రీశ్రీ నవ్యత. చాలామంది "శైశవగీతి" లలితమైన గేయం అనుకుంటూ వుంటారు. పిల్లల నుద్దేశించింది కాబట్టి అలా అనుకుంటూ

వుండవచ్చు. "శైశవగీతి"లో కూడా లలితమైన (lyrical) చిహ్నాలులేవు. శ్రీశ్రీ లోని అప్రతిహతమైన ఆశావాదం వుంది. శ్రీశ్రీలోని లోతైన భావుకతవుంది. "కంచు వృషభముల అగ్నిశ్వాసం", "ఊరుపులు కదిలేగాలికి కబళము", "వైతరణీనది లోతులు" లాంటి పదప్రయోగాలు లలితమైన పదసంచయం కాదు.

యీ మరోప్రపంచ కాంక్షకీ. భూమ్మీదే స్వర్గం నిర్మించే ఆశకీ ఆధారభూతమైన "ప్రపంచపు బాధ అంతా" శ్రీశ్రీకి ముందరినుంచే వుంది. 'మహాప్రస్థానం' గేయానికి ముందే 'జయభేరి' గేయంలో "నేను సైతం / ప్రపంచాగ్నికి / సమిధనొక్కటి ఆహుతిచ్చాను" అని తన 'వ్యక్తిని' ప్రపంచమంతా విస్తరించాడు "నేను సైతం / ప్రపంచాబ్జపు / తెల్లరేకై పల్లవిస్తాను / ...... భువన భవనపు / భావుటానై పైకిలేస్తాను" అనేటంతగా ప్రపంచంతో కలిసిపోయాడు 'అవతారం' ఖండికలోని "పుడమి తల్లికి / పురిటినొప్పులు" కొత్తసృష్టిని తెలియచేస్తాయి. 'జ్వాలాతోరణం'లో పుడమికి పుట్టినరోజే వస్తుంది. 'అభ్యుదయం' లో "జగమంతా బలివితర్ది" అవుతుంది. 'ఐ'లో లోకాలు తన "మహోద్రేకాలు", 'ఆశాదూతలు'లో "ఒకడుదీధికి", "లోకాలు ఘూకాల దాకాలతోనించి" పోతాడు. 'ఒక్క క్షణంలో' "సకల జగం / సరభసగమనంతో...." ఎక్కడికో! 'శైశవగీతం'లో పిల్లలదే "సమస్తవిశ్వ"మూనూ. పిల్లలే "లోకపు భాగ్యవిధాతలు". తన కాంక్షకు ఆచరణరూపమైన రష్యాని "సర్వ ప్రపంచం అంతటానీపై" గొడుగు నీడల్ని సాధించమంటాడు. దుఃఖంలో, కసితో "దొంగలంజా కొడుకులసలే మెసలే ధూర్తలోకం" అని తిడతాడు. 'దేశ చరిత్రలు' ఖండిక ప్రపంచ చరిత్ర అంతా కన్నుల కట్టిందే. "రణరంగం కానిచోటు భూ / స్థలమంతా వెదకిన దొరకదు" అని గత చరిత్రలోని 'ఔన్నత్యమంతా' ఉద్రేకభరితంగా చూపెడతాడు. 'వ్యత్యాసం'లో "ముందుకు పోతాం మేము / ప్రపంచం మా వెంటవస్తుంది" అని ఉత్సాహంగా ప్రపంచాన్ని తోడుతీసుకు వెడతాడు. తన "ఆకాశాల"ను కూడా "లోకానికి చేరువగా" చెయ్యాలనే ఆవేదన పడతాడు 'జగన్నాథుని రథచక్రాలు "భూమార్గం" పట్టించి, భూకంపం పుట్టిస్తాడు. అఖరికి "ఈలోకం మీదేనండి! మీ రాజ్యం మీరేలండి" అని పతితులనూ, భ్రష్టులనూ ఆహ్వానించి 'లోకా'న్ని అప్పగిస్తాడు.

ప్రపంచ దృక్పథమంత విశాలమైందే శ్రీశ్రీ జీవిత దర్శనం కూడానూ. మానవ జీవితమౌలిక సమస్యలే శ్రీశ్రీ ఆలోచనల్లో విస్తరించి వుండేది. ఒక ప్రత్యేక

సంఘటనా ప్రేరిత కృతులు అనేవి కేటాయింపుగాలేవు. ''గర్జించురష్యా''లాంటివి ఒకటి, రెండు లేవనికాదు. అవికూడా ఒక నిర్దిష్టసంఘటనా ప్రేరితమైనవైనా ఒకకవిత్వ సత్యాన్ని abstract చేస్తున్నవే. ఓ పంచాయితీ సమితిలో ఎరువుల కుంభకోణం, ఓ ఎలెక్షన్‌లో ఓ మోతుబరి దురంతాలు— యిలా సంఘటనాత్మకమైనవన్న అర్థంలో శ్రీ శ్రీ లో లేవు. (యిలా ఒక్కొక్క సంఘటనకు చలించి కవిత్వం చెప్పడంలోని తప్పొప్పుల చర్చకాదిది.) సంఘటనల— వ్యష్టిగాగాని, సమష్టిగాగాని— ప్రభావం శ్రీశ్రీమీద వుండలేదని కాదు. జీవితం అనే అగ్నిలో కాలి శుద్ధి అయిందే అనుభవం అంతాను. ఒక అనుభవాన్ని, ఒక సంఘటనోద్భూత ప్రేరణని, కవి ఆలోచనా విధానంలో కడిగి పునీతం చేసితీసిన నిగ్గు అతని కావ్యం. శ్రీశ్రీ ఎన్ని ప్రేరణలకు స్పందించినా యెన్ని ఉద్రేకాలకు లోనయినా అతనిలో కనిపించేది జీవితమౌలిక సత్యాల దర్శనమే. క్రియాశీలుడు కాబట్టి, ప్రయోజనాన్ని కాంక్షించేవాడు కాబట్టి యీప్రపంచాన్ని మార్చ ప్రయత్నించే అభ్యుదయ కవి అయ్యాడు. "చావు పుట్టుకల" పొలిమేరలలోనే అతని ఆలోచనలు. "నిజంగానే నిఖిలలోకం / నిండుహర్షం వహిస్తుందా?" అనేదే అతని ఆవేదన "భూకంపాలు, ప్రభుత్వ పతనాలు / విప్లవం, యుద్ధం" లాంటి సర్వప్రపంచాన్ని పీడించే సమస్యలే అతని సమస్యలు. '' లోకపు టన్యాయాలూ / కాల్చే ఆకలి, కూల్చే వేదన / దారిద్ర్యాలూ, దౌర్జన్యాలూ'' అతణ్ణి వ్రేల్చే సమస్యలు. వీటిని పరిష్కరించడమే అతని కవిత్వ ఆశయం. 'మానవుడా!' అన్న ఖండిక శ్రీశ్రీ మనస్సులో విస్తరించిన ఆలోచనలకు రూపం.

శ్రీ శ్రీ కి కాలంకూడా ప్రపంచ భావన అంత విస్తారమైనదీ, జీవితమంత లోతైనదీనూ. కవిగా తన ''గుండెల కొండలలో / మ్రోగును మార్మోగును / హంటా హంటి పరుగెత్తే / యుగాల రథనాదం'' పేదల జీవితం చిత్రిస్తూ 'నీడలు' ఖండికలో ''యుగయుగాల దోపిడిలో / నరనరాల రాపిడిలో'' పొగచూరిన బ్రతుకులంటాడు. పేదలది ''తరతరాల రోదన''. పిల్లలకోసం 'శైశవగీతి' లో ''ఇవాళలాగే ఎప్పుడు కూడా / ఇనబింబం పయనించు నింగిపై! / ఎప్పుడు కూడా ఇవాళలాగే / గాలులు వీచును, పూవులు పూచును'' అంటాడు ''వచ్చేనాళ్ళ విభాప్రభాతములు'' పిల్లల హాసంలో మెరుగులు తీరుతాయి. యీ 'వచ్చేనాళ్లు' అనంతమైనవి. ఋతువులుకూడా వస్తూపోతూనే వుంటాయి కాలగతిలో. 'అద్వైతం' లో ''కాలానికి కళ్ళెం వేస్తా''మని అంటాడు. (''మహాప్రస్థానం'' సంకలనంలోకంటే ఆ తర్వాత వెలువడిన రచనల్లో 'కాలా'నికి సంబంధించి చర్చించవలసింది యెక్కువ వుంది).

భౌతిక పునాదితోకూడిన ప్రపంచదృష్టి, జీవిత సమస్యల విచికిత్సా శ్రీశ్రీ వ్యక్తిత్వంలో జీర్ణించివున్నవి. మార్క్సిస్టు సిద్ధాంతం తన సందేహాలను తీర్చగలదిగా కనుపించింది. తన మరోప్రపంచ దృక్పథానికి రూపు రాగలదు అనిపించింది. తనలో వుండే కవిత్వాగ్నిని ఒక లక్ష్యసిద్ధికి అంకితం చేసాడు, ప్రపంచానికి అభ్యుదయం కాంక్షించాడు. ("అభ్యుదయ పరంపరాభివృద్ధిగా" మన ప్రాచీనులందరూ కవిత్వం చెప్పారు. ఆ అభ్యుదయం ప్రపంచానికీ ప్రజలకీ కోరికల్లోనే. యిక్కడ ఓ విషయం గుర్తుచెయ్యడం అప్రస్తుతం కాదేమో. శ్రీశ్రీ పి. ఇ. ఎన్ (P. E. N.) క్లబ్బులో తన సభ్యత్వానికి రాజీనామా యిస్తూ "మానవమాత్రుడినైన నాకు మహోన్నతాలైన మీ ఉత్తమాదర్శాలను అందుకోవడం కష్టంగా వుం"దని రాశాట్ట. దీనికి వివరణ అవసరమా?)

యింత అభ్యుదయ కాముకుడు కాబట్టే శ్రీశ్రీ ఒక యుగకర్త కాగలిగాడు. మార్క్సిస్టు అయినంత మాత్రాన అభ్యుదయాన్ని కవిత్వంలో చొప్పించినంత మాత్రాన మహాకవీ, యుగకర్తా అయ్యాడా ? అలా అయితే చాలామంది కవులు మార్క్సిస్టులుగా వున్నారే, కవిత్వంలో అభ్యుదయం నింపేశారే. వాళ్ళంతా మహాకవులేనా ? కమ్యూనిష్టులే కవులైనకేసులూ వున్నాయి. వీళ్లది ఓ మెట్టుపైనే అవ్వాలి కదా! యిలాంటి ప్రశ్నలుత్పన్నమయే మాట నిజమే ఒక సిద్ధాంతాన్ననుసరించినంత మాత్రాన కవికి మహత్వంరాదు, పదిమందీ అంగీకరించిన సిద్ధాంతమైనంత మాత్రాన యుగకర్తకాడు. మరి శ్రీశ్రీ యెలా అయాడు? శ్రీశ్రీకిగల భౌతికవాదదృష్టీ, పురోగమనశీలతా ఒక పునాది మాత్రమే. యీ పునాదిపైలేచిన శ్రీశ్రీ కవిత్వమే అతణ్ణి ఆకాశమంత యెత్తు తీసుకుపోయింది. ఒకడు తన విశ్వాసాలనూ, నమ్మకాలనూ యెంతశక్తివంతంగా emotionalise చెయ్యగలడో అంతటి గొప్పకవి అవుతాడు ఒక అనుభూతిని రక్తకేశనాళాల్లోకికూడా ప్రసరింపచేయగలశక్తి శ్రీశ్రీకి వుంది మనస్సులోని సన్నని చీకటి మూలలకుకూడా వ్యాపించగల పరిశీలన శ్రీశ్రీకి వుంది. పాఠకుడు మళ్ళీ ప్రశ్నించకుండా తనతో యీడ్చుకపోగల బలంవుంది. మెరుపులా, దూసుకుపోయే కత్తుల్లావుండే ఆలంకారికత వుంది.

'ఐ' అన్న ఖండికలో తాను స్మరిస్తే పద్యం అరిస్తే వాద్యం అనిచెప్పి "అనల వేదికముందు అస్రనైవేద్యం" అంటాడు. యీ 'అస్రనైవేద్యం', అదీ 'అనలవేదికముందు; శ్రీశ్రీలోని విప్లవ తత్వాన్ని ప్రతిబింబిస్తుంది. "ఎగిరి........ సలసల కాగే చమురా

కాదిది / ఉష్ణరక్తకాసారం''. అంటూ విలయతాండవ వాతావరణాన్ని సృష్టిస్తాడు. ''ఉష్ణరక్తకాసారం'' శ్రీశ్రీయే చూడగలడు, చూపించగలడు. ''ఇంకిన, తెగిపోయిన, మరణించిన / క్రొన్నెత్తురు! విపంచికలు! యువయోధులు!'' అని పోరాట స్వరూపాన్ని కళ్ళముందు కట్టిస్తాడు. చావుపుట్టుకల పొలిమేరలలో ''ఆవులించె నొక చితాగ్ని కుండం'' అంటాడు. చావుపుట్టుకల పొలిమేరలలో కూడా తన విప్లవభావనే. చితాగ్ని కుండం ఆవులించడం యెంత గుండెల గజగజలాడించే కల్పనో! ద్రోహాలనూ, దోషాలనూ తుడిచిపెట్టడానికి ''యినుపడేగ'' యెగురుతుంది. ''మంట పంట'' పండుతుంది. ''ఆకాశదీపం'' అన్న ఖండికలో ఒక దురదృష్టజీవి ఆరిపోయిన సన్నివేశ చిత్రణ వుంది. ఆ దురదృష్టజీవికీ అతనిగదిలో వెలిగే ప్రమిదలోని దీపానికీ సమానాత్మకత రూపం చేస్తాడు కవి. గదినిండా ''చినుకులవలె చీకట్లు'' అని చీకటిని వర్ణిస్తాడు. చీకట్లు చినుకుల్లా యెలా వుంటాయో వూహించుకో వలసిందే. యీ అనుభూతి సంకేతమే యీ ఆలంకారికత. దీపాన్నివర్ణిస్తూ ''చీకటిబోనులో సింహములా నిలుచున్నది / కత్తిగంటుమీద నెత్తుటి బొట్టులాగున్నది'' అంటాడు. యెవరేనా కత్తిగంటుమీది నెత్తుటి బొట్టు ప్రమిదలోని దీపంలా వున్నదంటాడు. కాని శ్రీశ్రీ దాన్నితిరగేస్తాడు. యిది శ్రీశ్రీ భావతీవ్రతకు సాక్షి. యీ మానసికస్థితి (mood) కవిదీ, పాఠకునిలో కలిగేదీకూడా, అనిర్వచనీయం. కవితాదేవత ప్రసన్నతకోసం విశ్చల సమాధిలో తపస్సమీక్షణలో శ్రమించి, ఆ కవిత సాక్షాత్కరించి నప్పుడుకూడా అసామాన్యమైన అనుభూతులే శ్రీశ్రీకి కలిగింది. ''అగ్ని సరస్సున వికసించిన వజ్రము! / ఎగిరే లోహశ్యేనం / ఫిరంగిలో జ్వరం ధ్వనించే మృదంగనాదం!'' యివీ శ్రీశ్రీకి కనిపించిన దృశ్యాలూ, వినిపించిన భాష్యాలునూ. వజ్రం కనిపిస్తే కవితాసతి సాక్షాత్కారానికి మంచి ఫలితమే లభించిందని అనుకోవచ్చు. కాని యిది మామూలుగా కనిపించడం కాదు. ''వికసించిన వజ్రము?'' వజ్రం వికసించడమేమిటి? యిదేమైనా పువ్వా? అదీ ''అగ్నిసరస్సున!'' యీ వూహ శ్రీశ్రీకి తప్ప మరొకడికి వస్తుందా? 'లోహశ్యేనం' యెగురుతూండగా శ్రీశ్రీకాక మరెవరు చూడగలరు? ఫిరంగి పేలితే భయంవేస్తుంది. కొంచెం సరసుడైన యుద్ధప్రియుడైతే ఫిరంగిమోత భేరీనాదంలా వుందనవచ్చును. కాని ''ఫిరంగిలో జ్వరం ధ్వనించే మృదంగనాదం''— యింతటి భయదమైనదాన్ని శ్రీశ్రీయే రూపొందించగలడు. 'కవితా! ఓ కవితా!' గేయంలో శ్రీశ్రీ విన్నవీ, కన్నవీ చిత్రవిచిత్రమైనవి, అనన్యసామాన్యమైనవి వున్నాయి. ''శిశువు చిత్రనిద్రలో ప్రాచీనస్మృతులూచే చప్పుడు'' శ్రీశ్రీ మాత్రమే గ్రహించగలడు. యిందులో శ్రీశ్రీకి కూడా పునర్జన్మ సిద్ధాంతంమీద గురికుదిరిందని భుజాలెగరేసే జడబుద్ధులు,

నిశితమైన శ్రీశ్రీ భావుకతా ప్రతిధ్వనిని యిందులో యెలా వినగలరు? "ఉన్మాది మనస్సినీవాలిలో/ఘూకంకేకా, భేకంబాకా / ఉరితీయబడ్డ శిరస్సు చెప్పిన రహస్యం". యెవడికైతే గుండెలోని సిరలూ, ధమనులూ రక్తాన్నికాక కవిత్వాన్ని సరఫరా చేస్తున్నాయో వాడే వినగలడు, వినిపించగలడు యివి.

ఋతువర్ణన చాలామంది కవులు కాళిదాసునుంచీ ఆనవాయితీగా చేస్తున్నారు ప్రబంధాల్లో. పగ్గాలు వేసినట్లు, ఋతువర్ణనలు వేసడమే ఓ క్వాలిఫికేషన్. యింతటి 'చరిత్ర' కలిగిన ఋతువులను శ్రీశ్రీకూడా వర్ణించాడు 'శైశవగీతి'లో పదిపాదాల్లో ఆరు ఋతువులనూ వర్ణించాడు. "ఋతువుల రాణీ వసంతకాలం / మంత్రికవాటం తెరుచుకునీ / కంచు వృషభముల అగ్నిశ్వాసం / క్రక్కే గ్రీష్మం కదలాడీ......" అంటూ ఋతువర్ణన సాగుతుంది. యిలాంటి చోట్లే కవి గొప్పదనం బయలుపడేది. గతంలో యెవరూ ముట్టుకోని విషయమైతే సరిపోల్చి గొప్పదనం నిర్ణయించే పేచీయే రాదు. పోటీవున్నప్పుడే గొప్పతనం తెలిసేది. గ్రీష్మంలో "పలికిన నోరెల్ల పొక్కు" నంతటి యెండగావుం:ని అన్నాడు నన్నెచోడుడు. "ఎసగు కట్టావిక్రియ నావిరెగ"సినట్లుగా గ్రీష్మాతపం వుండన్నాడు రాయలు, "ఆకాశమును భూమి, యగ్నిపత్రము వ్రాసి / కొన్నట్లు సుడిగాఁమన్ను రేగె"నన్నాడు శి॰ప్రకవి సమ్రాట్టు విశ్వనాథ కాని శ్రీశ్రీ అంతటి వ్రంగా గ్రీష్మాన్ని యెవరూ వర్ణించలేదు. "కంచువృషభముల అగ్నిశ్వాసం క్రక్కే గ్రీష్మ"మది. పొగరెక్కిన వృషభాలు పందెంలో కక్కే శ్వాస అందరికీ పరిచయమే. ఆ పరిచయమాత్ర విషయంతోటే యీ చిత్రాన్ని రూపుకట్టించుకోగలడు పాఠకుడు. వృషభం అదీకంచుది. అది కక్కే శ్వాసం, మామూలు శ్వాసం కాదు, అగ్నిశ్వాసం. కంచువృషభం అగ్నిశ్వాసం కక్కినట్లుంది గ్రీష్మం. యిక్కడ కూడా విచిత్రమేవున్నది. సామాన్యంగా అందరూ చూసేది అనుభవించేదీ గ్రీష్మాన్ని. కంచువృషభాన్ని. అది అగ్నిశ్వాసం కక్కుతూవుండడాన్నీ యెవ్వరూ చూడ్డం సాధ్యపడదు, ఒకవేళ యెవడేనా చూడ్డం తటస్థిస్తే 'మండు వేసవిలోని యెండలా వుందిది' అనుకోవచ్చు. అంతేగాని మండు వేసవిలోని యెండ కంచువృషభాల అగ్నిశ్వాసంలా వుందని, పోలిక తీసుకువచ్చే వస్తువునే పాఠకునిచే వూహింపచేసి, తర్వాత దానితో పోలికతేవడం శ్రీ శ్రీ కే సాధ్యమవును. శ్రీ శ్రీ లోని భావతీవ్రత తెలియచేస్తుందీ విధానం.

సూటిగా దూసుకుపోయే అలంకారికతతో పాఠకుడికి బొమ్మలరూపు కట్టిస్తాడు. "యంత్రభూతముల కోరలు" తోమి నలిగిపోతున్నారు కార్మికధీరులు. "లోహరాక్షసుల

పదఘట్టనచే" కనలుతున్నారు అభాగ్యులు యీరెంటిలోనూ పెట్టుబడిదారీ నాగరికత లోని విషపుచిహ్నాలు కనిపిస్తాయి. "భిక్షువర్షీయసి" లోని ముసిల్ది "ఆరిన కుంపటి విధాన" వుంది "పక్కనున్న బండరాతి / పగిదిగనేపడి వున్నది." యింత దీనమైనదీ ముసిలిదాని అవస్థ. "బాటసారి"కి "రాత్రినల్లని రాతిపోలిక / గుండెమీదనె కూరుచుం" టుంది రాత్రి నల్లగాకాక— వెన్నెల రాత్రయితే తప్ప— ఎఱ్ఱగా వుంటుందా?, తెల్లగావుంటుందా! రాత్రినల్లని రాతిపోలిక వుండటం పెద్దగొప్పగా యేమీలేదు. గొప్ప తనం యెక్కడుందంటే నల్లనిరాయి గుండెమీద కూర్చున్నట్టుందనడంలో, రాత్రినల్లని రాయిలావుందీ అంటేకాదు. నల్లనిరాయి గుండెమీద కూర్చున్నట్టుంది. భయదవాతా వరణ సృష్టికి మెరుపులా వచ్చిన ఆలంకారికత యిది. 'జగన్నాధుని రథచక్రాల"లో దీనులూ, పతితులూ "శనిదేవత రథచక్రపు/టిరుసులలోపడి నలిగిన"వాళ్ళు. శనిదేవత చేత పీడించబడిన వాళ్లుకాదు; శనిదేవత రథంవుంది, ఆ రథానికి చక్రాలున్నాయి; ఆ చక్రాల యిరుసులలోపడి నలిగినవాళ్ళు. యింతకన్న దుస్థితి యేముంటుంది దుస్థితి కల్పనకు శ్రీశ్రీ యిచ్చిన ఆలంకారికత శ్రీశ్రీలోని లోతైనబాధని వ్యక్తం చేస్తోంది. "వ్యధార్త జీవిత యథార్థ దృశ్యం / పునాదిగా యిక జనించబోయే / భావివేదముల జీవ నాదములు" తాను జగత్తుకంతా చవులిస్తాడు. 'వేదము' లనడంలోని సొంపును వివరించ నక్కర్లేదు. అలాగే "పుష్కిన్, గోగోల్........ కార్మిక స్వర్గాన్ని కలగన్నరష్యా!" అని రష్యాని కీర్తించేటప్పుడు 'కార్మిక స్వర్గం' అంటాడు "మార్క్స్, ఏంగెల్స్ మహాప్రవక్తలై / లెనిన్ తపస్సు / స్టాలిన్ సేద్యం" ఫలించి రష్యాను నిర్మించాయి. మార్క్స్, ఏంగెల్స్‌లు ప్రవక్తలు. సర్వమతాల్నీ మత్తుమందు చేసేవని కొట్టిపారేసిన వీళ్ళు ప్రవక్తలు! ఎన్నడూ చర్చి మొహమేనా చూడని లెనిన్‌ది తపస్సు! కవిత్వ పరంగా ఆమహనీయున్ని యింతకంటె గొప్పగా స్మరించడం ఎలా వీలవుతుంది? కవి త్వపు నాడి కొట్టుకొనేవాడికి వీటిని వివరించాల్సిన పనిలేదు. తానూ "చిరదీక్షా శిక్షా తపస్సమీక్షణలో" కవితా దేవతకోసం ఆరాటపడ్డాడు పిల్లలు "పరమాత్ములు" అంటాడు. 'బాటసారి' కన్నుమూసినప్పుడు తల్లికి "పీడకలలో పేగుకదులు" తుంది. ఒకజాతి వాడుకలోని భాషా సంప్రదాయాలు అర్థంచేసుకుని. జీర్ణించుకున్నవాడు యింత కంటె సున్నితంగా తన హృదయాన్ని విప్పలేడు కవిత్వంలో. శ్రీశ్రీ పాతపట్టుకు వదల్లేదనీ, పరమాత్మ లనడంవల్లా, ధనంజయు లనడంవల్లా నవ్యకవిత్వానికి రౌర వాది నరకాల్లోపడే పాపం చుట్టుకొందనీ అనుకొనేవాళ్ళ కవిత్వ అనుభూతికి జోహా ర్లివ్వడం మేలు.

శ్రీ శ్రీ కి తరచూ రక్తం, నెత్తురు, అగ్ని, నిప్పులు, చితులు, బాకులు, ఘూకాలు, ఘూకాలబాకాలు, యినుప డేగలు, విలయాన్వితమైన సముద్రం, కొమ్ములు, కొమ్ములకున్న కన్నులలాంటి అలంకారికతే వస్తూవుంటుంది "ఆః!" అనే చిన్న ఖండికలో "నిప్పులు చిమ్ముకుంటూ" తాను నింగికెగిరిపోతేనూ, "నెత్తురు క్రక్కుకుంటూ" నేలకు రాలిపోతేనూ వచ్చే రియాక్షన్ చిత్రిస్తాడు. 'నిప్పులు', 'నెత్తురు' ఉన్నతికీ, పతనానికీ వుద్దేశించినవి నిప్పు తో తప్ప ఉన్నతిని సూచించ లేదా? యిది శ్రీ శ్రీ తత్వం. తనగదిలో ఒక్కడూ భయంతో కూర్చున్నప్పుడు "ఇరవైరకాల............ కర్కాటక కర్కోటకులో?" అని భయోత్పాతంగా వర్ణి స్తాడు. 'గర్జించు రష్యా'లో "సుప్తకంకాళాలు మేలుకొంటున్నాయి/ప్రపంచం పడగెత్తి బుసకొట్టిలేచింది" అంటాడు. సుప్తకంకాళాలు మేలుకొనేస్థితిని వూహించుకోవాల్సిందే. 'ఆశాదూతలు'లో "ఒకడు తూరుపు దిక్కునకు" "స్వర్గాలు కరిగించి / ... ... / రగి లించి రక్తాలు...."పోతాడు. రక్తం రగిలించడం శ్రీశ్రీకి చాలా అభిమానపాత్రమైంది. వీర రసస్ఫోరక సందర్భాలు కాబట్టి యీరక్తాలూ, బాకులూలాంటి అలంకారికత వస్తుం దనుకున్నా. 'కేక', 'అద్వైతం', 'ఒకరాత్రి' లాంటి తావుల్లో కుదరదు. "నిద్రకు వెలియై ... / నేనొక్కడినై .... గుండెల కప్పిన కుంపటితో", గదిలో వున్నానంటాడు. "నాకనుగోనల, / నాయెదగోడ / నాలుగుదిక్కుల బాకులతో.... / బాకుల తోటల బాటలతో" చిక్కుకున్నానంటాడు. ఒంటరిగావున్నాడు, యేదో భయద వాతావరణంలో వున్నాడు కాబట్టి ఆ తీవ్రతకుతగ్గ బాకులూ, బాకుల తోటలూ యిక్కడ వచ్చాయనుకో వచ్చును. కాని 'అద్వైతం'లో "నీతలపున రేకులువూస్తే / నావలపున బాకులుదూస్తే" అత్యద్భుతాలు సాధిస్తామంటాడు. వలపున బాకులు దుయ్యడం యేమిటి! "ఆకాశపు ఎడారి / లోకాళ్ళుతెగిన / ఒంటరి ఒంటెలా / గుంది జాబిల్లి" ఓరాత్రి, అని శ్రీశ్రీ అనుకున్నప్పుడు బహుచక్కగా చెప్పాడని భుజంతట్టేవాళ్లు యేమి చక్కదనాన్నిందులో చూస్తున్నారు? యిదివరకెవరూ యిలా చెప్పలేదు, యిలా వూహించలేదనే మట్టుకే వాళ్ళపొగడ్త. "కాళ్ళుతెగిన ఒంటరి ఒంటెలాగుంది జాబిల్లి" అనడంలో శ్రీశ్రీ వ్యక్తి త్వం. శ్రీశ్రీ విలక్షణత్వం ప్రస్ఫుట మౌతోంది.

విలక్షణంగా వుండాలనే శ్రీశ్రీ యీ ఆలంకారికత గ్రహించాడా? కాకపోతే యెందుకు? నారాయణబాబు నక్షత్రాలు మశూచికం కుండలాల్లాగా వున్నాయన్నాడు. యిది విలక్షణంగా వుండటం కదా. మరి శ్రీశ్రీకీ నారాయణబాబుకీ ఒకే రకమైన విల క్షణత కదా. అనే సందేహాలు సహజంగా వస్తాయి. ఒకకవి కొత్తకల్పనలు యెన్నైనా

చెయ్యవచ్చును. అంతమాత్రంచేత ఒరిగేది యేమీవుండదు. కాని రచయిత హృదయ పరిపాకాన్నిబట్టి అతని రచనరూపు తీసుకుంటుంది. ఉదాహరణకు తిలక్ నారాయణ బాబులా నక్షత్రాల్ని వర్ణించగలడా? అది గొప్పదనీకాదు. ఆ గొప్పదనం తిలక్‌కు రాదనీకాదు. తిలక్ వ్యక్తిత్వానికే అది వ్యతిరేకం. నారాయణబాబులోని వైయక్తిక తత్వాన్ని అతని విలక్షణమైన ఆలంకారికత తెలియచేస్తుంది. శ్రీశ్రీలోని విప్లవ తత్వాన్ని శ్రీశ్రీ ఆలంకారికత తెలియచేస్తుంది.

ఉద్రేకాల ఉప్పెనలు కడిచిం తర్వాత 'వ్యత్యాసం' అన్న ఖండికలో కూల్‌గా చెబుతాడు, "మాకు గోడలులేవు. / గోడలను పడగొట్టడమే మాపని. / అలజడి మా జీవితం / ఆందోళ మా వూపిరి / తిరుగుబాటు మా వేదాంతం" అని. యీ తిరుగుబాటు తత్త్వమే 'మహాప్రస్థానం' లోనూ వుంది, 'కవితా! ఓ కవితా!'లోనూ వుంది— యీ గేయ సంకలనమంతా వుంది. అంటే మార్క్సిజం తెలిసాక శ్రీశ్రీ తెచ్చిపెట్టు కున్నది కాదిది; ముందరినుంచీ వున్నదానికి మార్క్సిజం తెలిసాక ఓ లక్ష్యశుద్ధీ, ఓరీతీ వచ్చాయి అంతే. మార్క్సిజం తెలియకుండా వుండివుంటే యీ మహా ఉద్రేకి, యీ 'నడిచే అగ్నిపర్వతం' యీ పిడుగుయేమై, యెలా పరివర్తించివుండేదీ యిప్పుడు వూహించుకోవాల్సిందే.

శ్రీశ్రీ ఆలంకారికతలో ప్రస్ఫుటమయ్యేది శ్రీశ్రీ విప్లవవ్యక్తిత్వమే సందాకో. విలక్షణంగా వుండాలనో వచ్చిన ఆలంకారికత కాదిది. మరో ప్రపంచపు భావనలో, విప్లవ తత్త్వంతో దీప్తమైంది. శ్రీశ్రీ వ్యక్తిత్వం. ఆదీప్తినుంచి పెంపొందిందీ ఆలంకారికత. కవిత్వంలో అలంకారాలు మేధా పరిశ్రమకు నిగ్గుగా, కవిత్వం ఒక మేధావ్యాపారం అయినప్పుడు శ్రీశ్రీ హృదయస్థానాన్ని కవిత్వంలో గుర్తింపచేసాడు. ఒకప్లాను ప్రకారం శ్రీశ్రీ తెచ్చిపెట్టుకున్నది కాదీ ఆలంకారికత. తన గుండెల్లో మండే అగ్ని పర్వతాల పేలుళ్లు శ్రీశ్రీ గేయాలు. తన ఆవేశపు ఉష్ణత యీ గేయాలు. వస్తుతహ అలాంటి తత్వంకలవాడు కాబట్టే 'మాటల యీటెలు' దొర్లాయి. తాను అలాంటి "వైప్లవ్యగీతం" కాబట్టే చెలం చెప్పినట్టు, "నెత్తురూ, కన్నీళ్ళూతడిపి కొత్త tonic తయారుచేశాడు శ్రీశ్రీ యీ వృద్ధప్రపంచానికి".

# విప్లవ సాహిత్యంలో కవిత్వానికి గల స్థానం

కె. వి. రమణారెడ్డి

మన దేశంలో అనాదినుంచీ కవిత్వానికిగల గుర్తింపుగానీ గౌరవంగానీ ఇతర సాహిత్యరూపాలకు లేవు. నిజానికి ఇది గొప్పవిషయ మేమీకాదు. పైపెచ్చు, మన వెనకబాటుతనానికి మరో నిదర్శనం మాత్రమే. కవిని చూచిన కంటితో కథకుణ్ణిచూస్తే మొత్తబుద్ధేస్తున్నదని మన పాఠకుల పక్షంగా పాత సామెతను మార్చి రాయవచ్చు. మరీ ఇటీవలికాలంలోనే కథకులకు, ఆతర్వాత నాటకకర్తలకు, ఇంకా చివర వ్యాసకర్తలకు సంఘం దృష్టిలో ప్రాముఖ్యం వుంటున్నది. కొన్ని కొన్ని సాహిత్యరూపాలకు ఇప్పటికీ సరైన, సమమైన, మన్నన ఏర్పడలేదన్నా, అబద్ధంకాబోదు.

భావోద్రేకం మూలధనంగా కవిమాత్రుడు చేసే అక్షర వ్యాపారంలో కీర్తి ప్రతిష్ఠలు సునాయాసంగా లాభిస్తున్నాయంటే అందుకు కారణం, పాఠకుడి మనస్సును నేరుగామీటే సౌకర్యం కవిత్వానికి అధికతరం కావడమే. కథకుడిలా వాస్తవానికి అంటిపెట్టుకుని మట్టిపురుగులా పాకి దేకి పోనక్కర్లేకుండా, పాత్రలద్వారా వ్యాఖ్యల ద్వారా తన భావాలను పరోక్షంగా పాఠకుడికి చేరవెయ్యనక్కర్లేకుండా, స్వీయాత్మక ధోరణితోటి వాస్తవాన్ని రంగరించి తనదర్శనాన్ని నేరుగా అందించగలుగుతాడు కవి. అయితే ఆదర్శనానికి తాను విధేయుడై మెలగకతప్పదు. దానికి తానెంత విధేయుడై మెలగుతాడో అంత Poetic sincerity ని సమకూర్చుకుంటాడు. తన అనుభూతికి పూర్తిగా రాని విషయాన్ని కావ్యీకరింప జూచినప్పుడు, ఇట్టే దొరికిపోతాడు. కవిత్వంలో Subjective element ముఖ్యమని చెప్పనవసరంమేలేదు అది కవిత్వానికి ప్రాణస్థానం.

Subjective element పేరు చెప్పుకుని స్వీయాత్మక ధోరణిని వ్యక్తివాదంగా వక్రీకరించే ప్రమాదం కవిత్వానికి చాలా ఎక్కువ. లోకవాస్తవంతోటి, ప్రజల అనుభూతులతోటి స్పర్ధించి, ఉటోపికల్టైతనమే వ్యక్తి విశిష్టత అని దుర్భ్రమజెందడంకూడా కద్దు. ఇది తాత్వికంగా సమర్థనీయమైన వైఖరికాదు. వ్యక్తివాదం శుద్ధ అరాజకవాదంగా ముదిరేటట్టే, స్వీయాత్మకధోరణి ముదిరినప్పుడు కవిత్వం లోకసంగ్రహాన్ని విస్మరిస్తుంది. దంతప్రాకార సిద్ధాంతం ఇలా వెలువడిందే. సింబాలిజం, ఇమేజిజం, డాడాయిజం, సర్రియలిజం— బూర్జువా కళాసిద్ధాంత సౌధంలో ఒకదానిపైన మరొకటిగా

పరుసదీరిన ఈ క్లైణ్యతాసోపానాలన్నీ కవి–వ్యక్తిని సంఘ–వ్యక్తినుంచి దూరంచేసి నట్టివే. ఈరెండు వస్తువులకు వీలైనంత ఎక్కువ సంపర్కాన్నీ సాన్నిహిత్యాన్నీ సమకూర్చడమే విప్లవ కవిత్వం లక్ష్యం. సంఘజీవితమూ కవి స్వీయానుభవమూ పెనవేసుకొని. ఒకదానినుంచి మరొకటి ఉత్సాహాన్నీ ఉత్తేజాన్నీ పొందాలంటే, కవి అనుభవం వైయక్తిక విలక్షణతను పోగొట్టుకోకుండానే సంఘంలోని ఇతర వ్యక్తుల మనోనుభవాలను తనలో సంలీనం చేసుకోగలగాలి. కవి స్వీయానుభవానికి సాంఘికమైన మొక్కట్లు బలంగావుంటేనే తప్ప, సంఘవాస్తవం నుంచి తాను కావ్యోద్రేకం పొంది లదనుగుణంగా కావ్యరచన చేస్తేనేతప్ప, తనకావ్యం ఇతరవ్యక్తుల మనస్సులను సరిగా మీటలేదు. ఇలా చూసినప్పుడు, కథకుడి కెలాగో కవికీ అలాగే సంఘజీవితం తల్లి ఒడిలాంటిది; సంఘవాస్తవం బడిలాంటిది. కలలుకూడా వాస్తవజన్యాలైనట్టే. కవిత్వం కూడా వాస్తవనిబద్ధ మౌతుంది. కథకుడు మట్టిపురుగైతే, కవి తూనీగకంటె అధికుడేమీకాడు. ఆతగాని 'దివి'కూడా ఈ 'భువి'కి నకలే. ప్రక్రియాభేదాన్ని బట్టే. శిల్పభేదాలు.

సాహిత్యపరంగా వచనం కంటె ఎంతో ముందునుంచీ ప్రముఖంగా వుంటూ వస్తూన్న కవిత్వం, ఇప్పుడుగాకున్నా సమీప భవిష్యత్తులోనైనా అంతరించక తప్ప దేమోనని పాశ్చాత్యదేశాల విమర్శకులు ఆందోళన వెలిబుచ్చుతున్నారు. ఆ దేశాలలోనే ఈ భయసందేహాలు పొటమరించడం గమనించదగింది. ఎందుకంటే, అక్కడ కవిత్వమనేది దాదాపు పూర్తిగా అధ్వాన్నపు అడవిగా పరిణమించింది. తన మనోకుహరంలో కవి ముడుక్కుపోయాడు. పరిసరాలనుంచి తనమీద తానే బహిష్కార శిక్ష విధించుకున్నాడు. స్వీయానుభూతుల అంతు జూసేందుకని గమ్యంలేని ప్రయాణంలో సంతృప్తిదొరకని ప్రయాస ననుభవిస్తున్నాడు. తన కావ్యసంకేతాలు మరెవరికీ అంతుబిక్కనివిధంగా పూర్తిగా వైయక్తికం కావడంతో, వాటి అర్థావబోధ నానాటికీ తరుగుతూంది. భావమరుభూములు నాగరకతా నైష్ఫల్యాన్ని సూచిస్తున్నాయి. వన్యమృగాల కేకలు కావ్యవస్తువులుగాకున్నా శీర్షికలౌతున్నాయి. తన దేహచర్మదుర్గంలోపల తానొక ప్రవాసి అవుతున్నాడు కవి. మానవలోకాన్నే అతను నిరాకరిస్తున్నాడు. విప్లవ కవికి ఇలాంటి పరిస్థితి negative example కాకతప్పదు.

Positive example ఏదైనట్టు? 'చద్దికూడు తిన్నమ్మ మగడాకలి ఎరగద'ని ఒక సామెతవుంది. రష్యాదేశపు కవిత్వం మొత్తంగానే అలా లేకపోయినా ఎక్కువగా

అలానేవుంది. ఎవ్‌తుషెంకో, వోజ్‌నెన్స్కీ, అక్మటోవాలాంటి కవుల్లో— వీళ్ళంతా కొత్తతరం కవులకిందే లెక్క— అధికార ధిక్కారవైఖరి ఏదోమోతాదులో ఏదో రూపంలో ఇంకా మిగిలేవుంది. విప్లవానికి ముందు రష్యాదేశంలో కవిత్వం, విప్లవానుకూలమైన కవిత్వం, ఇలా చెట్టుచేమల గురించీ, రుతువుల అందచందాల గురించీ, పిల్లలగురించీ పిట్టలగురించీ, ఇలా కడుపులో చల్లకదలని చందంగా వుండేదికాదు. బ్లాక్, మయాకోవస్కీ, పాస్టర్నాక్ లాంటి పేరుబడిన కవులవెనక వేనవేల కంఠాలు ప్రళయ ఝంఝా ప్రభంజనం లాంటి విప్లవానికి స్వాగతగీతికల్లా సంఘర్షణనీ పోరాటాన్నీ కీర్తిస్తూ వర్ణించేవి. వర్గవైఖరి ఆ కవిత్వానికి ప్రాణవాయువుగా వుండేది. శ్రమజీవుల దృక్పథం దాన్ని కత్తివాదరగా మార్చేది,

ఏ దేశంలోనైనా పోరాటాల ఆరాటాల రుతువంటూ ఒకటి వున్నప్పుడు, ప్రజాశ్రేయస్సును ఉపలక్షించే సాహిత్యం యావత్తూ పాక్షికంగా పరిణమించక తప్పదు. పాక్షికమైనా కాకపోయినా, లోకజీవనానికి సాక్షిగానిలిచే సాహిత్యంలో, అనుభూతి తీవ్రతవల్ల కవిత్వమూ చిత్రణాబలంవల్ల వచనమూ తమతమ ఆధిక్యాన్ని స్థాపించుకుంటాయి. అసందిగ్ధమైన తాత్విక దృక్పథం వాటిని ఉజ్జ్వలింపజేస్తుంది. ఇంగ్లాండులో ఛార్టిస్టు ఉద్యమకాలపు కవిత్వాన్నిగానీ జర్మనీలో 1848 విప్లవకాలపు కవిత్వాన్నిగానీ గమనిస్తే నిబద్ధత (Commitment) అనేది సాహిత్యపరులలో విజాయితీపరులకు చివరకు పథ్యాహారమైనా కాకుండా దినసరి ఆహారమని తెలిసివస్తుంది. మార్క్స్, ఎంగెల్సుల ప్రియమిత్రుడైన జర్మన్‌కవి ఫ్రిగిలార్త్ గురించి ఆ ఇద్దరూ రాసిన మాటలనుబట్టిచూసినా, నిబద్ధతవిషయమై ఆమహాపురుషుల అభిప్రాయాన్ని తెలుసుకోవచ్చు

ఇజాలను రోయించుకొనే రోజులు తెలుగు కవులకు ఇప్పుడిప్పుడే వెనకబడుతున్నాయిలాగుంది. బాలగంగాధర తిలక్ మరికొంతకాలం జీవించివుంటే తనవెంబడి ఎందరు అర్భకులైన కవులను అందం–ఆనందం లోకపు పొలిమేరలు దాటించి తీసుకుపోయేవాడో తెలియదుగాని, ఇటీవలి ఉగాది కవిసమ్మేళనంలో ఆరుద్ర అన్నట్లు, మళ్లీ "రాజకీయ చైతన్యం రసమయగీత మవుతున్నప్పుడు" ఇప్పుడు, కవులు కొత్తదుస్తులు ధరిస్తున్నారు. బృహన్నలకైనా కిరీటిగా అవతరించక తప్పని ఉత్తరగోగ్రహణం ప్రారంభమైంది. ప్రజలను పాలకవర్గం కురుసేనలా తనవెంట లాక్కుని పోతున్నది. నయవంచన రాజనీతిజ్ఞతగా చలామణి అవుతున్నది. గోమాయువులు గోవేషం ధరించారు. అభంశుభం తెలియనిప్రజ నేరుగా బందెలదొడ్డిలోకి వెళ్ళి చేరుతున్నది. చెక్కలు

ముక్కలైపోయిన వామపక్షాలు దిక్కుతోచని పరిస్థితిలో పడుతున్నాయి. చెదురుమదురు సాయుధ పోరాటాలుగానీ అదురుబెదురులాంటి సాయుధచర్యలుగానీ కలిగించవలసినంత ప్రజాప్రబోధాన్ని ఇంకా కలిగించలేదు. పాలకవర్గంలోనే కుమ్ములాట సాగి ఒకపక్షం మరొకపక్షాన్ని పీటీమున్ను కలిపించడంలో, సోషలిస్టు శుష్కనినాదాలకు మనస్సులను నిలువుదోపిడీ పెట్టుకున్న ప్రజలపాత్ర ఎంతైనావుంది అయితే చివరకు యథాపూర్వ దారిద్ర్యంతో మిగిలిపోయేదీ ఆ ప్రజలే. కాబట్టి ఈ పరిస్థితిలో ప్రభువర్గాల కపట సోషలిజం ముసుగును చీలుస్తూ దాని బూర్జువా స్వభావాన్ని ప్రజలకుచూపిస్తూ పోరాట మార్గానికి మరలించడంకంటె విప్లవకవులకు గొప్పబాధ్యత మరేదీలేదు.

"అభ్యుదయ" కవులమంటూ ఇటీవలికాలంలో ముందుకు వస్తున్న అవకాశ వాదులతో విప్లవ కవులమైన మనకు ఈ అంశంలోనే మౌలికమైన భేదంవుంది. ఈనాడు విప్లవకవుల కొలబద్ద ఒక్కటే అభ్యుదయాన్ని దాని నకిలీసరుకు నుంచి విడదీసి చూపేదిగా వుంటున్నది.

విప్లవ కవికీ వట్టి 'అభ్యుదయ' కవికీ ప్రధానమైన భేదం "అభ్యుదయ కవి సోషలిస్టు నినాదాలను నోటబెడుతున్నప్పటికీ, అతని తలనిండా ప్రజాతంత్రపు" బూజు నిండిపోయింది రాజకీయంగా అతడు సాయుధపోరాటాలతో సరేసరి, తీవ్రమైన వర్గ పోరాటాలతో కూడా మనస్ఫూర్తిగా సహానుభూతి పొందలేదు. వర్గసామరస్యం. సంఘప్రశాంతి, సోషలిజానికి శాంతియుత పరివర్తన— అతని భావసౌధానికి ఇవి పునాదులు. ప్రభుత్వ దౌర్జన్యాన్నీ వర్గహింసనూ అతడు గమనించడు. గమనిస్తే కొన్నికన్నీళ్లు ఒలికిస్తాడు. మహా అంటే నిరసన పత్రాలమీద సంతకం పెడతాడు. కళ్ళముందు జరిగే పోరాటాలు అతని దృష్టిలో 'హింసారిరంస' మాత్రమే. తాను 'మానవతావాది'నంటూ మానవుల యధార్థజీవితాల క్షోభనుమాత్రం అతడు దాటివేస్తాడు. చచ్చినా అతడు బూర్జువా జాతీయవాదం గిరిదాటి బయటకురాడు. 'అభ్యుదయ' కవి అంటే మరెవరోకాదు— శ్రామిక మహోద్యమంలోకి చొరబారి వచ్చి తిష్ఠవేసుకున్న బూర్జువా భావధోరణులకు సాహిత్యప్రతినిధి.

మరి విప్లవ కవికిగూడా ఇంకా మధ్యతరగతి నుంచేకదా పాఠకులు ఎక్కువగా వస్తూంటం? అలాంటప్పుడు కావ్యవస్తువు ఏదైనా, కావ్యభాషగానీ రీతిగానీ ఎలా మార్పు చెందుతుంది?

శ్రామికవర్గానికి బాగా బోధపడాలంటే, కవిత్వం జానపద బాణీలను స్వీకరించ వలసి వస్తుందని నేననుకోను. ఆ బాణీలలోనే నేటి విప్లవ కవిత్వం యావత్తూ ఒదగ గలుగుతుం దనుకోవడం కూడా భ్రమేననిపిస్తుంది. సినిమా పాటలకు పామరజనంలో కూడా ఉన్న ఆదరణను గమనించి నట్లయితే, ఈ జానపద బాణీవాదం నిలవదు. పైగా, ఆ బాణీతోబాటు భాషనుకూడా ప్రయత్నపూర్వకంగా మలచుకోవలసి వుంటుంది. ప్రజల వాగ్వ్యవహారంతో గాఢమైన సంబంధం వుంటేనే తప్ప ఇది సాధ్యంకాదు. అంతేగాక, వర్తమానకాలపు జీవితాన్ని కావ్యీకరిస్తూ జానపద బాణీల మూసలలో పొయ్యడమంటే, వెనకబాటుతనాన్ని కొనితెచ్చుకోవడ మౌతుంది. అట్లని జానపదబాణీ నిషిద్ధమేమీకాదు 'ఝంఝ' సంకలనంలో శివుడురాసిన గేయం 'నరుడా! భాస్కరుడా!' అనేది ఎంతో దక్షతతోచేసిన కావ్యప్రయత్నం. అంత దక్షతావుండి చేస్తేనే ఇలాంటి ప్రయత్నాలు నెగ్గుతాయి. ఆ దక్షత లేనప్పుడు, మామూలు వచన గేయం శరణ్యం కాక తప్పదు

వచన గేయమైనా కృతకృత్యం కావడానికి ఏదో ఒక లయ అనివార్యమౌతుంది. పాదాది అక్షరనియమ మొక్కటే సాదావచనాన్ని వచనగేయంగా నిలబెట్టలేదు. అంత్య ప్రాసకూడా ఆపని చెయ్యలేదు. ప్రతి నిజమైన కావ్యానికీ ప్రాణమూలమైన భావోద్రేకం, ఆ వుద్రేకాన్ని పాఠకుడికి చేరవెయ్యడంలో కవి చేబట్టే ఉపాయాలు, వచన గేయం మేలుకీడులను కూడా నిర్ణయిస్తాయి. విప్లవ కవిత్వంలో వచన గేయానికే ఇంత వరకూ ఎక్కువ ఆదరణ వుంటున్నది. గ్రాంధిక పదాలను వాడినప్పుడు కవులు చేస్తున్న భాషాదోషాలు వ్యావహారిక పదాలను వాడేప్పుడు ఎదురుకావడం లేదంటే వచన కవిత్వానికీ వ్యావహారిక భాషకూ మధ్యగల బాంధవ్యం తెలిసివస్తుంది. అలాగే సంకేతాల విషయంలో కూడా. లోకుల అనుభవంనుంచి, లేదా జాతీయ సంప్రదాయం నుంచి కవి స్వీకరించిన సంకేతాలను పాఠకుడు చప్పున బోధపరుచుకోగలుగుతున్నాడు కాని స్వకపోల కల్పితాలైన సంకేతాలు చూచి అయోమయం పాలౌతున్నాడు. చెప్ప దలచుకున్న విషయాన్ని సూటిగా వాడిగా చెప్పినప్పుడు కవి పొందిన అనుభూతిని తానూ పొందగలుగుతున్నాడు అర్థాన్ని పదాలలో దూర్చి పకడ్‌బంద్‌చేసి గోప్యంగా సూచనగానైనా చెప్పబూనుకున్నప్పుడు తికమకపడుతున్నాడు. కవిత్వ పాఠకులు ఈ రోజుల్లో జనసామాన్యం లోంచికూడా వస్తున్నారని గ్రహిస్తే, కవి కొండమీది కోతి చందంగా కూర్చోడు. ప్రజలకు వాదోడు కాదలచిన విప్లవకవి అలా కూర్చోగూడదు కూడా.

ప్రయోగ పరత్వాన్ని విప్లవ రచయితల సంఘం ఆహ్వానిస్తుందేగాని వెళ్లదరమదు. ముఖ్యంగా కవిత్వం విషయంలో గతానుగతికత్వం ఎంగిలికూటితో సమానం. అయితే ఈప్రయోగపరత్వం ప్రయోజనశూన్యమైన వెర్రి వెదుకులాటగా, 'దినకొత్త' వ్యవహారంగా పరిణమించగూడదు. మాటలన్నీ పాతవే అయినా ఒకమాటను మరో మాటతోటి అనుసంధానించే పద్ధతి ఎప్పటికప్పుడు, ఏ కవికి ఆ కవిది కొత్తగా వుంటుంది. కొత్తగా వుంటుంది కాబట్టే పాఠకుణ్ణి ఆకర్షిస్తుంది విప్లవకవులు భావ ప్రకటన విషయంలోనేగాక శబ్దసంయోజన విషయంలోకూడా ప్రయోగాలుచేసి చూపుతున్నారు.

ఇప్పటివరకు కవులు ఎవరికోసం రాస్తున్నారంటే, ఇతర కవుల కోసమేనని చెప్పాలి. ఈస్థితిపోవాలి. కవిత్వ పాఠకులు ఇతోధికంగా ప్రజల్లోనుంచి రాగలిగిన స్థితిలోనే విప్లవకవిత్వం తాను ఆశించిన ప్రయోజనాన్ని సఫలం చేసుకోగలుగుతుంది. Poetry readings లాంటి పద్ధతులను పెద్దపెద్ద పట్టణాలలోనూ బస్తీలలోనూ అనుసరిస్తే ఎలాంటి ఫలితాలుంటాయో చూడాలి. ఫేక్టరీ కూలీలుగానీ, పల్లెల రైతులుగానీ– కనీసం వాళ్ళలో బాగా చైతన్యం పొందివున్న వాళ్ళైనా– కవిత్వపఠనాన్ని ఎలా ఆదరిస్తారో చూడాలి. వచన గేయమైనా ప్రజాసామాన్యాన్ని ఉద్బోధించి కార్యోన్ముఖుల్ని చెయ్యడానికే అయినప్పుడు మంచిపాట, మంచి బుర్రకథ స్థానాన్నిగాక పోయినా, మంచి ఉపన్యాసం స్థానాన్ని అది పొందగలిగితే చాలు. ప్రకటనలనీ, ఉద్ఘాటనలనీ, నినాదాలనీ అనవచ్చుగాక, ఇలాంటి కవిత్వంలో వాటిస్థానం వాటికివుంది.

విప్లవ కవిత్వం కృతార్థం కావాలంటే, అది విప్లవాశయానికీ విధేయమై వుండాలి, కవిత్వగుణానికీ విధేయమై వుండాలి. ఇది అక్షరాలా కత్తిమీద సామే।

[విప్లవ రచయితల సంఘం, వరంగల్ శాఖ ఏప్రియల్ 9న నిర్వహించిన కవితాగోష్ఠికి ప్రధాన కార్యదర్శి పంపించిన ప్రసంగ వ్యాసంలో భాగాలు]

# ఇంకా నా...

అత్తలూరి నరసింహారావు

అప్పుడే వీధి దీపాలు వెలిగాయి. అప్పటివరకు పొలాలు దున్ని ఎద్దులు చావిళ్ళకు చేరుకోవటానికి వీధుల్లోనుండి పోతున్నాయి. వాటి వెనకాల పెద్ద జీతగాళ్ళు ములుగర్రలు భుజానపెట్టుకుని ఎద్దుల్ని అదిలిస్తూ కబుర్లు చెప్పుకుంటూ పోతున్నారు. పొలాల్లో వరినాట్లువేసే తరుణం. పెద్ద ఆసాములంతా ముందే దుక్కి దున్నించుకుంటున్నారు. ఆఊరి పొలం అంతా దాదాపు దుక్కిదున్నటం అయిపోయింది. ఇంకా కొదవ వున్నవాళ్ళు, చిన్నకారురైతులు కూడ దున్నటం ముగించేసుకుంటున్నారు. నీటి వసతి బాగావుండటంవల్ల కాలవలో నీళ్లు ముందుగానే వదుల్తారనే వినికిడివల్ల పెద్ద భూస్వాములు, చిన్నరైతులు అందరు అదునుగా నారుమళ్ళు మడులుకొట్టి మరీపెంచుకున్నారు. నారు ఏతకొచ్చి నవనవలాడుతుంది. పెద్దకాలవలో నీళ్ళు భర్తీగా పోతున్నాయి. ప్రక్కనున్న చినకాలవల్లోకి, భూముల్లోకి పూటుగా నీళ్లు వదిలేశారు. ఎవరికివారు చేలు తడుపుకుని ముందుగానే నాటేసుకుందామనే ఆతురతతో వున్నారు. దాంతో ఊళ్లో జనం అంతా పొలాలమీదే ఎక్కువగా వుంటున్నారు. ఎవరికివారు పైచేను ఎప్పుడు తడుస్తుందా తమ చేలకి నీళ్ళు ఎప్పుడు పెట్టుకుందామా అనే ఆలోచనలో వున్నారు. కొందరు పైవాడిచేను తడవకుండానే ఆ చేనువాడు లేనప్పుడు అడ్డీ తెగదీసి తమచేలకి నీళ్ని మళ్ళించేసుకుంటారు. మళ్ళీ ఆపైచేనువాడు వచ్చి కిందిచేనుకి నీళ్ళు ఎక్కకుండా తనచేనుదగ్గర అడ్డీవేసుకుంటాడు. నాట్ల సమయంలో ఇలాంటి విషయాల్లో తగువులు రావటం, తలలు పగలటం, కోర్టులచుట్టూ ఆసుపత్రుల చుట్టూ తిరగటం సర్వసాధారణం అయిపోయింది.

ఊళ్ళోవున్న దాదాపు మూడొంతుల పొలం మోతుబరి భూస్వాములు వెంకటాద్రినాయుడు, సూర్యనారాయణ చేతుల్లోవుంది. తతిమ్మావంతులో చిన్నకారురైతులు. మిగతా వాళ్ళంతా ఆ భూముల్లో కూలిపనులు చేసుకుంటూ కొందరు, భూస్వాముల ఇళ్ళల్లో జీతగాళ్ళుగా కొందరు, పెద్ద భూస్వాములు పదెకరాల చేలయితే చిన్నరైతులు చేనుపక్క గట్లు. వాళ్లగట్లు అయితే వీళ్ల గట్లమీది గడ్డిపరకలు. వెంకటాద్రినాయుడు మూడు పదులు నిండినవాడు. ఎర్రగా ఎత్తుగా దర్జాగావుంటాడు. రాజకీయాల్లో కొత్తగా ప్రవేశించి మొన్నజరిగిన పంచాయతీ ఎన్నికల్లో తనవార్డులో గెలిచి సర్పంచికి

పోటీచేసి ఒక్క ఓటుతో ఓడిపోయాడు దాంతో అనాదిగావస్తున్న సూర్యనారాయణే సర్పంచిగా ఎన్నికయ్యాడు. మొత్తానికి సూర్యనారాయణకి గట్టిపోటీనే ఇచ్చాడని నాయుడిని అందరూ అనుకున్నారు. సూర్యనారాయణ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని రాష్ట్ర రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగి ఇప్పుడు స్థానిక రాజకీయాల్లో సమితిలెవెల్లో ఆరిపోతున్న దీపంలా వెలుగుతున్నాడు. ఆయనకు మిగిలింది ఏభై ఎకరాల మాగాణి భూమి. ఒకేప్లాట్. ఈ చివర్నుంచి చూస్తే ఆ చివరి చేనుగట్టు కనపడదు. నాయుడుకి ఈ ఏభై ఎకరాల ప్లాటు పక్కనే పాతికెకరాలు ఒకటే చేనుంది. ఇంకా ఊరు చుట్టూ పదెకరాల చొప్పున పదిచోట్ల పరుచుకునుంది. ఆర్థికంగా నాయుడు, రాజకీయంగా సూర్యనారాయణ ఆ ఊరు ముకుదాళ్ళని చేతుల్లో పెట్టుకున్నారు. పంచాయతీ ఎన్నికల నుండీ వీరిద్దరు రాజకీయ శిబిరాల్ని నిర్వహిస్తూ బలంగావున్నారు. వీరిబలం బలపడటానికి ఉక్కువలలు విసిరి కూర్చున్నారు. వీరిపుణ్యమా అని ఇళ్ళలోవున్న బరిసెలు, కర్రీలు, కత్తులు అటకలమీదనుంచి దిగి అప్పుడప్పుడు బాకులనాట్యం చేస్తుంటాయి.

సూర్యనారాయణ అప్పుడే భోంచేసి చుట్టపుగాకు పాయిలు తీసుకుంటూ వచ్చి వరండాలో మంచంమీద కూర్చున్నాడు. అప్పుడే ముత్తడువచ్చి పంపుదగ్గర కెళ్ళి ముఖం కాళ్లు కడుక్కుని పైపంచతో ముఖం తుడుచుకుంటూ సూర్యనారాయణ కూర్చున్న చోటికివచ్చాడు. "ఏరా నీళ్ళెక్కుతున్నాయా బాగా" అని చుట్టనోట్లోపెట్టుకుని అగ్గిపుల్ల గీసి వెలిగించుకున్నాడు. పైపంచ తీసుకుని కిందవేసుకుని కూర్చుని "దక్షిణవేపు మడి ఈ రేత్తిరికవుద్ది. నీళ్లు తెగతాగుతుండాది. ఎంకటాద్రియ్యగారి మడుసులు అడ్డీతెగతీపోతే ఈపాటికయ్యేదే. ఈ రేత్తిరికి నాలుగైదుసార్లన్నా ఎల్లి సూసిరావాల. లేపోతే ఈరిగాడు తెగతీటం కాయం అన్నాడు ముత్తడు. "ఆ– ఆ– అదేదో కాస్త అవజెయ్యి. నారు ముదిరిపోతుండేమో మళ్ళీ. ఆ లప్డికొడుకుతో చెప్పు ఈసారి అడ్డి తెగదీస్తే మక్కెలిరగ దంతానని. నాయుడ్ని చూసుకుని ఈ వెధవ జోరెక్కువయినట్టుంది. లంజకొడుకుని ఈసారితీస్తే తన్ను పట్టుకుని ఎవడడ్డమొస్తాడో" అని నుసిరాల్చి చుట్ట నోట్లోపెట్టుకుని గుప్పుగుప్పున పొగలాగుతున్నాడు. "అమ్మగోరూ ఆబాట్రీలైటివ్వండి పోతాను, మళ్లీ చీకటిలో పడిపోవాల. మద్దేల తిన్నకూడు అకలిగావుంది" అని లేచి పైపంచ దులుపుకుని భుజానేసుకునేసరికి నాయుడు భార్య టార్చిలైటు తీసుకొచ్చి అందించింది. దాన్ని అందుకుంటూ "కాస్త పచ్చడుంటే పెట్టండమ్మగోరు, ముసల్ది రోజూ పోరు పెడతావుంది" అన్నాడు. "ముసల్దానికి ఒల్లు బాగయింద్రా" సూర్యనారాయణ చుట్టపారేసి అన్నాడు. "కాస్త తెరిపిగానే వుండాదిలెండి, లెగిసి తిరుగుతుండాది"

అన్నాడు. బాదం ఆకులో పెట్టుకుని తెచ్చిన పచ్చడిని చేతుల్లోకి అందుకుని "వస్తానం డమ్మగోరు" అని వరండాదాటి బయటకు నడిచాడు. "రేయ్! ఈరాత్రికి కావాలంటే అక్కడేవుండి ఎలాగయినా సరే చేను తడిసేటట్టు చూడు ఎవరన్నా వొస్తే ఒక్క చుక్కకూడ నీరు వదిలేది లేదనిచెప్పు. ఇదో— ఆ టార్చిలైటు జాగ్రత్త" అని మంచం మీదనుండి లేచి ఇంట్లోకి దోపతీసాడు సూర్యనారాయణ. "అట్టాగే—అట్టాగే" అంటూ ముత్తడు వెళ్లిపోయాడు. సూర్యనారాయణ భార్య తలుపుగెడవేసి ఇంట్లోకివెళ్లింది.

గూడెంలో అక్కడక్కడ కొన్ని వీధి దీపాలు వెలుగుతున్నాయి గుడిశల మధ్యగా దబ్బపండు శరీరం ఒకటి వేగంగా కదిలిపోతూవుంది? ఎక్కడి వారక్కడ దక్కిమంచాల మీద, చాపలమీద, మట్టి అరుగుల మీదపడి నిద్రపోతున్నాడు. అప్పుడప్పుడు ఉన్నట్టుండి కుక్క అరుస్తుంది. అక్కడక్కడ నిద్రపట్టనివాళ్లు వీధిలోపోయే మనిషిని చూసి, మళ్ళీ కళ్లుమూసుకుంటూ తెరుచుకుంటూ పడుకున్నారు. ఆ మనిషికి ముత్తడు కర్రతీసుకునిపోతూ ఎదురయ్యాడు. ముత్తడు నీళ్లపెట్టిన చేనుకి దోవతీసాడు. ఆ మనిషి నేరుగా గోడలు ఇటికరాయితో కట్టి పైన రెల్లుగడ్డి కప్పిన ఇంటిముందుకు వెళ్లాడు. ముందు వరండాలో ముసుగుదీసుకు పడుకున్న ముసిల్ది అలికిడివిని తలెత్తిచూసి మళ్ల తలదించుకుని పడుకుంది అది మారితల్లి ఆమనిషి తలుపు నెమ్మదిగాతోసాడు. ఆ ఇల్లు కట్టించింది ఆ మనిషేనని ఆ ఊళ్లో చాలావుందంటారు. తలుపు తెరుచుకున్న మేరకు లోపల లాంతరు కాంతి బయటకు పరుచుకుంది ఆ మనిషి లోపలకు వెళ్ళి తలుపు మూసేసరికి కాంతి మూసుకుంది పాతనవ్వారు మంచంమీద పడుకున్న శరీరం తాలూకు స్తనాలమీద చెయ్యివేశాడు వెచ్చగా. ఉలిక్కిపడిన మారి మనిషిని చూసి, కళ్లునలుపుకుంటూ "ఇంతపొద్దోయొచ్చావే" అంది ఆమనిషి మంచంమీద కూర్చుంటూ "ఊరిగాడెళ్ళి ఎంతసేపయింది" అన్నాడు. మారి కాస్తపక్కకు జరుగుతూ "సందేశే, దీపాలెట్టేసరికి నాలుగు మెతుకుల్తిని బరిసుచ్చుకుని పొన్నుకర్రతో బయలెల్లాడు. అడిగితే 'ఏంల్లేదులేయే' అంటూ పోయాడు" అని చెప్పింది. "నేనే పొమ్మన్నాలే పెంకలాడే ఈ రాత్రికి ఏకాడికైనాసరే చేలు తడవాలని. చేలకి నీళ్ల పోనివ్వటం లేదు సరిగ్గా—నారేమో ఎక్కొస్తంది" అన్నాడు మారిలెగిసి తన తలదగ్గరున్న మాసికదిండు తీసి ఆ మనిషి తిన్నగా మంచంమీద జరిపింది మంచందిగి కిందపడుకున్న రెండేళ్ళ బుడతడికి చింకిపేలిక కప్పి. ఇత్తడిగ్లాసుతో కాసిన్ని మంచినీళ్ల తాగి, తలుపు గెడేసి, గోడమీద మేకుకు తగిలించిన లాంతరు దీపం ఒత్తిబాగా తగ్గించి మంచందగ్గర కొచ్చే సరికి ఆ మనిషి జరిగి పడుకున్నాడు. ఆ ఖాళీని మారి ఆక్రమించింది. నల్లగా నిగనిగ

లాడుతున్న జాకెట్టులేని శరీరానికి అంటుకున్న మాసిన తెల్లబాడీని ఉతికిన నలిగిన చీరను చేతులు పక్కకు తొలగించాయి.

* * * *

సూర్యనారాయణ చేను ప్రక్కనున్న చినకాలవకి వేసిన అడ్డీకి ఆ రాత్రికి నాలుగోసారి గండికొట్టి నాయుడి చేలోకి నీళ్ళు మళ్ళించి కాళ్లచేతులు కడుక్కున్నాడు ఈరిగాడు తడిసిన చేను ఒకసారి పారజూసి మరల గట్టెక్కి ఊరికి దూరంగా అడ్డ రోడ్డు దగ్గరున్న తాళ్ళచేనుకి నీళ్ళెలా ఎక్కుతుందీ, ఎవరన్నా గండికొట్టిందీ లేనిదీ చూసి రావటానికి రోడ్డెక్కాడు చేతిలోవున్న పొన్నుకర్రను బలంగా నేలకుతాటిస్తూ ఈరిగాడు ఒకసారి మొల్లోవున్న బరిశెను చేతితో తడిమి చూసుకున్నాడు.

ముత్తడు పెళ్లాన్ని నిద్రలేపి "చేనుదగ్గర కెళ్ళొస్తానొసే" అని టార్చిలైటు, కర్రి అందుకుని రోడ్డుపట్టాడు. ముత్తడి పెళ్లాం తూలుతూ నిద్రకళ్ళతో లేచి తడికేసి, గొళ్ళెం పెట్టి, రాయి అడ్డంపెట్టి పడుకుంది. ముత్తడు ఊరుదాటి చేతిలోవున్న టార్చి లైటు స్విచ్చిని రోడ్డువైపుకు అప్పుడప్పుడు చేత్తో నొక్కుతూ ఆలోచించుకుంటూ అడుగులు వేస్తున్నాడు. "ఈపాలికూడ ఈరిగాడు గండి కోట్టాడేమో" అని అనుమానంతో నడుస్తూ "ఈపాలయితే ఆడిపుచ్చ పుచ్చకాయలా పగిలిందే" అని ఒక నిశ్చయానికొచ్చి వేగంగానడుస్తూ చేనుదగ్గరకు చేరాడు. చేలోకి నీళ్లు చుక్కెక్కటం లేదు. చేతులోవున్న టార్చిలైటు, కర్ర గట్టుమీదపెట్టి, పంచెగగట్టుకుని నీళ్ళలోదిగి ప్రవాహానికి అడ్డీవేశాడు. తన దొరగారి చేలోకి నీళ్ళని మళ్ళించాడు. నీళ్లు చేలోకి దూకుతూ పోతున్నాయి. కాళ్ళూ, చేతులు కడుక్కుని గట్టెక్కి చేనువంక చూస్తూ "ఈడుండే ఈడిపని బట్టాల" అనుకుని టార్చి. కర్రి చేతిలోకి తీసుకుని. కొద్దిదూరం వెళ్ళి ఎండిపోయి పగుళ్ళిచ్చిన బోదెలోకి టార్చివేసి 'పరవాలేదు' అనుకుని బోదెలోకి దిగి కూర్చుని మెడఎత్తి అడ్డీవేపుకే చూస్తూ కూర్చున్నాడు.

ఊరు చుట్టూవున్న నాయుడి పొలాల్లోకి నీళ్లు ఎక్కేదీ లేనిదీచూస్తూ, అవసరంగా వుంటే పై చేనువాడి కెక్కకుండా గండికొట్టి దొరగారి చేను తిన్నగా అడ్డీలు వేస్తూ మళ్లీ పాతికెకరాల చేనుదగ్గరకు చూడటానికి వచ్చాడు ఈరిగాడు. చూసేసరికి చేలోకి నీళ్లు చుక్కెక్కటం లేదు. పైకివెళ్ళి సూర్యనారాయణ చేను తిన్నగా అడ్డీవేసి వుండటం, ప్రవాహంలాగ నీళ్లుపోవటం చూశాడు. "లంజకొడుకు ముత్తదేసుంటడు"

అనుకుని నీళ్ళలోకి దిగి అడ్డీపగలకొట్టాడు. వెంటనే నాయుడి చేలోకి ఉరకటం మొద లెట్టాయి. ఇదంతా దూరంగావుండి గమనిస్తున్న ముత్తడు ముచ్చెమటల్తో పరుగెట్టు కుంటూ వచ్చి ఈరిగాడ్ని కర్రితో నడుమ్మీద బలంగా ఒకటిచ్చి "లంజకొడక— లంజ కొడక— ఎన్నిసార్లులా గండికొట్టేది. పెళ్లాన్ని మళ్లించుకోలేని పెదవ్వి నీళ్ళని మళ్ళించ టాని కొచ్చావట్రా తొత్తుకొడకా" అంటూ తిట్లు, బూతులు ఆరంభించాడు. తిక్కరేగిన ఈరిగాడు "నీకివ్వాళ మూడిందిరా" అంటూ చేతిలోవున్న పొన్నుకర్రతో ముత్తడి తల మీద సమ్మెటలా బలంగా నాలుగుసార్లు కొట్టాడు. "అమ్మో— అయ్యోయ్— అమ్మో— అయ్యో— చచ్చాన్రోయ్" అంటూ ముత్తడు తలబడుతూ పడిపోయాడు. అయిదోసారి ఎత్తిన ఈరిగాడి చెయ్యి ముత్తడి తలనెత్తురు చిమ్మటం చూసి ఆగిపోయింది. ముత్తడి కంపిత, రక్తసిక్తశరీరం గట్టుమీద విలవిల కొట్టుకుంటుంది. వేగంగా కొట్టుకుంటున్న గుండెల్నదిమిపట్టి పొన్నుకర్రి చివర రక్తం మరకల్తో ఈరిగాడు చీకటిలోకి దూసు కుంటూ పోయాడు.

* * * *

తెల్లవారింది —

ముత్తడి పెళ్ళాం ముండమోసింది.

వారం రోజులయింది —

నాయుడింట్లో జీతానికి సూరిగాడు కుదిరాడు.

నాలుగు నెలలు జరిగాయి —

మారి మాంచి పనసపండులాంటి పిల్లాడ్ని కన్నది.

ఆరునెలలు గడిచాయి —

ఆసాములకు పండిన పంట బస్తాలతో బళ్ళమీద ఇంటికొచ్చి చేరింది.

"ఆళ్ళా ఆళ్ళా బాగానేవుండారు — మధ్య పోయేకాలం మన కేమొచ్చిందంట?"

అని గూడెంలో అగ్గి అంటుకుంది.

మనిషి శుద్ధవెర్రికుట్టె ఒక పిపీలికాన్ని సృష్టించడం తనచేత కాక పోయినా డజన్లకొద్దీ దేవుళ్లని మాత్రం పుంఖాను పుంఖాలుగా తయారు చేస్తున్నాడు.

—మాంటెన్.

సమీక్షలు :

# దర్పణం

[దర్పణం : కథాసంకలనం. ప్రతులకు: కార్యదర్శి, యువరచయితల సమితి, నల్గొండ. వెల : 2-00.]

నల్గొండ యువరచయితల సమితివారి ప్రచురణలలో 'దర్పణం' మూడోది.

'నేటి ఈ సమాజంలో సాంఘికంగా, ఆర్థికంగా రాజకీయంగా సామాన్యుడు నిత్యం దోపిడికి గురౌతున్నాడు .... దీనులు హీనులు కూడులేని గూడులేని- బాధాసర్పదష్టులంతా ఇంకా అలాగే ఉన్నారు . ఈసమాజం మారుతుందనే ఆకాంక్ష, ఆశ, తపనతోనే మేమీప్రయత్నానికి పూనుకుంటున్నాం' అని చెప్పుకున్నారు ప్రచురణ కర్తలు 'మామాట'లో.

'దర్పణం'లో మొత్తం పదిహేను కథలున్నాయి. ఈ 15 కథల్ని రాసిన 15 మంది కథకులు ఇంచుమించు కొత్తవాళ్ళే. అయితే ఈ 15 కథల్లో 'మామాట'లో ప్రచురణ కర్తలు నిర్దేశించుకున్న లక్ష్యానికి నిలిచేవి నాలుగైదు కథలకంటె ఎక్కువలేవు

కె. చినవెంకట రామారావు రచించిన 'మన ఊళ్ళో కూడానా?' అన్న కథ ఒకప్పుడు తెలంగాణాలో ఆచరణలో ఉన్న 'వెట్టి' అన్న భూస్వామ్యవ్యవస్థ సృష్టించిన రాక్షసత్వాన్ని కళ్ళకుగట్టినట్టు చిత్రిస్తుంది. వెట్టి అంటే ఆనాటి తెలంగాణాలోని జమీందార్లకు దేశ్‌ముఖ్‌లకు ఊళ్లల్లోని పేదవర్గాల వాళ్లు వంతులవారీగా వచ్చి పైసాకూలీ లేకుండా బండెడు చాకిరిచేసి పోవటం. పేదవాళ్లతో ఈ 'వెట్టి' చేయించుకోవటం ఆనాటి దొరలకు ఒక హక్కుగా ఉండేది. ఎవరైనా ఈ అన్యాయాన్ని సహించ లేక ఎదురు తిరిగితే వాళ్లను నామరూపాలు లేకుండా హతమార్చటం జరుగుతుండేది. ఈ వెట్టికి వ్యతిరేకంగా పేదవర్గాల ప్రజలు పోరాడటం తెలంగాణాలో కమ్యూనిస్టు ఉద్యమం ప్రబలడంతో ప్రారంభమైంది. ఊరూరా ప్రాకుతున్న ఈ ఉద్యమం 'మన ఊళ్లో కూడానా?' అని ఆ ఊరి దొర, పటేలు పట్వారీలు అనుకుంటుండగా ఈ కథ సమాప్తమౌతుంది. చక్కని సంయమనంతో శైలితో, వాస్తవికతను కళాత్మకంగా చిత్రించిన కథ 'మన ఊళ్లో కూడానా?'

నిర్మల్ రచించిన 'సమాధులపై పునాదులు' అన్న కథకూడా నేటి సమాజంలో పేదవాడికి జరుగుతున్న అన్యాయాన్నే చిత్రిస్తుంది.

ఓ ధనవంతుడి కొడుకు నడుపుతున్న కారుకిందపడి ఓ పేదరిక్షావాడు నడిరోడ్డు మీద ప్రాణం విడిచాడు. చనిపోయిన రిక్షావాడి కుటుంబానికి తర్వాత అక్కడికి వచ్చిన ఎస్. ఐ కి కొంత ముట్టచెప్పే షరతుమీద ఆ కారుతోలినవాడిని వదలిపెట్టటం జరుగుతుంది. కారుగలవాడు తన కారుకిందపడిన రిక్షావాడి కుటుంబం కోసం ఇచ్చిన 2 వేల రూపాయల డబ్బులో కేవలం మూడువందలు మాత్రం రిక్షావాడి కుటుంబాని కందుతుంది. మిగతా డబ్బు మధ్యలో దొంగలు కాబోలు పంచుకున్నారన్నమాట. అయితే కనీసం ఆ మూడువందలైనా ఆ రిక్షావాడి భార్యకు చెందుతాయనుకుంటే పొరపాటు. ఆ మూడువందల్ని ఆ చనిపోయిన రిక్షావాడికి రిక్షా అద్దెకిచ్చిన ఖాసింసాబ్ అనే ఆసామి లాక్కుపోయాడు! పేదవాడు ఎన్ని రకాలుగా పీడించబడ్తున్నాడో, వాడి సమాధులమీద ధనికవర్గాల వాళ్ల మేడల పునాదుల్ని ఎలా నిర్మించుకుంటున్నారో చక్కగా చిత్రించే కథ 'సమాధులపై పునాదులు'.

మేరెడ్డి యాదగిరిరెడ్డి రచించిన 'చావుకోసం' అన్న కథ 'O Henry like ending' తో ఒక్కసారి పాఠకుడి గుండెను జలదరింపజేస్తుంది. శ్మశానంలోకి వచ్చే శవాలకు బొందలు తవ్వే వీరయ్య ఆరోజు ఎవరైనా చచ్చి ఓ శవం వస్తే బావుండునని ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తున్నాడు. శ్మశానంలో ఉండేవాడికి ఎంతమంది చస్తే అంత ఆదాయం కదా! పైగా ఆరోజు వీరయ్యకు డబ్బు జరూరుగా కావాలి. ఇంట్లో అతని కొడుకు టైఫాయిడ్‌తో పడున్నాడు. వెంటనే మందులు తెచ్చుకోమన్నాడు డాక్టర్. అప్పెక్కడా పుట్టలేదు, శ్మశానానికి వచ్చి ఎవరిదైనా శవం వస్తే బావుండును. వెంటనే ఓ ఐదురూపాయలు దొరికేవి అనుకుంటూ ఎదురుచూస్తుంటాడు వీరయ్య. చాలా సేపటికి అతని ఎదురుచూపు ఫలించినట్టనిపించింది. ఓ శవాన్ని మోసుకొని ఓ ఆడమనిషి శ్మశానానికి వచ్చింది. అయితే ఆశవం ఎవరిశవమోకాదు. అది వీరయ్య కొడుకు శవమే!

ఈ కథలో ఉన్న 'ఐడియా' గొప్పదే అయినా ఈ కథలోని శైలిగాని, సంభాషణలుగాని, కథకిచ్చిన ట్రీట్‌మెంట్‌గాని ఉన్నతస్థాయిలో లేకపోవటంవల్ల కథ శక్తివంతంగా నడవలేదు. ఈ రచయిత శైలి విషయంలోను, ట్రీట్‌మెంట్ విషయంలోను తగినంత శ్రద్ధతీసుకుంటే మంచి కథలు రాయగలడని ఆశించవచ్చు.

ఈ సంకలనంలోని మరో మంచి కథ కె. రామారావు రాసిన 'నిజం నిద్రిపోయింది' అన్నకథ. ఈ కథకూడా నేటి మన సమాజంలో భూస్వాముల దురంతాలకు బలి అయిపోతున్న పేదవాళ్ల నిస్సహాయత్వాన్ని చిత్రించేదే

సుబ్బారావు అన్న ఓ బడా భూస్వామి కొడుకు రాంబాబు తుపాకి కావాలని ముచ్చటపడి తండ్రి నాలుగు నిముషాల్లో తెచ్చిపెట్టిన తుపాకితో ఆ ఊళ్లోని కోతులతో పాటు ఓ మనిషినీ ఢామ్మని కాల్చేసి జైలునుండి యేనేరమూ చెయ్యలేదని జడ్జిచేత తీర్పు చెప్పించుకొని బయటపడతాడు. కానీ అదే ఊళ్లోవి సూర్యం అనే పేదవర్గానికి చెందిన యువకుడి విషయంలో అతడు చెయ్యని హత్య చేసినట్టుగా కోర్టులో ఋజువౌతుంది.

మంచి శైలి. చక్కని ఎండింగ్‌తో ఈకథ పాఠకుణ్ణి ఆకట్టుకుంటుంది.

పేదరికంతో సతమతమవుతూ మొదటిసారిగా లంచం తీసుకున్న ఓ ఎన్ జి.వో విషాదగాథను మూటుపూరు కృష్ణమూర్తి 'తప్పు' అన్న కథగా చెప్పారు. అతడు లంచం తీసుకున్న తప్పుకు ఫలితమా అన్నట్టుగా అతడు ఇంటికి వెళ్లగానే అతని కొడుకు చచ్చిపడి ఉండటం ఈ కథలో ఓమంచి మలుపు.

ఈ ఐదు కథలుపోగా ఈ సంపుటిలో ఉన్న మిగతా కథల్నిగూర్చి చెప్పుకోడానికి యేమిలేదు. 'బస్తీబతుకు' అన్న స్కెచ్‌లో ధరణికోట సమీరకుమార్ తెలంగాణ యాసను ప్రవేశపెట్టడం విశేషం.

— మహేంద్ర

"లాంగ్ మార్చ్" తాత్కాలిక ఆపుదల

అనివార్య కారణాలవలన- ముఖ్యంగా ఆర్థిక యిబ్బందుల వలన— 'లాంగ్‌మార్చ్'ను తాత్కాలికముగా ఆపుచున్నాము. పత్రికను తిరిగి ప్రారంభించువరకు చందాలు పంపవద్దనికోరుతున్నాము. పత్రిక బాకీలను వెంటనే చెల్లించమని 'న్యూస్ ఏజంట్ల'కు మనవి చేస్తున్నాము.

ఇట్లు,

"లాంగ్‌మార్చ్" అసోసియేషన్

పోస్టుబాక్సు నెం. 103, విశాఖపట్నం-1

# పూర్తి "నగ్న చిత్రాలు" వేయాలి

ప్రస్తుత సమాజాన్ని గూర్చి ప్రజలకు ఉన్న అభిప్రాయాలు, ఆలోచనలు ఈ సంకలనం ద్వారా పరిచయమవుతున్న 30 మందిలో— ఒకరిద్దరికి తప్ప— అందరు రచయితలకూ ఉన్నాయి

పరిస్థితిని ఉన్నదున్నట్లు చిత్రించటానికి ఈ సరికొత్త కవులు మంచి ప్రయత్నమే చేసారు.

ఈ దేశాన్ని పట్టి పీడిస్తున్న జాడ్యాలేమిటన్నది ప్రజలకు కనిపిస్తూనే ఉంది అయితే, వాళ్లకు తెలియనివి వాటికి మూలకారణాలు, పరిష్కారమార్గాలే ఈ నిశిత పరిశీలన చైతన్యవంతులయిన యువకులు, రచయితలు చేయాలి ఈపని చేయవలసిన మేధావివర్గం, తామున్న ఊబిలోని దిగబడుడు సుఖంతో రాజీపడ్డ దౌర్భాగ్యస్థితి ఆవరించిన ఈ దేశంలో యువతరం పైగల ఈ బాధ్యత రెట్టింపవుతున్నది. అందుకే, అందరికీ కనిపించే పరిస్థితినే చూపిస్తున్న ఇటువంటి అర్థ "నగ్నచిత్రా"ల కన్నా, ఇంకాలోతైన అధ్యయనంతో కూడిన పూర్తి "నగ్నచిత్రాలు" వేయటానికి రచయితలు కృషిచేయాలి. అవినీతి పరిస్థితులను తమకు కనిపిస్తున్న విధంగానే మళ్లీ చెపితే ప్రజలు 'నిజం' అనుకుంటారంతే, కాని, వాటిని గూర్చిన సరికొత్త కోణాలు చూపినపుడే వారికి చైతన్యం కలుగుతుంది.

ముఖ్యంగా ఆవేశంగా, వ్యంగ్యంగా, ఎక్స్‌పోజింగ్‌గా ఉండే రచనలు పాఠకుల మనసుకు బాగా పట్టుతాయి. ఈ సంకలనంలో ఆవేశం కలవి, ఎక్స్‌పోజ్ చేసేవిధంగా ఉన్నవి తక్కువేకాని వ్యంగ్యరచన లున్నాయి.

"దేవుడితో ఇంటర్వ్యూ"లో నాగరాజు, మానవుని సర్వస్వం దోచుకుంటున్నవారు ఉండగా నల్లులనెందుకు సృష్టించావు అని, మహామంత్రు లుండగా ఒల్లులు, పార్టీలు మార్చే పెద్దమనుషులుండగా ఊసరవెల్లులు ఎందుకని ప్రశ్నిస్తున్నాడు.

"మారణహోమపు టగ్నిజ్వాలలు
ఆశాలతలను మార్చేస్తుంటే
దిగుతున్నది శాంతికపోతం ;

శత శతఘ్నిదశ నిర్ఘాతిదం
దశదిక్కులు పగిలిస్తుంటే
చెబుతున్నది శాంతి విధానం!"

అని రాసిన టి. పూర్ణచంద్రరావు కవితలో ఆవేదన, వ్యంగ్యం బలంగా ఉన్నాయి. ప్రభురక్తం పాపం చేయదని నమ్మేంతటి అజ్ఞానులుగా ప్రజలను మార్చి తమ రాజరికానికి ఎదురులేకుండా చేసుకున్న స్వార్థపరులు, కాళ్లులేకుంటే ముళ్లేగుచ్చుకోవన్న సామెతగా. చైతన్యంలేక జడంగాపడి ఉంచుతూ అదే శాంతి అని ప్రజలను నమ్మిస్తున్నారు. రేపు ఇనపడేగను ఎగురవేసి ఇదే శాంతికి ఏకైక సింబల్ అని కూడా నమ్మించటానికి వీలయినంత అమాయకత ప్రజలలో ఉన్నది. దీనిని ఛేదించాలి. ఇంకా, జి. కృష్ణమూర్తి రచన "పాపం! శాంతి" కూడా ఇటువంటిదే.

"రాజ్యాంగాన్ని మార్చాలని పంచాంగం పేజీలు త్రిప్పుతున్నారు"— అని చురకవేసాడు ప్రభాకర్.

ఈదేశ రాజకీయాల్లో జ్యోతిషాలు, చిలుకపలుకులు, పంచాంగాలు, హస్తసాముద్రికాలు, బాబాల దీవెనలు మొదలయిన వాటి నిర్ణయాత్మక పాత్రను గూర్చి వింటూనే ఉన్నాం మనం.

ఈ రాహుగ్రహణం నుండి దేశాన్ని బయటపడవేసే బాధ్యత యువకులదే!

"యువకా! తనశక్తి తనకే తెలియని వాయుపుత్రుడు నీఛాయలో గడు"— అన్న భూమయ్య మాటలు దీనిని బలపరుస్తున్నాయి.

"మీకు తెలీదుగాని మీలో ఒక్కొక్కరూ మోకాల్లో సందేహ పర్వతం ఇరుక్కున్న జాంబవంతులు" అని 'చేతనావర్తం'లో వేనరెడ్డి ఇట్లాగే అన్నాడు

అంటుకోని అగ్గిపుల్ల ఆరిపోయిన అగ్గిపుల్ల ఏమీచేయలేవుగాని, అంటుకుని మండుతున్న అగ్గిపుల్లవంటి యువతరం ఏమిచేయలేదు గనుక!

## ఘర్షణ - ఎంతగొట్టు పేరు!

ఈ సంకలనంలో "11 మంది నవకవులు రాసిన గేయాల్లో" మంచివి ఉన్నాయి. సమాజాన్ని వస్తువుగా చేసుకున్న వీరి కవితలు స్పష్టత, సూటిదనం, వేగం కలిగి తాము చెప్పేదానిపట్ల వీరికెంత గాఢవిశ్వాసం ఉన్నదో తెలుపుతున్నాయి.

తరతరాలుగా మూఢ విశ్వాసాలూ, బానిస కట్టుబాట్లలో అస్తిత్వం లేకుండా గడుపుతున్న ఈ సమాజీయుడు స్వరాజ్య ప్రాప్త్యనంతరం ఎట్లా పేడిపెనం పైనుండి జారి పొయ్యిలో పడ్డాడో, కుష్టు రాజకీయాలు, గోముఖవ్యాఘ్ర ప్రజాస్వామ్యం, కపటపు సోషలిజం అతడినెట్లావడివేసి రక్తం పిండుతున్నాయో వీళ్లు బాగావర్ణించారు.

ఇందునుండి విముక్తిచెందటానికి 'రివోల్ట్' కమ్మని 'సలత్యలక్ష్మి' అంటున్నది.

'కాషన్'లో 'యస్వీ'

నిన్ను, నీ ప్రాణాన్ని
నవ్వుతూ దోచుకునే
విషపు నవ్వుల నయవంచకులతో
వేరు పురుగులతో
వద్దు
ఎన్నడూ చేతులు కలపొద్దు''

అంటున్నాడు. బాగా చెప్పాడు. కోట దిడ్డితలుపులు తెరిచి శత్రువు నాహ్వానించేవారు. మౌనంగాపడి ఉండి శత్రువు దాటిపోవడానికి వంతెనవలె ఉపయోగపడే వారే అధిక సంఖ్యలో ఉన్నారీపక్షాన. అవగాహన లేకపోవడము, భయము మొదలయినవే ఇందుకు కారణం. వీరికి అవగాహన ఏర్పడి పీడితవర్గమంతా ఏకమైనపుడు శత్రువు తలచితికిన సర్పమై ఊరుకుంటాడు. శ్రీ రావిశాస్త్రి రాసిన 'నిజం' నాటకంలోని సార్వభౌమారావు తన పాపకృత్యాల్లో తోడ్పడ్డవారితో, చివరన, మీ తోడ్పాటువల్లనే నేనివన్నీ చేయగలిగానంటాడు. మీ మీ ప్రయోజనాలకొరకు నాతో చేతులు కలిపారని ఎత్తిపొడుస్తాడు పైగా. ఈ వెనుకబడినవర్గం తమ అవసరాలకోసం పైవారితో చేతులు కలపకనో పడి ఉండకనో తప్పని పరిస్థితిని కల్పించే ఘనతకూడా పైవర్గాలదే. సార్వభౌమారావువలె వారే మళ్ళీ హేళనచేయగలరు కూడా. వారిది

రెండంచుల విషపుకత్తి. కనుకనే ఇవతలివర్గం అతిజాగరూకతతో వ్యవహరించవలసి ఉంటుంది. ఆ చైతన్యం ఏర్పడినవర్గం ఏకమై శత్రువును ఢీకొంటుంది. అప్పుడు కష్టనష్టాలగూర్చి ఆలోచించే ప్రసక్తే ఉండదు. "అదివిలయం, ఇదిసమరం, అటోయిటో తెగిపోతుంది", అదే ఈకవి విశ్వాసం కూడా. ఈ రాతిరి "ఆకలితో మాడినా బాధలేదు" పోరాటం తర్వాత "పొద్దు తప్పకుండా పొడుస్తుం"దంటున్నాడు.

'ఆషాఢభూతి నిజాయితీ మార్షు' పాలకుల దగా సోషలిజం కూతలపై కె. ఎస్. వి. నరసింహం, 'ప్రశాంత'లు రాసిన 'వర్షంలో నాగరికత', 'అభ్యుదయం' లలో మంచి వ్యంగ్యం ఉంది. మొదటిదానిలోని వ్యంగ్యంలో చమత్కారముంటే, రెండవ దానిలో విసురు ఉంది.

బి. ఎస్. రామారావు రాసిన 'ధ్వంసం', నాయని కృష్ణమూర్తి 'జస్ట్ ఎ మినిట్ ప్లీజ్' కూడా పేర్కొనదగ్గవి. 'నామతం కితాబు' లో గతాన్ని మర్చిపొమ్మంటున్న 'సత్యకిక్మ్' గతాన్నంతా మర్చిపొమ్మనమంటే, పాఠాలునేర్పే చరిత్రనే మర్చిపొమ్మన్నట్లవుతుందని గుర్తించాలి, ("గతం నాస్తికాదు నేస్తం, అది అనుభవాల ఆస్తి"). అట్లాగే, వర్తమానం పేజీలో "రీషఫిలింగ్‌నీడెడ్" అని రాసి, భవిష్యత్తు పేజీలో "రివోల్ట్" అని రాయడం కాదు, భవిష్యత్తుకోసమై వర్తమానం పేజీలోనే 'రివోల్ట్' అని నోట్‌చేసుకోవాలి. భవిష్యత్తులో 'బి రివోల్టింగ్ ఫరెవర్!'

పరిశాంత రాసిన మరొక కవిత 'ఇజం - నిజం' అవగాహనలేని తొందరపాటుతో కూడిన సినిక్ రచన.

"సమతా వ్యవస్థకాదు
మమతా స్పందన
అభ్యుదయం కాదు
మానవతా హృదయం
విప్లవం కాదు
సదాలోచనాక్రమం
కావాలి ఇప్పుడు
రావాలి ఇప్పుడు"

అంటే ఏమిటి? సమతావ్యవస్థ, అభ్యుదయం, విప్లవం ఏ ఇజంలోనూ పుట్టినవికావు. మమతాస్పందన. మానవతా హృదయం, సదాలోచనాక్రమంవల్ల కలిగినవే సమతావ్యవస్థాది అభిప్రాయాలు, వాటికోసం ఏవైనా ఇజాలు పుటుతాయికాని, ఇజంలో అవి పుట్టవు. పోతే- ఘనంగా ఉండాలని చెప్పి పుస్తకానికి గొప్పపేర్లు పెట్టడం సరిగాదు,

—టంకశాల అశోక్

[ నగ్నచిత్రాలు— ఇందూరు భారతి సమాఖ్య సభ్యుల స్వచ్ఛంద కవితలు; ప్రచురణ: ఇందూరు భారతి 3-9-806, అశోకవీధి, నిజామాబాద్ 54 పేజీలు- రూపాయిన్నర. ]

[ ఘృణి- గేయసంపుటి సంకలనకర్త : కె. యస్. వి. నరసింహం ప్రతులకు: ప్రత్యూష సాహితి, 124 జి. యస్. మాడస్ట్రీట్, తిరుపతి. 35 పేజీలు వెల: 75 పైసలు ]

సాహిత్య లేఖలు :

"తుఫానుకోసం ఎదురుచూస్తున్నాను" — ఒక పరిశీలన

'సృజన' మార్చి 1971 సంచికలో శ్రీ అద్దేపల్లి రామమోహనరావు కవిత 'తుఫానుకోసం ఎదురుచూస్తున్నాను' లో నిరుద్యోగాన్ని భూతంలా ఇలా చిత్రించడం జరిగింది :—

"నిరుద్యోగ భూతం విజృంభిస్తోంది—
రికమండేషన్ల ఎముకల దండలు ధరించి
లంచాల పుర్రెలు చేతుల్లో పట్టుకుని
పలుకుబడి నెత్తుర్ని ఒళ్ళంతా పులుముకుని
దోపిడీ నరాల్ని మెడకి చుట్టుకుని
వర్తమాన దేశదరిద్ర రంగస్థలం మీద
వికార తాండవం చేస్తోంది—".

ఒకభూతం ధరించిన ఎముకల దండల్లోని ఎముకలు ఎక్కడివి? తను చంపిన ప్రాణివి. ఆ ప్రాణియొక్క మాంసంతిని, ఎముకల్ని ధరించడంలో భూతం ఉద్దేశ్యం. మరో ప్రాణికి భయం కలిగించడమే అయినపుడు, "రికమండేషన్ల ఎముకల దండలు ధరించి" అనడంలో రికమండేషన్లను చంపి వాట ఎముకలను దండలుగా చేసి ధరించి, మరిన్ని రికమండేషన్లను చంపేందుకు భయపెట్టడం అనే అర్థం రాదా? అలా అర్థం వచ్చినప్పుడు— రికమండేషన్లవల్ల నిరుద్యోగం సమస్య జటిలమైందన్న కవి భావమే కవితలో తలకిందులు కావడంలేదా ?

అయితే— రికమండేషన్లు అనే ఎముకల యొక్క దండలు అనీ, మెడలో ఎముకలను చూపుతూ భూతం భయపెట్టినట్లు రికమండేషన్లు చూపుతూ నిరుద్యోగ భూతం దిక్కులేని వాళ్ళను భయపెడ్తున్నదనీ, కవి భావం కావచ్చు. అప్పుడు— నిరుద్యోగ భూతం విజృంభణకు రికమండేషన్లు ఒక కారణమని, రికమండేషన్లు లేకుంటే నిరుద్యోగభూతం విజృంభించేది కాదని అర్థం వస్తున్నది. విజృంభించకున్నా భూతం భూతమే! అసలు— నిరుద్యోగం, భూతం కావడానికి కారణం ఏమిటి ? మళ్ళీ రికమండేషన్లే!

ఇంతకీ—

"నిరుద్యోగ భూతం విజృంభిస్తోంది–

రికమండేషన్లు లేనివారి ఎముకల దండలు ధరించి"

అంటే సరిపోతుంది కదా ?

ఇట్లే– లంచాల పుట్టలు, పలుకుబడి నెత్తురు, దోపిడీనగాలు అనే ప్రయోగాలు గమనించ దగ్గవి.

ఇక– నిరుద్యోగభూతం విజృంభణ మొదలయింది ఎప్పుడు అన్నది మరో ప్రశ్న.

"ఈ నిరుద్యోగ భూతం
తన జడల్ని సమాజంమీద కొరడాలుగా చేసి
తన పళ్ళమధ్య సమిష్టి సౌఖ్యాన్ని నమిలేస్తూ
వికార తాండవం చేస్తున్న సమయంలోనైనా
ఈ దేశంలో పేదవాడు తిరుగుబాటు చేస్తాడని"

కవి ఆశించడంలో స్ఫష్టపడేది, విజృంభణ మొదలయింది ఇప్పుడిప్పుడే అని. ఇది నిజంకాదు. కాబట్టి, ఇందుకోసమే– ఎప్పుడూ తిరగబడని పేదవాడు ఇప్పుడు తిరగబడతాడనే కవి ఆశ అడియాసే. "ఈ దేశంలో ఆకలి తిరుగుబాటు చెయ్యలేదు" (did not revolt) అన్న కవే

"కాలిన మండిన కడుపుల మీద
యౌవనం వైఫల్యగీతాలు రచిస్తున్నప్పుడైనా"
"ఇంటిల్లిపాదీ చేస్తున్న ఉపవాసాలు పెచ్చుపెరిగిపోయి
అస్తిత్వం మీదనే నిప్పులు పోసి అంటిస్తున్నప్పుడైనా"

విప్లవ జ్వాలలులేస్తై అనడం తిరుగుబాటుకు ఆకలే కారణం అంటున్నట్లయింది.

"కాలే కడుపుల మీద
యౌవనం వైఫల్య గీతాలు"

రచిస్తున్న కవుల్లోకూడ రియాక్షనరీలు అనబడేవారు ఉన్నప్పుడు ఈ గీతాలు తిరుగుబాటు లేవదీస్తాయా అన్నది చివరిప్రశ్న. ఆకలిని చూసి రాసిన కవిత్వంకాక, ఆకలితో రాసిన కవిత్వమే ఆకలి కవిత్వం అయినపుడు. ఇరవైమూడేళ్ళ దరిద్ర భారతంలో ఈ కవిత్వంవల్ల విప్లవం రాకపోవడం ఆశ్చర్యమే.

—గజ్జల దక్షిణామూర్తి

## సమాధానం

శ్రీ గజ్జల దక్షిణమూర్తి నా గేయం మీద చేసిన పరిశీలనలో మూడంశాలున్నై.

(i) ఎముకలు, పుఱ్ఱెలు మొదలైనవి ఎవరివి, భూతం ఎందుకు వేసుకుంది– మొదలైన ప్రశ్నలు—

ఒక రూపకంలోగాని ఉపమలోగాని, ఇమేజ్‌లోగాని పోలికల్ని సాగదీసి ఆలోచించరాదన్నది విమర్శకులందరూ చెప్పే విషయమే. ఎముకలు, పుర్రెలు, నెత్తురు మొదలైనవి భూతంమీద కనిపించే భయంకర సామగ్రి. నిరుద్యోగం కూడా రికమండేషన్లు లంచాలు మొదలైన భయంకర సామగ్రితో ఉంది. ఇంతవరకే యిక్కడి ఈ పోలికకి ప్రయోజనం. దక్షిణామూర్తి గారాలోచించినట్లు ఆలోచిస్తే, ఏ కవియొక్క ఏ పోలికనైనా అసమంజసమని ఋజువు చెయ్యడం కష్టంకాదు.

(ii) నిరుద్యోగ భూతం విజృంభణ సమయం గూర్చిన ప్రశ్న— విజృంభణ మొదలైంది యిప్పుడిప్పుడే అని నేను ధ్వనింపజేస్తున్నట్లు అయన అభిప్రాయపడుతున్నారు. అది ఎప్పుడు ఎట్లా పెరుగుతుందో చెప్పడం గేయం యొక్క లక్ష్యం ఎంతమాత్రమూ కాదు. ఇప్పుడు విజృంభణగల దశలోనే ఉందిగదా. ఆ విజృంభణకి రూపకల్పనమే నేను చేసింది.

(iii) తిరుగుబాటును గూర్చిన ఆశ అడియాస అని హెచ్చరించడం ఆయన లక్ష్యం. దీనికి మూడు అనుబంధ విషయాలున్నై. మొదటిది ఆకలి తిరుగుబాటుకు కారణమౌతుందా అని. రెండోది ఈ గేయాలు తిరుగుబాటు తెస్తయ్యా అని. మూడోది విప్లవాన్నికోరే కవుల్లోనూ రియాక్షనరీ లున్నారని—

తానుగాని, తనవాళ్ళుగాని, తన కడుపున పుట్టిన పసిబిడ్డలుగాని ఆకలితో దహించుకుపోతుంటే పడేబాధ తెలిస్తేగాని, కనీసం సానుభూతితో ఆలోచించగలిగితేగాని, ఆకలిమంటలో నుండి తిరుగుబాటు ఎట్లా వస్తుందో అర్థంకాదు ఈనాడు తిరుగుబాటు భావాన్ని హర్షించలేనివాళ్ళలో తొంభైపాళ్ళు ఆకలికి అర్థం తెలియనివాళ్ళే. మిగి

లినవాళ్లు దేవుడికీ, పునర్జన్మలకీ, కర్మకీ, నక్షత్రాలకీ గొంతు బిగించుకున్నవాళ్ళు; సమాజంలోని అన్యాయం, దోపిడీ మొదలైన దేశదారిద్ర్యకారణాలు గూర్చిన అవగాహన లేనివాళ్ళు.

కవిత్వంగాని, కథగాని, ఉపన్యాసంగాని వ్యాసంగాని- ఏ ఒక్కటీ హఠాత్తుగా విప్లవం తీసుకురాదు. గేయాలు విప్లవాన్ని తెస్తయ్యా అనేవాళ్లు సాహిత్యతత్వం తెలియనివాళ్ళు. ఏకాలంలోనైనా కవి తన సామాజిక బాధ్యతను గుర్తించి, అగ్నిలో ఆజ్యంపోసినట్లుగా కవిత్వాన్ని రాస్తాడు. తన వాగ్బలంతో కొన్ని భావాల్ని బలంగా ప్రచారం చేస్తాడు. అంతవరకే కవి బాధ్యతా, సాహిత్య ప్రయోజనమూ ఈ కవిత్వం విప్లవం తెస్తుందా అనేవాళ్ళు— తమ విప్లవ వ్యతిరేకతని ఈవిధంగా వెలువరుస్తూ ఉంటారు- అంతే.

విప్లవాన్ని కోరేకవుల్లోనూ రియాక్షనరీ లున్నారు- కమ్యూనిష్టుల్లో దోపిడిదార్లున్నారు; పవిత్ర ఋషుల వైదికధర్మ ప్రచారకుల్లో ఇనప్పెట్టెలకోసం, భోగం కొంపలకోసం మాత్రమే బతికేవాళ్లున్నారు; హ్యూమనిష్టుల్లో ఇన్‌హ్యూమానిటీ పరాకాష్ఠకిపోయిన వాళ్లున్నారు- ఏకాలంలో ఏ భావవికాస చరిత్ర చూచినా ఈ లోపం తప్పదు. ఒక సిద్ధాంతాన్ని నమ్ముతున్న వ్యక్తులంతా ఒక Front గా ఏర్పడి, లోకక్షేమధ్యేయంతో, కృషి చెయ్యడమే దేనికైనా పరమార్థం. కొద్దిమంది వ్యక్తులవల్ల ఏమహోద్యమమూ అపార్థం చేసుకోబడరాదు తానుకోరని సిద్ధాంతాన్ని నమ్మేవ్యక్తుల దోషాల్ని వెదికేవాళ్ళ అభిప్రాయం- పరోక్షంగా ఆ సిద్ధాంతంమీది ద్వేషాన్ని ప్రకటించడమే తప్ప మరొకటికాదు—

ఇరవైమూడేళ్ళ దోపీడితో చిక్కి శల్యమైపోయిన ఈ దరిద్ర భారతంలో, ఇంకా కవులు తిరుగుబాటు ప్రోత్సహించకుండా, ఈ ధనస్వామ్యంతో లాలోచీపడే కవిత్వం రాయాలని కోరే వాళ్ళుండటం ఆశ్చర్యమే!

—అద్దేపల్లి రామమోహనరావు

# వరంగల్ మెడికల్ కాలెజ్‌లో శ్రీశ్రీపై నిషేధం

కొన్నాళ్ళ క్రితం శ్రీశ్రీ వరంగల్ ఆర్ట్స్&సైన్స్ కాలెజ్ భాషాసంఘాన్ని ఆవిష్క రించడానికి వచ్చాడు. ఆ సాయంత్రమే ట్రెయినింగ్ కాలేజ్‌లో ప్రస్తావన వశాత్తు ఆ కాలేజ్ ప్రిన్సిపల్‌గారికి Lenin and the New Trends in Modern Telugu Poetry and Drama ( తెలుగు సాహిత్యంపై లెనిన్ ప్రభావం ) అనే వ్యాసం పూర్తిగా చదివి వినిపించాడు. ఆ తరువాత జరిగిన సభలో ఆవిషయం చెప్పి శ్రీశ్రీని గొప్పగా ప్రశంసించారా ప్రిన్సిపల్‌గారు. నిజానికి శ్రీ శ్రీ ఏ సభలో మాట్లాడినా వేమన్న, గురజాడ, లెనిన్‌ల గురించి చెప్పకుండా ఉండడు. పైగా ఆవ్యాసం కేంద్ర సాహిత్య అకాడమీ లెనిన్ శతజయంతి సందర్భంగా శ్రీశ్రీతో రాయించి బెంగుళూరు సెమినార్‌లో చదివించింది. ఆవ్యాసం టైప్ చేయించమని శ్రీశ్రీ వి. ర. సం. కార్యవర్గ సభ్యుని కొకరికి యిచ్చివెళ్లాడు. ఆ మర్నాడు కాకతీయ వైద్యకళాశాల మ్యాగజైన్ ప్రధాన సంపాదకుడు అతని దగ్గరికివచ్చి ఆ ఇంగ్లీషు వ్యాసం మా మ్యాగజైన్‌లో వేసుకొంటాం మీకు అభ్యంతరం లేకుంటే యివ్వండి' అన్నాడట. కాలెజ్ మ్యాగజైన్‌కు శ్రీ శ్రీ వ్యాసం ఎందుకు అంటే లెనిన్ శతజయంతి కదా, మేం కూడ లెనిన్‌మీద ఒకవ్యాసం వేయదలిచాం– అందులో నూ శ్రీశ్రీ రాసిందంటే మయ కొవస్కీ రాసినంత విలువ' అన్నాడట. అతడు సంతోషంగా యిచ్చివేసాడు

ఏప్రిల్ 9వ తేదీన శ్రీశ్రీ, వి. ర. సం. వరంగల్‌శాఖ నిర్వహించిన కవితా గోష్ఠికి అధ్యక్షత వహించడానికి వచ్చాడు. బంగ్లాదేశ్‌ను గుర్తించమని ఝండు, మార్చ్‌లపై నిషేధాలను తొలగించమని ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రం పంపించడానికి ఆయన మేధావుల సంతకాలు సేకరిస్తున్నాడు. మద్రాసులో రాజమన్నారు, దేవులపల్లి కృష్ణశాస్త్రి. ఆరుద్ర మున్నగువారి సంతకాలు సేకరించాడు. ఆ ప్రియత్నంలోనే స్వయంగా కాకతీయ మెడికల్ కాలెజ్‌కు వెళ్లాడు. ప్రిన్సిపల్‌గారు చాల ఆదరంగా శ్రీశ్రీగారిని ఆహ్వానించి యాదృచ్ఛికంగా ఆదేరోజు వెలువడిన కాలెజి మ్యాగజైన్‌ను శ్రీ శ్రీ కి బహూకరించారు. బహూకరిస్తూ 'There is your article in it We feel it a privilege to have it ' అని అన్నారు. ఇంతదాకా కథ సజావుగానే సాగింది. శ్రీశ్రీనిగాని లెనిన్‌గాని, ట్రెయినింగ్ కాలెజ్ ప్రిన్సిపల్‌గాని, మెడికల్ కాలెజ్ ప్రిన్సిపల్‌గాని 'అంటరాని వాళ్ల'గాగాని, outcastes గాగాని భావించలేదు.

తరువాత కొన్ని రోజులకు 'Save literature' అని మెడికల్ కాలెజ్ విద్యార్థులే ఒక కరపత్రం పంచారు. అది చదివితే శ్రీశ్రీ రచనను ఆ మ్యాగజైన్ నుంచి తీసివేయడానికి ఒకకుట్ర జరుగుతున్నదని, యీకుట్ర వెనుక సాహిత్య ఛాందస నియంతృత్వం పనిచేస్తున్నదని అవగాహన అయింది. అయినా ఏ సంపాదకుడైతే మానుంచి శ్రీశ్రీ రచన కోరాడో ఏ ప్రిన్సిపల్‌గారయితే శ్రీశ్రీకి 'మీరచన మా మ్యాగజైన్‌లో వుండడం గర్వకారణం' అంటూ మ్యాగజైన్‌ను బహూకరించాడో వారిపైన శ్రీశ్రీ గౌరవాన్నీ. తమ గౌరవాన్నీ కాపాడుకునే బాధ్యతవున్నదని మేం మౌనం వహించాం. ఒకనెల రోజులు ఆ కాలెజ్‌లో ఏ 'కుంభకోణం' నడిచిందో మాకు తెలియదు. సంబంధంలేదు కాని ఇటీవలే విడుదలయిన ఆ మ్యాగజైన్‌లో మాత్రం శ్రీశ్రీ రచన చించివేయబడి వున్నది. విషయసూచికలోవుంది, సంపాదకీయంలో ప్రస్తావించబడి, లోపల రచనలేదు. ఇంత జరిగాక వి. ర సం. అధ్యక్షునికి జరిగిన యీ అవమానాన్ని మెడికల్ కాలెజ్ అంతరంగిక వ్యవహారంగా భావించి ఉపేక్ష వహించలేం. శ్రీశ్రీ రచన మెడికల్ కాలెజ్ మ్యాగజైన్‌లో చించేసినంత మాత్రాన కేంద్ర సాహిత్య అకాడమీ జర్నల్‌లోగాని, సృజనలోగాని లేకుండాపోలేదు. (సృజన ఫిబ్రవరి సంచికలో ఈవ్యాసం తెలుగు అనువాదం శ్రీశ్రీ చేసిందే ప్రచురించాం సం॥) రేపు అదే వ్యాసం ఇంకో పది పత్రికల్లో రావడంకూడ పెద్దసమస్యకాదు. కాని శ్రీశ్రీ అంతటి మహాకవి నుంచి రచన అడుక్కొని, వేసి, చించి పంచుతూవుంటే నీళ్ళు నములుతున్న సంపాదకుడూ 'స్వయంగా ముందర మీ రచన వుండడం గర్వకారణం' అని చెప్పి శ్రీశ్రీకి మ్యాగజైన్ బహూకరించి, వెనుక చించివేసి పంచిన ప్రిన్సిపల్‌గారూ ఎన్ని యువ హృదయాల్లోంచి శ్రీశ్రీని గాని లెనిన్‌నుగాని చించివేయగలరో యోచించుకొని నిద్రపోవడం మంచిది

—వరంగల్ వి. ర. సం శాఖ

SRJANA Telugu Monthly May 1971 Regd. No. 10953/67

When Lenin, midwiving the proletarian revolution, ushered in the birth of the "bare blood-red babe" of Socialism, world re-action ganged up under the leadership of Mssrs. Winston Churchill and company to strangle the baby at its birth. It was not to be, because: "Hands off Russia; roared the workers of the world. "All power to the Soviets" ordered Lenin. The Bible says "God sa.d, Let there be the world and there was the world". "Let those who believe in the holy Bible accept this as the gospel truth I, am atheist, am on firmer ground when I believe that when Lenin said, "Let there be Socialism" there was Socialism.

It is this Leninist synchrotron that is exciting the best creative writings in my language. Iam not competent to speak about all the other National Languages in our land, but in varying degrees of intensity poetry every where, I can sense, is simmering towards the boiling point. Historically, the progressive trend in Telugu poetry started in the [illegible] "Mahaprasthanam" (Forward March) group of poems were written in this decade. The London manifesto of the Indian Progressive Writers Association on the Literary front and the economic depression and the consequent social unrest on the political front had directly influenced many of my poems. Then the Telangana volcano erupted and Arudra burst forth with his "Twamevaham" (you only are I), which he origina'ly called "Telangana". Its content was the seething discontent of the day and its form was the brilliant technical virtuosity which only Arudra can display in a masterly manner.

సృజన చిరునామాలో మార్పు:
4/729
కుమార్‌పల్లి
హనుమకొండ,
వరంగల్ - 1 (ఆం. ప్ర.)

Folk lore forms came into their own with a revolutionary content. The agitation for a separate Andhra State was spear-headed by the most revolutionary political party of the Andhras and it had the fullest backing by the people It was then that the Praja Natya Manda'i with the active suport of the progessive writers was putting on boards such electrifying drama as 'Mundadugu' (Advance) and 'Maa Bhoomi' (Our Land), and the like. They were inspired by, and inspiring in turn, by all the Andhra–Telangana upheavals. Verily it was the people's stage No more contrived situations. No more stylized acting. It was life in the raw It was the Realism of the Here and Now. (I can retail an interesting side light here An Andhra Minister of the Madras cabinet wept in the theatre and the next thing he did was the banning of the Andhra Communist Party!).

The late Dr Raja Rao was the moving spirit behind the Praja Natya Mandali. He was a Veritable human dynamo. Himself a great actor, an authority on the Drama, east and west a master of disciplined stage-craft. he put all his heart and mind in to everything that he had undertaken. With his death Praja Natya Mandali itself was dead. But then I remain an optimist. Surely the stage is bigger than any individual [illegible] Things are bound to brighten up ere-long. There any number of signs warranting this hope.

సంవత్సర చందా: పది రూపాయలు
అర్ధ సంవత్సర చందా: ఆరు రూపాయలు
విడిప్రతి: ఒక రూపాయి

Gradually, Slowly, imperceptably the progressive wr'ters' movement also began to disintegrate Simu'taneous'y the miasmatic American influence was gaining ground every where Paper-backs from the U.S A. purveying sex, crime and violence were flooding the book stalls. The pious censors were turning a Nelson's eye towards Hollywood filth. The native cinema, never guilty of great art, was recking with vulgarity. Sex and detective magazines were doing roaring business.

To–day's most alive and vibrant poets in Telugu, the poets of the seventies are celebrating this gospel of godlessness. They are all rallying under the banner of Lenin. They are carrying the message of Marx. "No more exploitation of man by man' is the burden of their song. Not long ago, some of them were calling themselves 'Digambara' (Naked) poets and others 'Thirugabadu' (Rebelling) poets. But in this year of grace 1970 all their voices are shouting in unison; 'God is dead Long live Lenin;'

Edited Printed and Published by Varavararao for 'Sahithee Mithrulu'
82 Pages 100 Paise

SRI SRI